RNI NO TGTEL/25/A3369

సమస్త ప్రక్షాళనం

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక



- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

ప్రచురణ : సంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 134 , ఎడిటర్ : జె. భాస్కర్, గురువారం11-06-2026 పేజీలు : 12 వెల : 2/-



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి.. మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!

- గతంలో వీపనగండ్ల వెళ్లినప్పుడు మినీ స్టేడియం కావాలని జూపల్లిని అడిగిన స్థానిక యువత
- తన సొంత భూమి ఇస్తానని నాడు మాట ఇచ్చిన జూపల్లి
- రూ. 1.50 కోట్లకు పైగా విలువున్న భూమిని విరాళంగా ఇచ్చిన మంత్రి

రాజకీయాల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే నేతలు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో తాను ఒకడినని నిరూపించుకున్నారు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. యువత, క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఆయన ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని కేటాయిస్తూ బుధవారం అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు. గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు

మిగతా 2లో

## ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు



- ఆధునిక భారతదేశానికి నూతన నగరంగా ఫ్యూచర్ సిటీ నిలవబోతోందని వ్యాఖ్య
- ప్రపంచంలోని గొప్ప నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం

తెలంగాణ చరిత్రలో ఒక సరికొత్త మైలురాయి లిఖించబడబోతోంది. హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచస్థాయికి తీసుకెళ్లే 'భారత్ ఫ్యూచర్ సిటీ' కల సాకారమయ్యేందుకు తొలి అడుగు పడింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సాయంత్రం అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ భవన ప్రారంభోత్సవం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగించనున్నారు.ఈ చారిత్రాత్మక సందర్భంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. "ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు. ఆధునిక భారతదేశానికి నూతన నగరంగా ఈ భారత్ ఫ్యూచర్ సిటీ నిలవబోతోంది" అని అత్యంత ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అథారిటీ భవనాన్ని కేవలం 6 నెలల రికార్డు సమయంలోనే నిర్మించి పూర్తి చేయడం విశేషం. దాదాపు రూ.20 కోట్ల వ్యయంతో, 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక భవనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు.

2



2లో

## అదే అసలైన పరీక్ష.. అలా పనిచేసేవారే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటారు

- సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీ
- ఎన్నికైన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకుని అరుదైన ఘనత
- ప్రజాసేవే సుపరిపాలనకు అసలైన పరీక్ష అని 'ఎక్స్'లో పేర్కొన్న ప్రధాని
- అంకితభావం, వినమ్రత, కర్తవ్య దీక్షతో పనిచేసేవారే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటారని వ్యాఖ్య
- మోదీ రికార్డుపై ఢిల్లీలో ఎన్డీఏ కూటమి ప్రత్యేక సమావేశం, వేడుకలు

## 'ఇప్పటికే చాలా ఆలస్యమైంది- మూల్యం చెల్లించుకోక తప్పదు'- ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

- ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ చాలా ఎక్కువ సమయం తీసుకుంటోందన్న డొనాల్డ్ ట్రంప్
- భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే అని వ్యాఖ్యలు



2లో

## ప్రధాని మోదీకి కేంద్ర కేబినెట్ స్టాండింగ్ ఒవేషన్

- దేశాన్ని ఎక్కువ రోజులు పాలించిన నేతకు అభినందనలు
- ప్రధాని మోదీని అభినందిస్తూ కేంద్ర కేబినెట్ తీర్మానం
- అధిక కాలం పనిచేసిన ప్రధానిగా నిలిచినందుకు అభినందనలు



2లో

## 2047 వరకు మోదీయే ప్రధానిగా కొనసాగాలి: బండి సంజయ్



2లో

- ప్రధానిగా నెహ్రూ రికార్డును మోదీ బద్దలు కొట్టారన్న బండి సంజయ్
- అత్యధిక కాలం ప్రధానిగా మోదీ పేరు లిఖించబడిందని హర్షం
- మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఎన్నికల కమిషన్ పరిధిలోనిదని వ్యాఖ్య



2లో

## అత్యాశ వదులుకుంటేనే సైబర్ క్రైమ్ కంట్రోల్ అవుతుంది : డీజీపీ సీవీ ఆనంద్

- తెలంగాణలో నక్సలిజం పూర్తిగా పోయిందని డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటన
- మావోయిస్టుల ఏరివేత కోసం ఏర్పాటు చేసిన బలగాలను ఇతర సేవలకు వినియోగిస్తామని వెల్లడి
- పెరుగుతున్న సైబర్ నేరాలపై ఆందోళన

## ఆ చిట్టీ ఇచ్చింది మీ వాళ్లే: మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై బీజేపీ మంత్రి సంచలన వ్యాఖ్యలు

- మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు షాక్
- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ
- ఆమెపై కేసులు ఉన్నాయనే విషయాన్ని టీకాంగ్రెస్ నేతలే లీక్ చేశారన్న విజయ్‌వర్గీయ



2లో




2లో

## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి.. ఆదేశాల ఉల్లంఘనపై సీరియస్

- కోర్టు ధిక్కరణ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీరుపై హైకోర్టు అసంతృప్తి
- భూ వివాదాల్లో కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్నారని ఆరోపణలు
- గతంలోనూ కమిషనర్‌కు పలుమార్లు నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం చట్టానికి ఎవరూ అతీతులు కారని హైకోర్టు స్పష్టీకరణ
- తాజా విచారణలో కమిషనర్ నుంచి పూర్తి వివరణ కోరిన కోర్టు

## ప్రధానిగా నెహ్రూ రికార్డును బ్రేక్ చేసిన నరేంద్రమోదీ.. తెలంగాణ బీజేపీ చీఫ్ స్పందన

- సుదీర్ఘకాలం ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీ
- నిరంతరాయంగా 4,399 రోజులు ప్రధానిగా సేవలు
- ఇది చారిత్రక మైలురాయి అంటూ రామచంద్రరావు ప్రశంస
- మోదీ పాలనలో దేశం స్వర్ణయుగాన్ని చూస్తోందన్న రామచంద్రరావు ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతూ కేంద్ర కేబినెట్ తీర్మానం



2లో

# అదే అసలైన పరీక్ష.. అలా పనిచేసేవారే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటారు: ప్రధాని మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత రాజకీయాల్లో మరో అరుదైన మైలురాయిని అందుకున్నారు. దేశానికి సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా సేవలు అందించిన ఎన్నికైన ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును ఆయన అధిగమించారు. బుధవారం నాటికి ప్రధానిగా మోదీ పదవీకాలం 12 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు పూర్తయిన వేళ సంబరాలు జరుపుకోవడానికి కూటమి సిద్ధమైంది. ఈ చారిత్రక ఘట్టంపై ప్రధాని మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "ప్రజలకు సేవ చేయడమే సుపరిపాలనకు అసలైన పరీక్ష. అంకితభావం, వినమ్రత, కర్తవ్య దీక్షతో నిరంతరం పనిచేసేవారే ప్రజల విశ్వాసాన్ని చూరగొంటారు" అని ఆయన పేర్కొన్నారు.

**నెహ్రూ రికార్డును అధిగమించిన మోదీ.. సుదీర్ఘకాల ప్రధానిగా కొత్త చరిత్ర :** ప్రధానిగా మోదీ నిరంతరాయంగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. గతంలో ఈ రికార్డు జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉండేది. దేశానికి తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగిన 1952 నుంచి నెహ్రూ పదవీకాలాన్ని ఈ పోలిక కోసం పరిగణనలోకి తీసుకున్నారు. అంతకుముందు 1947 నుంచి 1952 వరకు ఆయన తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. ఇందిరా గాంధీ 14 ఏళ్లకు పైగా ప్రధానిగా పనిచేసినప్పటికీ, ఆమె పదవీకాలం నిరంతరాయంగా కొనసాగలేదు. దీంతో వరుసగా ఎన్నికై సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగుతున్న వ్యక్తిగా మోదీ చరిత్ర సృష్టించారు. 2014లో తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, 2019లో రెండోసారి, 2024లో చారిత్రాత్మకంగా మూడోసారి విజయం సాధించి అధికారంలో కొనసాగుతున్నారు. మోదీ నాయకత్వంలోని 12 ఏళ్ల పాలనలో కొత్త పార్లమెంట్ భవనం, సెంట్రల్ విస్టా, కర్తవ్య పథ్, వందే భారత్ రైళ్లు, స్టాట్యూ ఆఫ్ యూనిటీ, ఐఎన్ఎస్ విక్రాంత్, కశ్మీర్ రైల్ లింక్, నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం, నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్, గంగా ఎక్స్‌ప్రెస్‌వే వంటి అనేక ప్రతిష్టాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయి.

ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని నేడు ఢిల్లీలోని భారత్ మండపంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) కీలక సమావేశం నిర్వహిస్తోంది. ఈ వేడుకకు ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలు, 22 ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, భాగస్వామ్య పక్షాల నేతలు హాజరుకానున్నారు. నెహ్రూ రికార్డును అధిగమించినందుకు ప్రధాని మోదీని అభినందిస్తూ ఎన్డీఏ ఈ సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించనున్నట్లు సమాచారం.

# 'ఇప్పటికే చాలా ఆలస్యమైంది- మూల్యం చెల్లించుకోక తప్పదు'- ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగిన వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ చాలా ఎక్కువ సమయం తీసుకుంటోందని అన్నారు. ఇప్పుడు అందుకు ఇరాన్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో ఈ కామెంట్స్ చేశారు. ఇక్కడ మూల్యం చెల్లించుకోవడం అంటే ఏంటో, ఏ విధంగా చర్యలు తీసుకుంటారో స్పష్టమైన అర్థం వచ్చేలా ట్రంప్ వెల్లడించలేదు. బుధవారం తెల్లవారుజామున ఇరు దేశాలు పరస్పరం భీకర దాడులు చేసుకున్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. 'ఇరాన్‌కు ఎంతో మేలు చేకూర్చే ఒప్పందం కుదుర్చుకునేందుకు వారు చాలా ఎక్కువ సమయం తీసుకున్నారు. ఇప్పుడు ఆ ఆలస్యానికి మూల్యం చెల్లించుకోక తప్పదు.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

పశ్చిమాసియాలో రెండు దేశాలు తాత్కాలిక శాంతి ఒప్పందానికి చేరువైన సమయంలో ట్రంప్ చేసిన కామెంట్స్ హాట్ టాపిక్‌గా మారాయి. వాస్తవానికి గత వారంలో అమెరికా- ఇరాన్ డీల్‌కు అతి చేరువయ్యాయని, కానీ ట్రంప్ సంతకం ఒక్కటే పెండింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈలోపే మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. తొలుత ఇజ్రాయెల్.. లెబనాన్‌పై విరుచుకుపడగా, తర్వాత ఇరాన్ ప్రతిదాడులు చేసింది. ఈ విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును కూడా ట్రంప్ హెచ్చరించారు. దాడులు చేయొద్దని కోరారు. కానీ ఈ వారం అమెరికానే దాడులు చేస్తోంది. హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్ మంగళవారం తెల్లవారుజామున కూలిపోయింది. ఒమన్ తీరం వెంట గస్తీ నిర్వహిస్తుండగా ఇరాన్ తమ హెలికాప్టర్‌ను కూల్చేసినట్లు స్వయంగా ట్రంప్ ప్రకటించారు. ప్రతీకార దాడులు చేస్తామని తొలుత హెచ్చరించి బుధవారం ఉదయం భీకర దాడులు చేశారు.

అమెరికా దాడులకు ఇరాన్ కూడా అంతే దీటుగా స్పందిస్తోంది. సమీప గల్ఫ్ దేశాల్లోని అగ్రరాజ్య సైనిక స్థావరాలు లక్ష్యంగా దాడులు నిర్వహిస్తోంది. పశ్చిమాసియాలో తాజా దాడుల నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు మరోసారి పెరిగాయి. కిందటి రోజు బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 90 డాలర్లకు పడిపోగా ఇప్పుడు 92 డాలర్లకు చేరింది.

# ప్రధాని మోదీకి కేంద్ర కేబినెట్ స్టాండింగ్ ఒవేషన్

ప్రధానిగా ఎక్కువ రోజులు దేశాన్ని పాలించి రికార్డు సృష్టించిన నరేంద్ర మోదీని అభినందిస్తూ కేంద్ర మంత్రివర్గం బుధవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. అంతేకాదు కేంద్ర మంత్రులు కేబినెట్ సమావేశంలో లేచి నిలబడి ఘనంగా ఆయనకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ప్రధానిగా నరేంద్ర మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. మొదటి సార్వత్రిక ఎన్నికల తర్వాత అత్యధిక కాలం అంటే వరుసగా 4,398 రోజులపాటు ప్రధానిగా సేవలు అందించిన మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఈ రోజుతో మోదీ అధిగమించారు. ఈ నేపథ్యంలో కేబినెట్ మంత్రులు ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు.

**నాకు ఇదే అసలైన పరీక్ష!..** ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ స్పందిస్తూ, ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అత్యంత పెద్ద పరీక్ష అని పేర్కొన్నారు. ఎక్స్‌లో ఓ సంస్కృత శ్లోకాన్ని ఆయన పోస్టు చేస్తూ దాని భావాన్ని వివరించారు. వినయం, అంకితభావం, కర్తవ్య నిష్ఠ అనేవి ప్రజల నమ్మకాన్ని సంపాదించడానికి అవసరమైన సద్గుణాలు అని అన్నారు. "ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య నిష్ఠతో నిరంతరం పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందుతాడు. 'సదనురక్తప్రకృతిః ప్రజాపాలనతత్పరః వినీతాత్మా హి నృపతిర్భూయసీం శ్రియమశ్నుతే'- దీని అర్థం ఏమిటంటే, ఎవరైతే ఎల్లప్పుడూ ప్రజల సంరక్షణకు అంకితమవుతారో, వినయపూర్వకమైన మనస్తత్వం కలిగిన ఆ పాలకుడే మరింత గొప్ప సంపదను, శ్రేయస్సును పొందుతాడు."

**స్వతంత్ర భారత చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం!..** ప్రధాని మోదీ సాధించిన ఈ ఘనతపై ఎన్డీఏ నేతలతోపాటు, వివిధ దేశాల నేతలు, పలు రంగాల ప్రముఖులు నుంచి అభినందనలు తెలియజేశారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ, "మోదీ 12 ఏళ్ల పాలనా కాలాన్ని స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఒక గొప్ప మైలురాయి" అని అభివర్ణించారు. వలస రాజ్యాల పాలన వల్ల భారతీయులలో నాటుకుపోయిన న్యూనతా భావాన్ని దూరం చేయడానికి మోదీ సర్కార్ చేసిన కృషిని ఆయన కొనియాడారు.

**ప్రత్యేక ప్రార్థనలు...** ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, మన్సుఖ్ మాండవీయ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త సహా వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నేతలు ప్రధాని మోదీ తరఫున ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయాల్లో మోదీ తరఫున పూజలు నిర్వహించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, భారత్‌లో అత్యధిక కాలం సేవలు అందించిన ఎన్నికైన ప్రధానిగా మోదీ నిలవడంపై ప్రశంసలు కురిపించారు. ఇది మోదీ పట్ల కోట్లాది మంది భారతీయుల ప్రేమ, నమ్మకం, అపారమైన ప్రజా మద్దతుకు నిదర్శనమని అన్నారు. ప్రధాని మోదీ సాగించిన ఈ 4,399 రోజుల ప్రయాణం శక్తివంతమైన, సంపన్నమైన, అభివృద్ధి చెందిన, స్వయంసమృద్ధ (ఆత్మనిర్భర్) భారత్ నిర్మాణంలో ఒక 'సువర్ణ అధ్యాయం' అని ఆయన కొనియాడారు. భారత్‌ను అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ వేదికపై భారత్ ఎదుగుదలకు మోదీ చేస్తున్న అపారమైన కృషిని మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కొనియాడారు. ఇక భారత్‌లో అమెరికా రాయబారిగా ఉన్న సెర్గియో గోర్ కూడా మోదీపై ప్రశంసలు కురిపించారు. "భారత్‌లో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన నరేంద్ర మోదీకి అభినందనలు. ఈ ఘనత దశాబ్దాలుగా ఆయన అంకితభావంతో చేసిన ప్రజాసేవకు, బలమైన నాయకత్వానికి నిదర్శనం. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు" అని అన్నారు.

# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి.. ఆదేశాల ఉల్లంఘనపై సీరియస్

కోర్టు ధిక్కరణ కేసుకు సంబంధించి 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కమిషనర్ ఏవీ రంగనాథ్ తీరుపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను పదేపదే ధిక్కరించడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివాదాస్పద ఆస్తుల వ్యవహారంలో కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలపై దాఖలైన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా వివాదాస్పద స్థలాల్లో సైన్ బోర్డుల తొలగింపు, యథాతథ స్థితి (స్టేటస్ కో) పాటించకపోవడం వంటి అంశాలను కోర్టు ప్రస్తావించింది. కమిషనర్ అనుసరిస్తున్న వైఖరి, ప్రక్రియాపరమైన లోపాలపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరణ ఇచ్చే అవకాశాన్ని వినియోగించుకోకపోవడాన్ని తప్పుబట్టింది. విచారణకు గైర్హాజరవుతూ మినహాయింపు కోరుతూ కనీసం అఫిడవిట్ కూడా దాఖలు చేయకపోవడం ఆయన నిర్లక్ష్యానికి నిదర్శనమని ఘాటు వ్యాఖ్యలు చేసింది.

హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, 20 రోజుల వరకు బోర్డును ఎందుకు తొలగించలేదో, విచారణకు ఎందుకు హాజరు కాలేదో వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ధర్మాసనం విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది. అనంతరం హైడ్రా తరఫు న్యాయవాది అఫిడవిట్ సమర్పించడంతో వ్యక్తిగత హాజరు నుంచి కమిషనర్‌కు మినహాయింపునిచ్చింది.

అయితే, దాఖలు చేసిన అఫిడవిట్ అసంపూర్తిగా, నిర్లక్ష్యంగా ఉందని అభిప్రాయపడిన కోర్టు.. మరింత సమగ్రమైన నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం రంగనాథ్ వృత్తిపరమైన కెరీర్‌పై ప్రభావం చూపుతుందని, ఈ విషయాన్ని ఆయనకు స్పష్టం చేయాలని న్యాయవాదికి సూచిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## ప్రధానిగా నెహ్రూ రికార్డును బ్రేక్ చేసిన నరేంద్ర మోదీ.. తెలంగాణ బీజేపీ చీఫ్ స్పందన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగిన నేతగా జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. నెహ్రూ 4,398 రోజుల పాటు ఈ పదవిలో ఉండగా, మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకుని నూతన చరిత్రను లిఖించారు.ఌఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణకు చెందిన బీజేపీ నాయకులు రామచంద్రరావు ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

140 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు, అచంచలమైన నమ్మకానికి మోదీ నిదర్శనమని, ఆయన పదవీకాలం దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని కొనియాడారు. నరేంద్ర మోదీ 2014 మే 26న తొలిసారిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2019లో రెండోసారి, 2024 జూన్ 9న సంకీర్ణ ప్రభుత్వ సారథిగా మూడోసారి పగ్గాలు చేపట్టారు.

మోదీ నాయకత్వంలో పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజం అణచివేత, సరిహద్దుల బలోపేతం వంటి కీలక రంగాల్లో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని రామచంద్రరావు వివరించారు. మరోవైపు, ప్రధాని మోదీ ఘనతను అభినందిస్తూ కేంద్ర కేబినెట్ తీర్మానం చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచి ఎలక్ట్రోలైట్స్‌ను పెంచే ఆరోగ్యకరమైన చట్నీలు ఇవే..!

వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ శరీరంలో నీటి లోపం, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత, అలసట వంటి సమస్యలు పెరిగి హీట్ స్ట్రెస్‌కు దారితీస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో శరీరాన్ని లోపల నుంచి చల్లబరచే ఆహారాలు తీసుకోవడం అవసరం. సంప్రదాయ భారతీయ ఆహారాల్లో కెరి (పచ్చి మామిడి) చట్నీ, పుదీనా చట్నీలను వేసవిలో ప్రత్యేకంగా ఉపయోగపడే పదార్థాలుగా గుర్తించారు. పచ్చి మామిడి చట్నీ శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా చెమట ద్వారా కోల్పోయే లవణాలను భర్తీ చేయడంలో ఇది ఉపయోగకరంగా ఉంటుంది. వేసవిలో నీటి లోపం కారణంగా శరీరం అలసటకు గురికాకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. అంతేకాకుండా జీర్ణక్రియను మెరుగుపరచి ఆకలిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. పచ్చి మామిడిలో ఉండే పులుపు రుచి జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపించి ఆహారం జీర్ణం కావడాన్ని సులభతరం చేస్తుంది. హీట్ స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**పుదీనా చట్నీ..** పుదీనా చట్నీని కూడా వేసవిలో శరీరానికి చల్లదనాన్ని అందించే ఆహారంగా పరిగణిస్తారు. ఇందులో ఉండే మెంథాల్ అనే సమ్మేళనం శరీరానికి చల్లదనాన్ని కలిగించే లక్షణాలను కలిగి ఉంటుంది. పుదీనా జీర్ణక్రియను మెరుగుపరచి కడుపు ఉబ్బరం, అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. వేసవిలో అధిక వేడి కారణంగా మందగించే జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో ఇది ఉపయోగకరంగా ఉంటుంది. అదనంగా దీనికి స్వల్ప వాపు నిరోధక లక్షణాలు కూడా ఉంటాయి. పుదీనా చట్నీని పెరుగు, కొత్తిమీర, నిమ్మరసంతో కలిపి తయారుచేస్తే దాని శీతలీకరణ, జీర్ణక్రియకు సంబంధించిన ప్రయోజనాలు మరింత పెరుగుతాయి. ప్రధాన భోజనంతోపాటు చిన్న పరిమాణంలో తీసుకోవడం ద్వారా జీర్ణాశయ సౌకర్యాన్ని కలిగిస్తాయి.



**హీట్ స్ట్రెస్ నివారణలో..** హీట్ స్ట్రెస్ నివారణ విషయంలో పచ్చి మామిడి చట్నీ, పుదీనా చట్నీ రెండింటికీ ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయి. శరీరంలో కోల్పోయిన లవణాలను భర్తీ చేయడం, డీహైడ్రేషన్ ప్రమాదాన్ని తగ్గించడం కోసం పచ్చి మామిడి చట్నీ ఉపయోగపడితే, జీర్ణక్రియ మెరుగుపరచడం, అంతర్గత చల్లదనాన్ని అందించడం కోసం పుదీనా చట్నీ ఉపయోగపడుతుంది. అందువల్ల వేసవిలో ఈ రెండింటినీ పరిమిత మోతాదులో ఆహారంలో చేర్చుకోవచ్చు. అయితే చట్నీల తయారీలో ఉప్పును అధికంగా ఉపయోగించకూడదు. అలాగే ఎప్పుడూ తాజాగా తయారుచేసిన చట్నీలనే తీసుకోవడం మంచిది. ఆమ్లత్వం లేదా గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు మాత్రం పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. వేసవిలో హీట్ స్ట్రెస్‌ను తగ్గించేందుకు చట్నీలతోపాటు మజ్జిగ, కొబ్బరి నీరు, పుచ్చకాయ, దోసకాయ, నిమ్మరసం వంటి ఆహారాలు కూడా ఉపయోగకరంగా ఉంటాయి. సరైన ఆహారం, తగినంత ద్రవపదార్థాల వినియోగం ద్వారా వేసవి వేడి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు.

## ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు

ప్రణాళిక, సాంకేతికత, సుస్థిర అభివృద్ధికి ఈ ఫ్యూచర్ సిటీ ఒక నిలువెత్తు ప్రతీకగా మారబోతోందని సీఎం వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌లోని మరో విశేషం ఏంటంటే.. ఈ భవనం ప్రారంభం కాకముందే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (IGBC) నుండి 'నెట్ జీరో' (Net Zero) భవనంగా గుర్తింపు పొందింది. అంటే పర్యావరణానికి ఎలాంటి హాని చేయకుండా, సహజ వనరుల వినియోగంతో ఈ కార్యాలయాన్ని రూపొందించారు. ప్రపంచంలోని అత్యంత గొప్ప నగరాల్లో ఒకటిగా ఈ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని సీఎం స్పష్టం చేశారు.

హైదరాబాద్ నగర శివారులోని మీర్‌ఖాన్‌పేట్ సమీపంలోని ఎఫ్‌సీడీసీఏ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో పాలనను సమర్థవంతంగా, సాంకేతికంగా అందించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. రెండెకరాల విస్తీర్ణంలో నిర్మించిన భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ-ఎఫ్‌సీడీఏ కార్యాలయం సేవలు అందించనుంది.

ఎఫ్‌సీడీఏ కమిషనర్ శంశాక ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు ఆ కార్యాలయ విశిష్టతలపై ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయ భవనం ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి పర్యావరణ మిత్ర బిల్డింగ్‌గా గుర్తింపు దక్కించుకుంది. భవన నిర్మాణంలో పర్యావరణానికి హాని కలిగించని పదార్థాలను వినియోగించడం, సౌర విద్యుత్ వినియోగం వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని దీన్ని నెట్ జీరో బిల్డింగ్‌గా ఎంపిక చేశారు. ఫ్యూచర్ సిటీ పరిధిలోని 56 గ్రామాల్లో ఇళ్లు, పరిశ్రమలు, ఐటీ సంస్థలు, బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలకు సంబంధించిన నిర్మాణ అనుమతులను ఈ కార్యాలయం నుంచే మంజూరు చేయనున్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జూపల్లి.. మినీ స్టేడియం కోసం సొంత భూమి విరాళం!

వెళ్లిన సమయంలో.. అక్కడ స్థానిక యువత, క్రీడాకారులు తమకు ఒక మినీ స్టేడియం కావాలని మంత్రి జూపల్లిని అభ్యర్థించారు. వారి కోరికపై సానుకూలంగా స్పందించిన మంత్రి, స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని ఇస్తానని నాడు మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ.. వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెం. 532/ఆ లో తన పేరిట ఉన్న 4 ఎకరాల భూమిని క్రీడాకారుల అభివృద్ధి కోసం అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ భూ బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా పూర్తయింది. వీపనగండ్ల మండల తహశీల్దార్ లాగిన్ ద్వారా నిర్వహించిన ఈ ఆన్‌లైన్ ప్రక్రియలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేసి భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు.

మంత్రి కేటాయించిన ఈ నాలుగు ఎకరాల భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ. 1.50 కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ చారిత్రాత్మక భూ బదిలీ ప్రక్రియకు సాక్షులుగా కాంగ్రెస్ నాయకుడు మునిగొండ గోపి, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ డిజిటల్ సంతకాలు చేశారు. మంత్రి తీసుకున్న ఈ ఉదార నిర్ణయంపై వీపనగండ్ల మండల ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే.. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతమైన ప్రతిభ గల యువకులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఒక గొప్ప వేదిక లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అత్యాశ వదులుకుంటేనే సైబర్ క్రైమ్ కంట్రోల్ అవుతుంది : డీజీపీ సీవీ ఆనంద్

అత్యాశ వదులుకుంటేనే సైబర్ క్రైమ్ కంట్రోల్ అవుతుందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అదిలాబాద్ జిలాల్లో పర్యటించిన డీజీపీ, రాష్ట్రంలో మావోయిస్టుల స్థితి, లా అండ్ ఆర్డర్‌పై స్పందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మావోయిస్టులందరూ పోలీసులకు లొంగిపోయారని డీజీపీ తెలిపారు. రాష్ట్రంలో నక్సలిజం లేదని ప్రకటించారు. మావోయిస్టులకు రివార్డులు కూడా ఇచ్చేశామని, ప్రస్తుతం వారికి ఉపాధి కల్పించే పనిలో ఉన్నామని పేర్కొన్నారు. మావోయిస్టులే లేనందున వారి ఏరివేత కోసం ఏర్పాటు చేసిన బలగాలను ఇతర సేవలకు వినియోగిస్తామని వివరించారు. మాజీ మావోయిస్టులకు ఇళ్ల పట్టాలు : దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఉనికి లేదని, ఆ పార్టీలో ఒకరిద్దరు మాత్రమే మిగిలి ఉన్నారని, అందుకోసం వారి నియంత్రణ కోసం గ్రేహౌండ్స్ దళాల్లో ఉన్న 1200 మంది సిబ్బందిలో 500 మందిని తగ్గించి వివిధ విభాగాల్లో సర్దుబాటు చేస్తామని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయన ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. గుడిహత్నూర్ మండలం తోషంలో ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. వారితో కలిసి లొంగిపోయిన ముగ్గురు మాజీ మావోయిస్టులకు ఇళ్ల పట్టాలు, వాహనదారులకు హెల్మెట్లు, స్థానికులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆదిలాబాద్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, పిల్లల పార్కు, కమాండ్ కంట్రోల్ రూంలను ప్రారంభించారు.

అనంతరం ఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గ్రేహౌండ్స్ విభాగానికి 1700 పోస్టులు మంజూరైతే 1200 మంది పని చేస్తున్నారని, వారిలో 500 సిబ్బందిని ఇతర కార్యక్రమాల్లో సర్దుబాటు చేస్తామని వెల్లడించారు. "30, 40 సంవత్సరాల నుంచి మన రాష్ట్రం మొత్తం ఒకే ఆలోచనతో పని చేసింది. అంటే నక్సలైట్లు, మావోయిజం దానిని ఎదుర్కొడానికి సంస్థల్ని ఏర్పాటు చేశాం. గ్రేహౌండ్స్, ఎస్ఐబీ ఇటువంటివి. కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవటం వల్ల అది ఇప్పుడు పూర్తిగా పోయిందని మనం భావించవచ్చు. టాప్ క్యాడర్లు ఎవరైతే ఉన్నారో సెంటర్ కమిటీ మెంబర్స్ అందరూ కూడా సరెండర్ అయిపోయారు. లేకపోతే ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. ఆ సమస్య మనకు ఇప్పుడు పోయింది కనుక ఆ సంస్థలోని ఫోర్స్‌ను తగ్గించాం. డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్, ట్రాఫిక్, హైవే ఆక్సిడెంట్స్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏవైతే ఉన్నాయో దాని వింగ్స్, ట్రాఫిక్ మ్యానేజ్‌మెంట్ బ్యూరో ఇటువంటి కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం. కొత్త దిశలో మా డిపార్ట్‌మెంట్ అంతా పయనిస్తుంది" – సీవీ ఆనంద్, డీజీపీ యువత పెడదారి పడుతున్నారు : తెలంగాణ రాష్ట్రంలో మాదక ద్రవ్యాలపై కఠినంగా వ్యవహరిస్తామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నక్సలిజం అంతరించిన మాదకద్రవ్యాల వినియోగంతో యువత పెడదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తప్పక హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా తొలుత పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

## 2047 వరకు మోదీయే పధానిగా కొనసాగాలి: బండి సంజయ్

భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన అరుదైన రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని హర్షం వ్యక్తం చేశారు. "రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. ఆయన తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా కేంద్ర ఎన్నికల కమిషన్ (జుజ×) పరిధిలోని అంశమని స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ జోక్యం ఏమీ లేదని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## ఆ చిట్టీ ఇచ్చింది మీ వాళ్లే: మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై బీజేపీ మంత్రి సంచలన వ్యాఖ్యలు

మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ తగిలింది. కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం తిరస్కరించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ నిర్ణయానికి నిరసనగా కాంగ్రెస్ అగ్రనేతలు ఢిల్లీలోని ఈసీ కార్యాలయం ముందు బైఠాయించగా... తమకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే, ఈ హైడ్రామా నడుస్తున్న తరుణంలో మధ్యప్రదేశ్ బీజేపీ కీలక మంత్రి కైలాష్ విజయ్‌వర్గీయ ఒక పొలిటికల్ బాంబు పేల్చారు. మీడియాతో మాట్లాడిన మంత్రి కైలాష్ విజయ్‌వర్గీయ..

"అసలు మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో కేసులు ఉన్నాయనే విషయం మాకు ముందే తెలియదు. మాకు ఆ సమాచారం ఇచ్చింది, అక్కడి నుండి చిట్టీ పంపింది స్వయంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలే" అని కుండబద్దలు కొట్టారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేసిన ఆయన.. సొంత పార్టీ నేతలే ఆమెపై ఉన్న కేసుల వివరాలను లీక్ చేశారంటే, ఆ పార్టీ అంతర్గత వ్యవహారాలు ఎంత ఘోరంగా ఉన్నాయో ప్రజలకే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ లో కలకలం రేపుతున్నాయి.

## ఆర్జీకే చిరు వ్యాపారుల షాపులు తొలగించవద్దు

### ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాలు



కుత్బుల్లాపూర్, జూన్ 10 (సమస్త ప్రక్షాళనం ప్రతినిధి):జగద్గిరిగుట్ట డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) సముదాయంలో జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల షాపులను తొలగించవద్దని కోరుతూ ఆర్జీకే సంక్షేమ సంఘం నాయకులు, వ్యాపారులు బుధవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్‌తో పాటు జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్జీకే సముదాయంలో గత 18 ఏళ్లుగా సుమారు 1,779 కుటుంబాలు, దాదాపు 7 వేల మంది జనాభా నివసిస్తున్నప్పటికీ స్థానికంగా ఎలాంటి షాపింగ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలు జీవనోపాధి కోసం గత 18 సంవత్సరాలనుండి చిన్నచిన్న షాపులు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు మూడు రోజుల్లోగా స్వచ్ఛందంగా షాపులను తొలగించుకోవాలని, లేనిపక్షంలో జేసీబీల సహాయంతో తొలగిస్తామని హెచ్చరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా షాపులను తొలగిస్తే వందలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొంటుందని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. కాబట్టి తమ జీవనాధారమైన షాపులను తొలగించకుండా యథావిధిగా వ్యాపారాలు కొనసాగించుకునే అవకాశం కల్పించి న్యాయం చేయాలని ఎమ్మెల్యే, అధికారులను కోరినట్లు తెలిపారు.

## అంబేద్కర్ విగ్ర ఆవిష్కరణకు విరాళం. రూ 50 వెయ్యిలు

## ప్రముఖ సంఘ సేవకులు బండారి సంతోష గంగాధర్.



మెదక్ జిల్లా శివంపేట్ జూన్ 10 ( సమస్త పక్షాలనశీ న్యూస్): నాయకులు ప్రముఖ సంఘ సేవకులు మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి సంతోష& గంగాధర్ గారులి తన వంతు సహాయంగా రూ 50 వెయ్యిల రూపాయలు విరాళాన్ని నిర్వాహకులకు
అందజేయడం జరిగింది ఈ సందర్భంగా బండారి గంగాధర్ మాట్లాడుతూ గ్రామాలలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని. మన పిల్లుట్ల గ్రామంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కొందరివాడు కాదు అందరివాడు అని విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయంగా ఉందని భావించడం జరిగింది... అలాగే మన మన గ్రామంలో మహనీయుల విగ్రహాలకు గాని గ్రామ అభివృద్ధికి కానీ తీర్చిదిద్దడానికి తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటానని వారు చెప్పడం జరిగింది...., అడిగిన వెంటనే కాదనకుండా విరాళాన్ని అందజేసిన దాత బండారి గంగాధర్. అంబేద్కర్ యువజన సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది....
ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అడ్వైజర్ ముంద్రాతి బాలేష్. వార్డు సభ్యులు బుచ్చి బాలేష్. ఈరన్ రాజు. ముంద్రాతి బాబు. దాసరి కృష్ణ. జోగు ఏసు. మొనగారి బంటి. తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయురారోగ్య ఉండాలని ప్రత్యేక పూజలు



సమస్త ప్రక్షాళనం/హత్నూర: భారత ప్రధానిగా నరేంద్ర మోడీ వలన 12 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని దత్తాచల క్షేత్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమం చేయించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బక్కన్న గారి రాజా మల్ల రెడ్డి, మాట్లాడుతూ దేశ ప్రధానిగా సుదీర్ఘంగా సేవలు అందిస్తున్నటువంటి నరేంద్ర మోడీ సుభిక్షంగా ఉండాలని దేశాన్ని అన్ని రంగాల అభివృద్ధి చేసి ప్రపంచంలో అగ్రగామిగా నిలుపుతారని రానున్న రోజుల్లో నరేంద్ర మోడీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు సామాన్యులకు చేరెవిధంగా పాలన కొనసాగాలని ఆకాంక్షిస్తూ దత్తాక్షల క్షేత్రంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోట రాజు, మండల ప్రధాన కార్యదర్శి గౌడ చిల్లర శ్రీశైలం, చందాపూర్ సర్పంచ్ రామరాజు, భారతీయ జనతా పార్టీ నాయకులు వీర రెడ్డి, వరుణ్, పాండు, సుధాకర్ శివ, మల్లేష్,శ్రీశైలం, శేఖర్, వీరస్వామి పాల్గొన్నారు.

# బీవీఆర్ఐటీలో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ 5వ వామ్స్ 2026 సదస్సు

















### 6+ సాంకేతికతలు, భవిష్యత్ యాంటెన్నా వ్యవస్థలు, రాబోవు తరం వైర్లెస్ కమ్యూనికేషన్ పై ప్రపంచ నిపుణుల చర్చలు

సమస్త ప్రక్షాళనం/ నర్సాపూర్ బి.వి. రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నాస్ అండ్ మైక్రోవేవ్ (వామ్స్ 2026) సదస్సు బుధవారం (జూన్ 10) ఘనంగా ప్రారంభమైంది. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో జూన్ 10 నుంచి 13 వరకు నాలుగు రోజులపాటు ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించబడుతోంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అమెరికాకు చెందిన లింట్రిస్ సంస్థ చీఫ్ ఇంజనీర్ శ్రీ ఫిల్ వెనిజియా హాజరయ్యారు., శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షులు శ్రీ రవిచంద్రన్ రాజగోపాల్, కార్యదర్శి శ్రీ ఆదిత్య విస్సం, శ్రీ ఫిల్ వెనిజియా అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీవీఆర్ఐటీ ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే మాట్లాడుతూ,. యాంటెన్నా సాంకేతికతలు, వైర్లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, మైక్రోవేవ్ ఇంజనీరింగ్ రంగాల్లో జరుగుతున్న అత్యాధునిక పరిశోధనలను విద్యార్థులు, అధ్యాపకులు తెలుసుకునేందుకు ఈ సదస్సు చక్కటి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. సదస్సు ఆహ్వాన ప్రసంగాన్ని ఈసీఈ విభాగాధిపతి మరియు వామ్స్ 2026 సదస్సు జనరల్ చైర్మన్ డా. బి.ఆర్. సంజీవ రెడ్డి చేశారు. అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, నెదర్లాండ్స్, తైవాన్, చైనా, మలేషియా, ఇటలీ, సింగపూర్, పోలాండ్, కజకిస్తాన్, లెబనాన్, ఫ్రాన్స్ తదితర దేశాలతో కలిపి మొత్తం 18 దేశాల నుంచి ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారని తెలిపారు. అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, బోస్టన్ ప్రాంత విద్యాసంస్థలు, ఆస్ట్రేలియాలోని ఆర్ ఎమ్ ఐ టి యూనివర్సిటీ, సింగపూర్లోని ఎన్ టి యు వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు మొత్తం 1,059 సాంకేతిక పరిశోధనా పత్రాలు అందగా, కఠినమైన సమీక్షా ప్రక్రియ అనంతరం 753 పత్రాలు మౌఖిక మరియు పోస్టర్ ప్రజెంటేషన్లకు ఎంపికైనట్లు తెలిపారు. భారతదేశంలోని 29 రాష్ట్రాల నుంచి పరిశోధకులు, ఐఐటీలు, ఐఐఎస్సీ బెంగళూరు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, బిట్స్ మరియు ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, జాతీయ పరిశోధనా సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు. వారిలో: శ్రీ ఫిల్ వెనిజియా ఉ చీఫ్ ఇంజనీర్, లింట్రిస్, అమెరికా , డా. ధవల్ పుజారా ఉ అధ్యక్షులు, ఔూమీా సొసైటీ; వైస్ ఛాన్సలర్, అధాని యూనివర్సిటీ, గుజరాత్, ప్రొ. అనంత భారతి ఉ ఉపాధ్యక్షులు, వామ్స్ సొసైటీ డా. సుధాకర్ కె. రావు , సలహాదారు, వామ్స్ -2026; డా. సి.జె. రెడ్డి , అధ్యక్షులు యాంటెన్నాస్ అండ్ ప్రొపగేషన్ , ప్రొ. క్రిస్టోఫ్ ఫ్యూమాక్స్ ఉ మాజీ అధ్యక్షులు, ఆస్ట్రేలియా ప్రొ. ఫ్రాన్సెస్కో పి. ఆండ్రియుల్లీ , ఇటలీ డా. వి. సమీర్ చక్రవర్తి ఉ విఘ్నాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, విశాఖపట్నం, డా. పి.ఎస్.ఆర్. చౌదరి ఉ రఘు ఇంజినీరింగ్ కళాశాల, విశాఖపట్నం, పాల్గొన్నారు. కాలేజీ డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, , అమెరికాలోని రావోస్ కన్సల్టెంట్స్ ఎల్ఎల్సీకి చెందిన డా. సుధాకర్ కె. రావు సహకారం అందిస్తున్నారు.. ఈ కార్యక్రమంలో డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీవీఆర్ఐటీ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ శ్రీ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ సురేష్ వి వి ఆర్ ఐ టి ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న, నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులను సన్మానించిన బీజేపీ మండల అధ్యక్షుడు సిందోల్ దశరథ్



సమస్త ప్రక్షాళనం :నారాయణ ఖేడ్ నారాయణఖేడ్ మండల పరిధిలోని రుద్రారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయిలు బదిలీ అయిన సందర్భంగా, అలాగే వారి స్థానంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొత్త కార్యదర్శి సతీష్ గారికి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు సిందోల్ దశరథ్ ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక చిన్న కార్యక్రమంలో సిందోల్ దశరథ్ మాట్లాడుతూ... ఇప్పటివరకు ఇక్కడ సేవలందించి పిప్రికి బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి సాయిలు గ్రామాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా సాగాలని ఆకాంక్షిస్తూ, శాలువాతో సత్కరించరు. అనంతరం, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శి సతీష్ గారికి శాలువాతో ఘనంగా స్వాగతం పలికారు. కొత్త కార్యదర్శి కూడా అదే ఉత్సాహంతో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ, గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా దశరథ్ కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జనార్దన్, బీజేపీ బూత్ అధ్యక్షులు విష్ణు, సర్పంచ్ పూలమ్మ సామెల్, ఉప సర్పంచ్ స్వరూప సంగారెడ్డి, బీజేపీ శక్తి కేంద్రం ఇంచార్జి రఘుపతి రెడ్డి, వార్డ్ మెంబెర్లు రమేష్, శ్రీనివాస్ బీజేపీ నాయకులు వీరప్ప,సురేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆపద్బాంధవునిగా మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి







సమస్త ప్రక్షాళనం :నారాయణ ఖేడ్ లారీలు అందుబాటులో లేక జొన్నల తరలింపు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల గోడును తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి రైతుల పక్షాన నిలబడి లారీ యజమానులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ.. "రైతుల కష్టాలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగానే నేడు రైతులు రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ జొన్న పంట పూర్తిగా కొనుగోలు చేయకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది." "ఒకవైపు అకాల వర్షాలు, మరోవైపు లారీల కొరతతో రైతులు నష్టపోతుంటే ఎమ్మెల్యే గారు మాత్రం కేవలం ప్రచారాలకే పరిమితమయ్యారు. రైతుల సమస్యల పరిష్కారంపై ఎలాంటి చొరవ చూపకుండా కాలయాపన చేస్తున్నారు." "పంటలు అమ్ముకోలేక రైతులు ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం, ఎమ్మెల్యే గారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరం. రైతుల కష్టాలను వెంటనే గుర్తించి పెండింగ్‌లో ఉన్న జొన్న పంటను పూర్తిగా కొనుగోలు చేసి, లారీల సమస్యను తక్షణమే పరిష్కరించాలి."

"రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తాం.

# రోడ్డు ప్రమాదాల నివారణ సమిష్టి కృషితోనే సాధ్యం: ఐజీ షానవాజ్ ఖాసీం













## నవాబుపేటలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం పాల్గొన్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా

సమస్త ప్రక్షాళనం – నవాబుపేట్,జూన్ 10 :వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్‌లో '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' గ్రామ సభల సందర్భంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఐజీ షానవాజ్ ఖాసీం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ షానవాజ్ ఖాసీం మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో విలువైన ప్రాణనష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ, క్షేత్రస్థాయి నుంచి ప్రమాదాల నివారణ చర్యలు ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల సమిష్టి కృషితోనే ప్రమాదాల రహిత సమాజం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని, ఇందుకోసం జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో నివారణ కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి నెలా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ అవసరమైన నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపకపోవడం, సీటు బెల్టు పెట్టుకోవడం, తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వంటి మూడు ముఖ్యమైన సూత్రాలను పాటిస్తే ప్రమాదాల తీవ్రతను, మరణాలను తగ్గించవచ్చని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, నాటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు ఐజీ షానవాజ్ ఖాసీంకు కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ అంజయ్య తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలకగా, స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు ఐజీకి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమం అనంతరం మోమిన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఐజీ ప్రారంభించారు. ఈ సభలో డీఎస్పీ అంజయ్య, డీపీఓ జయసుధ, సీఐలు రఘుకుమార్, వెంకట్, ఎంపీడీఓ అనురాధ, స్థానిక సర్పంచ్ నర్సింహారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బలవంత్‌రెడ్డి, పలువురు ఎస్ఐలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తోర్నాల్ గ్రామం లో అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించి గ్రామంలో పోచమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన

### నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

### తోర్నల్ గ్రామ సర్పంచ్ సంగమేష్ పాటిల్





సమస్త ప్రక్షాళనం : మనూర్ నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని తోర్నాల్ గ్రామంలో బుధవారం నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భవన సముదాయాన్ని పరిశీలించిన ఆయన, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఈ భవనం గ్రామ ప్రజల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు

# బోరంచ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



మనూర్ మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ బోరంచ నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించి,

తుర్కపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్వి నాయకులు చింటూ నరేష్ గారు జరిపిన పోచమ్మ పండుగలో పాల్గొన్న నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, సర్పంచ్ భూపాల్, మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, జుఖుఎం చైర్మన్ కృష్ణ గౌడ్, నాయకులు మల్గొండ, పండరి, కిషోర్, జ్ఞానేశ్వర్, తుకారం తదితరులు ఉన్నారు.

# స్కైలర్క్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే





సమస్త ప్రక్షాళనం :నారాయణ ఖేడ్ నారాయణఖేడ్ పట్టణంలో బెల్లాపూర్ గ్రామానికి చెందిన నరసింహారెడ్డి గారు నూతనంగా నిర్మించిన స్కైలర్క్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు పరమేష్ పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, సర్పంచ్ భూపాల్, నాయకులు గోపాల్, రవీందర్ నాయక్, మల్గొండ, తదితరులు ఉన్నారు.

### మోమిన్ పెట్ పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ప్రారంభించిన శ్రీ షా నవాజ్ ఖాసిం ఐపీఎస్ జనరల్ ఆఫ్ పోలీస్. మల్టీ జోన్. -11. హైదరాబాద్ శ్రీమతి స్నేహా మెహ్రా ఎస్పీ.







మోమిన్ పెట్ సమస్త ప్రక్షాళన జూన్ (10): గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉండడం వల్ల ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండాఎప్పటికప్పుడు సీసీ కెమెరాల నిఘ ఉంటుందని ఐ జి శ్రీ షా నవాజ్ ఖాసిం జిల్లా ఎస్పీ శ్రీమతిస్నేహమె హ్రా జిల్లా కలెక్టర్ దీపక్ తివారిపేర్కొన్నారు బుధవారం మోమిన్ పెట్ పోలీస్ స్టేషన్లో120 సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభించారు. సందర్భంగా ఐజి శ్రీ షా నా వా జ్ ఖాసిం మాట్లాడుతూ మోమిన్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లోని సీసీ కెమెరాల ఫొటోస్ ని పరిశీలించడానికి నిఘా నీడలోఉంటుందని అన్నారు గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తగా పట్ల సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు గ్రామాల్లో దొంగతనాలను సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతుంది. అన్నారు. ఒక్క సీసీ కెమెరా ఎంతోమంది పోలీసులతో సమానమని అన్నారు. ఈ సందర్భనలో పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రత భద్రత పరంగా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అనంతరం స్టేషన్లో ఉన్న రికార్డులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో డీఎస్పీ అంజయ్య సీఐ. జి వెంకట్ ఎస్ఐ భరత్ భూషణ్ తాసిల్దార్ రవీందర్ పోలీస్ సిబ్బంది ఆయా గ్రామాల సర్పంచులు నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో బి ఆర్ యస్ నాయకుడి జన్మదిన వేడుకలు పెద్దోడి ప్రవీణ్ కుమార్








సమస్త ప్రక్షాళనం :మనూర్ సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ నియోజకవర్గం మనూర్ మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువ నాయకుడు పెదొద్ది ప్రవీణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన వారి అభిమానులు వినూత్నంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణఖేడ్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకున్న అభిమానులు, అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "ప్రవీణ్ గారి ఆశయాలకు అనుగుణంగా, ఎల్లాంటి పోస్టర్లు, కేక్ కటింగ్ వంటి హంగామాలు లేకుండా నేరుగా అవసరంలో ఉన్న వారికి సేవ చేయడం మాకు ఎంతో తృప్తిని ఇచ్చింది" అని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే ప్రవీణ్ అడుగుజాడల్లో తాము మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు.

# పటాన్‌చెరు పట్టణంలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై దిశానిర్దేశ సమావేశం







### పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్.

సమస్త ప్రక్షాళనం -పటాన్ చెరువు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హరీష్ రావు గార్ల ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహణకు సంబంధించి పటాన్‌చెరు పట్టణంలోని పీవీ నరసింహ ఆడిటోరియంలో ఈ రోజు దిశానిర్దేశ సమావేశం నిర్వహించారు.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారు, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ గారు, గూడెం మధుసూదన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పృథ్వీరాజ్ గారు మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బూత్ స్థాయి నుంచి విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌కు ఇద్దరు యువ కార్యకర్తలు, ఒక బూత్ బాధ్యుడిని నియమించి ప్రత్యేక డిజిటల్ సభ్యత్వ నమోదు అనువర్తనం ద్వారా భారీ సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేయాలని సూచించారు.పార్టీ సూచనల మేరకు డివిజన్ పరిధిలోని ప్రతి బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన కలిగిన యువతతో పాటు అనుభవజ్ఞులైన సీనియర్ బూత్ సమన్వయకర్తలను ఎంపిక చేసి ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టాలని అన్నారు. ప్రజలతో మరింత మమేకమై పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు.

పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రజలతో పార్టీకి ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే వేదికగా మలచాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ గారు, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ గారు, నర్రా భిక్షపతి గారు, శ్రీధర్ చారి గారు, వంగారి అశోక్ గారు, చందు గారు, గుండమొల్ల రాజు గారు, కోమరగూడెం వెంకటేష్ గారు, నవీన్ రెడ్డి గారు, శంకర్ గారు, షకీల్ గారు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు మరియు ఎంపీఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మోమిన్ పేట్ గ్రామసభ నిర్వహణ

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్ .

మోమిన్ పేట్ సమస్త ప్రక్షాళనం జూన్(10)మోమిన్‌పేట మండల పరిధిలోని మోమిన్ పెట్ మండల కేంద్రంలోని మోమిన్ పెట్ గ్రామంలో బుధవారంగ్రామసభను సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి గ్రామసభలు కీలకమని, ప్రజలు తమ సమస్యలను గ్రామసభ వేదికగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ వెంకటేశం మిషన్ భగీరథ రాకేష్ పంచాయత్ కార్యదర్శి మల్లేష్ గౌడ్ ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి జిపిఓ వెంకటరెడ్డి వార్డ్ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## నూతన ఎంపీవోను సన్మానించిన. వార్డు సభ్యులు మహమ్మద్ అప్సర్.

మోమిన్ పేట్ సమస్త ప్రక్షాళనం జూన్ (10.) మండలంకు నూతనంగా వచ్చిన ఎంపీవో సంజయ్ కుమార్ ను గ్రామసభలో సన్మానించిన వార్డు సభ్యులు మహమ్మద్ అప్సర్, అనంతరం నూతనంగా వచ్చిన ఎంపీ ఓ సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధికి గ్రామ సర్పంచ్ అధికారులు వార్డు సభ్యులు సమన్వయంతో కలిసి పని చేసినప్పుడే ఆ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు అందరూ అన్ని విధాలుగా సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్, ఉపసర్పంచ్ వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం : సీజేపీ

: జాతీయ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. గురువారం పుణెలో శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం లఖ్‌నవూ, అమృత్‌సర్, జైపుర్, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టంచేశారు. అయితే, వచ్చే శనివారం నాటికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే జూన్ 20నుంచి దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని అభిజీత్ తెలిపారు.

యువత భారీ సంఖ్యలో తరలిరావాలి!

ఈ ఆందోళనకు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో తరలిరావాలని అభిజీత్ పిలుపునిచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పత్రాన్ని తీసుకునేంతవరకు ఎవరూ కూడా దిల్లీ నుంచి వెనక్కి తిరిగే ప్రసక్తే లేదని, తాను స్వయంగా ఈ ఆందోళనను ముందుండి నడిపిస్తానని ప్రకటించారు. పరీక్ష నిర్వహణలో జరుగుతున్న లోపాలపై యువత ఎంతమాత్రం నిశ్శబ్దంగా ఉండేందుకు సిద్ధంగా లేరని ఆయన స్పష్టం చేశారు. నీట్ పరీక్ష వాయిదా పడటంతో విద్యార్థులు మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్‌తో పాటు సీబీఎస్ఈలో జరుగుతున్న అక్రమాల వల్ల దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా విద్యార్థులు నష్టపోయారని, ఈ పరిస్థితికి బాధ్యత వహించేందుకు కేంద్రంలో ఎవరూ ముందుకు రావడం లేదని మండిపడ్డారు.

భవిష్యత్తులో వైద్యులుగా మారి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన విద్యార్థులే ఈ విద్యా వ్యవస్థ వల్ల ప్రాణాలను కోల్పోతున్నారని అభిజీత్ దీప్కే దుయ్యబట్టారు. భారత విద్యా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి, వ్యవస్థాగత వైఫల్యాల మూల్యాన్ని ఏ విద్యార్థీ చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా చూడటానికి చేపట్టిన ఉద్యమంగా దీన్ని అభివర్ణించారు. అయితే, గురువారం పుణెలో జరిగే నిరసన కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పాల్గొంటారని దీప్కే తెలిపారు. గత శనివారం జంతర్ మంతర్ వద్ జరిగిన నిరసనల్లోనూ సోనమ్ పాల్గొన్నారు. అంతేకాదు, ఆ నిరసనల్లో భాగంగా అభిజీత్‌ను కానీ, సీజేపీ సభ్యులను కానీ పోలీసులు అరెస్టు చేస్తే, 42 రోజుల పాటు నిరాహార దీక్ష చేపడతానని ఆయన హెచ్చరించారు.

ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఓఎస్ఎం వ్యవస్థలో అవకతవకల నేపథ్యంలో గత శనివారం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ధర్నా నిర్వహించింది. అభిజీత్ పిలుపుమేరకు వేలాదిమంది యువత నిరసన వేదిక వద్దకు తరలివచ్చి, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. అయితే, ఈ నిరసనలో దాదాపు 7,000 మంది పాల్గొన్నారని అభిజీత్ దీప్కే ఇటీవల పేర్కొన్నారు. ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సిన బాధ్యతను ప్రధాని తీసుకోవాలన్నారు. దేశంలో ఎన్నికలు గత దశాబ్దకాలంగా హిందూ-ముస్లిం ఎజెండాగా ఉన్నాయని, ఈ ధోరణికి స్వస్తి పలికి, నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా పరిగణించాలని ఆయన స్పష్టం చేశారు. పొరుగు దేశాల్లో జరిగిన ఉద్యమాలతో 'కాక్రోచ్' ఉద్యమాన్ని పోలుస్తున్నారని, తమ ఉద్యమం కేవలం 'జెన్ జీ'ల కోసమే ప్రత్యేకమని దీప్కే పేర్కొన్నారు.

ఎడిటోరియల్

# వాస్తవికత లోపించిన విధానాలు

వాస్తవికత లోపించిన విధానాలు ప్రధాని మోదీ ఈ మధ్య తన అమెరికా పర్యటనలో అధ్యక్షుడు బైడెన్‌తో చర్చల సందర్భంగా, వేరే సందర్భాల్లోనూ భారతదేశంలో అమెరికా పెట్టుబడుల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ విషయంలో ఇప్పటికే దేశీయంగా ఆవిష్కరించిన 'మేకిన్ ఇండియా'తో పాటుగా, దాని కొనసాగింపుగా గత 2, 3 సంవత్సరాల నుంచి ప్రారంభించిన పీఎల్‌ఐ (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు) పథకంపైన ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నది. ప్రధాని మోదీ ఈ మధ్య తన అమెరికా పర్యటనలో అధ్యక్షుడు బైడెన్‌తో చర్చల సందర్భంగా, వేరే సందర్భాల్లోనూ భారతదేశంలో అమెరికా పెట్టుబడుల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ విషయంలో ఇప్పటికే దేశీయంగా ఆవిష్కరించిన 'మేకిన్ ఇండియా'తో పాటుగా, దాని కొనసాగింపుగా గత 2, 3 సంవత్సరాల నుంచి ప్రారంభించిన పీఎల్‌ఐ (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు) పథకంపైన ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నది.ఇక, మానవ వనరుల నిపుణతల విషయంలో మనం చాలా బలహీనంగా ఉన్నాం. ఈ దిశగా స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు వచ్చినా, అవి ఇప్పటికి కూడా పెద్దగా ఫలితాలను చూపలేక పోతున్నాయి. ప్రస్తుతం కొత్తగా ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో నిపుణుల శిక్షణకు కృషిచేసే ప్రయత్నాలు మొదలవుతున్నాయి. కనీసం ఈ శిక్షణలు అయినా తానెక్కే రైలు జీవితకాలం లేటు అన్నట్టుగా ఉండవని ఆశిద్దాం! మూడోది%ొా% యువజనులు అధికంగా ఉండటం. ఇది మన దేశానికి వరంగా ఉండాలంటే వారికి మనం తగిన ఉపాధిని కల్పించగలగాలి. దానికిగాను వారందరికీ తగిన నిపుణతలూ, విద్యను అందించగల పరిస్థితి ఉండాలి. కానీ దురదృష్టవశాత్తు నేడు అది లోపించింది.వాస్తవ పరిస్థితులను గమనిస్తే అటు 'మేకిన్ ఇండియా'లో కానీ, ఇటు 'పీఎల్‌ఐ'లో కానీ నేటివరకు ఆశించినంత ఫలితాల్లేవు. ఆర్థిక సంవత్సర కాలంలో దేశంలోకి వస్తున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పోలిస్తే 22 శాతం తగ్గాయి. అలాగే దేశ స్థూల జాతీయోత్పత్తిలో సరుకు ఉత్పత్తిరంగం తాలూకు వాటాను కనీసం 25 శాతానికి చేర్చాలన్న ఆశలు కూడా ఇప్పటివరకు అడియాసలుగానే మిగిలిపోయాయి. నిజానికి, కొవిడ్ అనంతర కాలంలో దేశంలోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలు భారీగా దెబ్బతినడంతో కోట్లాది మంది నగర ప్రాంత కార్మికులు, తిరిగి గ్రామీణ వ్యవసాయంపై ఆధారపడటం పెరిగింది. ఫలితంగా, ప్రస్తుతం దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం వాటా కాస్త పెరిగింది. ఇది కచ్చితంగా తిరోగమనమే. ఎందుచేతనంటే, వ్యవసాయ రంగంలో ఇప్పటికే అవసరానికి మించిన స్థాయిలో దేశీయ మానవ వనరులు కేంద్రీకృతమై ఉన్నాయి. ఇతరేతర ఆర్థిక రంగాల్లో ఉపాధిని పొందే అవకాశాలు రాక, లేక కోటానుకోట్ల మంది నేడు వ్యవసాయ రంగంలోనే చిక్కుకొని ఉండిపోయారు. ఈ పరిస్థితిని మార్చగలగడంలో అటు 'మేక్ ఇన్ ఇండియా' కానీ, ఇటు 'పీఎల్‌ఐ' కానీ పెద్దగా ఫలితాలను సాధించలేదు.

పీఎల్‌ఐ కింద ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ప్రధానంగా 14 రంగాలను ఎంపిక చేశారు. వాటిలో ఎలక్ట్రానిక్స్ రంగం, ఫార్మా రంగం వంటి కొద్దిపాటి రంగాల్లో మాత్రమే ఈ పథకం కొంత ప్రభావాన్ని చూపగలిగింది. ఆ మేరకు దేశం నుంచి మొబైల్ ఫోన్ల ఎగుమతుల వంటివి భారీగా పెరిగాయి. కానీ, ప్రస్తుతం దేశంలో మొబైల్ తయారీరంగంలో జరుగుతోంది– కేవలం విదేశాల నుంచి దిగుమతి చేసుకొన్న విడిభాగాల అసెంబ్లింగ్ మాత్రమేనని, పూర్తిస్థాయి దేశీయ ఉత్పత్తి కాదనే విమర్శలున్నాయి. అలాగే, నేటి వరకు పీఎల్‌ఐ పథకం ఆశించిన స్థాయిలో ఉపాధి కల్పన దిశగా సాధించింది కూడా పెద్దగా ఏమీ లేదనే విమర్శలూ ఉన్నాయి.

మరి, ఈ పరిస్థితికి కారణాలేమిటి? మనం మన దేశీయ సరుకు ఉత్పత్తిరంగాన్ని ఎందుకు ముందుకు తీసుకువెళ్లలేకపోతున్నాం? దీనికి కారణాలనేకం. ముఖ్యంగా మోదీ ప్రధాని అయిన తర్వాత మేకిన్ ఇండియా కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ, ప్రస్తావించిన భారతదేశం తాలూకు మూడు ప్రధాన బలాలుగా చెప్పుకున్నవాటిలో 1. దేశీయ డిమాండ్, 2. ప్రజాస్వామిక దేశం కావటం, 3. ప్రపంచంలోనే యువజనులు అత్యధికంగా ఉన్న దేశం కావడం అనేవి ఉన్నాయి. దేశంలో పారిశ్రామిక ఎదుగుదలకు ఈ మూడు అంశాలను ప్రధాన ఇతివృత్తంగా లేదా మన బలంగా మోదీ భావించారు. మరి, ఈ లెక్కన ప్రకటించిన మేకిన్ ఇండియా అనంతరం %--% ఈ మూడు అనుకూలతలతో, భారత్ పారిశ్రామికంగా గణనీయంగా పురోగమించి ఉండవలసింది. కానీ అది జరగలేదు. పారిశ్రామిక ప్రగతి ఇప్పటికీ మనకు ఎండమావిగానే మిగిలిపోయింది. దీనికి కారణాలేమిటి?మొదటగా, పైన పేర్కొన్న మూడు అనుకూలతల్లో ఒకటైన దేశీయ డిమాండ్‌ను చూద్దాం. డిమాండ్ అనేది ప్రధానంగా ప్రజల ఆదాయాలు. తద్వారా వారి కొనుగోలు శక్తిపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మన దేశంలో లోపించింది ఇదే. ఉదాహరణకు దేశంలోని అత్యధిక శాతం జనాభా అయిన రైతాంగ కుటుంబాల నెలవారీ సగటు ఆదాయం ఇప్పటికీ రూ.10,218 మాత్రమే ఉన్నది. ఈ మొత్తం దేశీయ తలసరి ఆదాయం కంటే కూడా తక్కువగానే ఉన్నది. అంటే సగటున ఐదుగురు సభ్యులున్న దేశీయ రైతువారీ కుటుంబాల ఆదాయాలు అతి తక్కువ స్థాయిలో ఉన్నాయి. ఈ ఆదాయంలో కూడా సింహభాగం, సాగుబడి నుంచి కాక ఇతరేతర (పశు పోషణ, కూలీ పనులకు వెళ్లడం తదితర) ఆదాయ మార్గాలపై ఆధారపడి ఉన్నది.

కాగా, ప్రస్తుతం తాజా గణాంకాల ప్రకారం సుమారు 16 నెలలకు పైగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద జనాల వేతనాలు ( కుంచించుకుపోతున్నాయి. దీనికి ఒక ప్రధాన కారణం ఒకప్రక్కన గ్రామీణ పేదల వేతనాలలో పెరుగుదల లేకపోవడం, మరోప్రక్క ద్రవ్యోల్బణం వారి కొనుగోలు శక్తిని తీవ్రంగా ప్రభావితం చేస్తూ ఉండటం. ఈ సందర్భంలోనే, జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఇస్తున్న కూలీ డబ్బు దేశీయ కనీస వేతనం కంటే తక్కువ స్థాయిలో ఉండటాన్ని కూడా గమనించవచ్చ్ే.శంలోని నగర ప్రాంత జనాభా ఆదాయాలు కూడా కొవిడ్ అనంతర కాలంలో తీవ్రంగా ప్రభావితమయ్యాయి. నిరుద్యోగం పెరగడం, వేతనాల పతనం, ధరల పెరుగుదల వంటివన్నీ కూడా నగర ప్రాంతాల ప్రజల కొనుగోలు శక్తి పతనం వెనుక ఉన్నాయి. ఈ కారణాల చేతనే నేడు దేశీయంగా డిమాండ్ భారీగా పతనమవుతున్నది. ఈ క్రమంలోనే, టోకు ధరల సూచి నాటికి మూడు నెలలుగా అధోముఖంగా సాగుతున్నది. ఫలితంగా 4.12 శాతం పతనంతో టోకు ధరల సూచి ఎనిమిదేండ్ల కనిష్ఠ స్థాయిలో ఉన్నది. సరుకులకు, సేవలకు డిమాండ్ పతనం వల్ల వాటి ధరలు పడిపోతున్నాయి. రానున్న రోజుల్లో టోకు ధరల సూచిలో కనపడుతున్న ఈ 'ప్రతికూల ద్రవ్యోల్బణం' అనేది, రిటైల్ ద్రవ్యోల్బణంలో కూడా కనపడే అవకాశమే అధికం. అంటే, సామాన్య జనం కొనుగోళ్ల స్థాయిలో కూడా మరింతగా దిగజారుడు సంభవించి %--% అది ద్రవ్యోల్బణం ప్రతికూల దిశగా (మైనస్‌లోకి) వెళ్లే ప్రమాదం కూడా ఉన్నది. ఇది అధిక ద్రవ్యోల్బణం కంటే కూడా ప్రమాదకరమైన పరిస్థి తి. ఈ స్థితిలో దేశీయ డిమాండ్ అనేది, దేశంలో పారిశ్రామిక ప్రగతికి ఊతాన్నిచ్చేదిగా ఉండజాలదు.ఇక మోదీ ప్రస్తావించిన రెండవ అంశం, మన దేశం ప్రజాస్వామ్య దేశంకావడం. ఈ అంశం ప్రాతిపదికనే, ప్రధానంగా నేడు అమెరికా వంటి పాశ్చాత్య ధనిక దేశాలు చైనాలో కేంద్రీకృతమై ఉన్న సరుకు ఉత్పత్తి రంగంలోని గణనీయమైన భాగాన్ని 'చైనా ప్లస్ వన్' పేరిట భారతదేశం వంటి దేశాలకు మళ్లించాలని కోరుకుంటున్నాయి. పాశ్చాత్య దేశాల ఈ విధానం, మన దేశంలో పారిశ్రామికీకరణకు కలిసి వస్తుందనేది మన ప్రభుత్వ అంచనా. అయితే, ఇప్పటివరకు 'చైనా ప్లస్ వన్'లోని ప్లస్ వన్‌గా అంటే, చైనా నుంచి తరలివెళ్లే పరిశ్రమలను ఆకట్టుకోవడంలో మనం పెద్దగా విజయవంతం కాలేదు. ఆ దిశగా మనకు వియెత్నాం వంటి దేశాల నుంచి బలమైన పోటీ వస్తున్నది. అలాగే, నేడు మనం పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్న అమెరికా వంటి దేశాల్లో కూడా పరిస్థితులు మారుతున్నాయి. ఆ దేశంలో నేడు పారిశ్రామిక సంస్థలకు కొత్త పారిశ్రామిక పెట్టుబడులకు భారీగా ప్రోత్సాహకాలను ఇస్తున్నారు.అమెరికా ప్రభుత్వం, గతంలోని మార్కెట్ ఆధారిత విధానాల స్థానంలో నేడు %--% ప్రభుత్వ ప్రోత్సాహకాలూ, పారిశ్రామిక విధానాల ప్రాతిపదికన దేశంలో పారిశ్రామికరంగానికి తిరిగి ఊపిరులూదే ప్రయత్నం చేస్తున్నది. ఈక్రమంలోనే.. యూరప్ దేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున పరిశ్రమలు అమెరికాకు తరలిపోయే పరిస్థితి ఏర్పడుతున్నది. ఫలితంగా, ఈ స్థితిని తట్టుకోగలిగేందుకు గాను అమెరికాకు ధీటుగా తమ దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహకాలను ఇచ్చుకునే ప్రయత్నాలను యూరోపియన్ యూనియన్ దేశాలు చేస్తున్నాయి. అదీ కథ!కాబట్టి మనది ప్రజాస్వామ్య దేశమా కాదా అన్నది పెట్టుబడులను ఆకట్టుకోవడంలో ప్రస్తుతం ప్రశ్న కాదు. అసలు ప్రశ్నలల్లా%ొా% నేటి పోటీ ప్రపంచంలో పెట్టుబడుల కోసం ఇతర దేశాలకు ధీటుగా మన దేశం రాయితీలను ఇవ్వగలదా? మౌలిక సదుపాయాలను సమకూర్చగలదా? అలాగే, నిపుణులైన కార్మికులను, ఉద్యోగులను పారిశ్రామిక రంగానికి అందుబాటులో ఉంచగలదా? అనేవి మాత్రమే. ఈ విషయంలో చూస్తే మౌలిక సదుపాయాల కల్పనలో మనం కొంతమేర ప్రగతిని సాధించగలిగినా, ఇంకా చేయవలసింది చాలా ఉన్నది. ఇప్పటికీ దేశంలో సరుకుల ఎగుమతికి అవుతున్న రవాణా వ్యయం (లాజిస్టిక్స్) సుమారుగా 13 శాతంగా (అంటే వంద రూపాయల సరుకు ఖరీదులో సుమారు 13 రూపాయలుగా) ఉన్నది. కాగా, ఈ లాజిస్టిక్స్ వ్యయం సగటు అంతర్జాతీయంగా 7–8 శాతంగా ఉంది. ఫలితంగా మన దేశ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లలో చౌకధరల పోటీని తట్టుకోవడం కష్టమవుతున్నది. ఇక, మానవ వనరుల నిపుణతల విషయంలో మనం చాలా బలహీనంగా ఉన్నాం. ఈ దిశగా స్కిల్ ఇండియా వంటి కార్యక్రమాలు వచ్చినా, అవి ఇప్పటికి కూడా పెద్దగా ఫలితాలను చూపలేక పోతున్నాయి. ప్రస్తుతం కొత్తగా ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో నిపుణుల శిక్షణకు కృషిచేసే ప్రయత్నాలు మొదలవుతున్నాయి. కనీసం ఈ శిక్షణలు అయినా తానెక్కే రైలు జీవితకాలం లేటు అన్నట్టుగా ఉండవని ఆశిద్దాం! మూడోది%ొా% యువజనులు అధికంగా ఉండటం. ఇది మన దేశానికి వరంగా ఉండాలంటే వారికి మనం తగిన ఉపాధిని కల్పించగలగాలి. దానికిగాను వారందరికీ తగిన నిపుణతలూ, విద్యను అందించగల పరిస్థితి ఉండాలి. కానీ దురదృష్టవశాత్తు నేడు అది లోపించింది.

# ఐక్యరాజ్యసమితి పేదరికపు అంచనాలు



ఐక్యరాజ్యసమితికి చెందిన యుఎన్‌డిపి ప్రకారం భారతదేశంలో 42 కోట్ల 50 లక్షల మంది పేదరికపు స్థాయిని అధిగమించారు. కరోనా అనంతర కాలపు పరిస్థితి గురించిన అంచనాలను యుఎన్‌డిపి చెప్పలేదు. కాని అంతకు ముందరి కాలానికి సంబంధించి యుఎన్‌డిపి చెప్పినది విపరీతంగా ప్రచారం అయ్యింది. గొప్పలు చెప్పుకోడానికి అది దారి తీసింది. కాని, ఇక్కడ గమనించని వాస్తవం ఏమంటే యుఎన్‌డిపి పేదరికానికి సంబంధించి అంచనాలు వేసే పద్ధతి, అది తీసుకున్న కొలబద్దలు వేరు, మన దేశంలో పేదరికాన్ని అధ్యయనం చేయడానికి తీసుకునే కొలబద్దలు వేరు. యుఎన్‌డిపి అంచనాలు సైద్ధాంతికంగా సమర్ధించుకోగలిగినవి కావు. ఆ అంచనాలకు రావడానికి అది ఉపయోగించిన గణాంకాలు కూడా సరైనవి కావు.మనం ఇంతవరకూ గ్రామీణ పేదరికం గురించి చర్చించాం. కరోనా మహమ్మారి విరుచుకు పడకముందులో మన దేశంలో నిరుద్యోగం అప్పటికి 45 ఏళ్ళకు పూర్వం ఏనాడూ లేనంత ఎక్కువ స్థాయికి చేరుకుంది. దీనిని బట్టి మన దేశంలో పేదరికం తగ్గలేదని స్పష్టంగా చెప్పవచ్చు. వాస్తవానికి అది మరింత పెరిగింది. కాని యుఎన్‌డిపి లెక్కలు దానికి భిన్నంగా చెప్తున్నాయి. కేంద్ర ప్లానింగ్ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ రాజ్యసభలో మాట్లాడుతూ 'మన దేశంలో పేదరికాన్ని అంచనా వేయడానికి ఏ విధమైన గణాంకాలూ అందుబాటులో లేవు' అని ప్రకటించారు. అందుచేత ఆ ఏడాది తర్వాత ఎంతమంది పేదరికస్థాయి నుండి బైట పడ్డారో చెప్పలేమని అన్నారు. అయితే ఐక్యరాజ్యసమితికి (ఐరాస) చెందిన యుఎన్‌డిపి (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) చేసింది. దాని ప్రకారం భారతదేశంలో 42 కోట్ల 50 లక్షల మంది పేదరికపు స్థాయిని అధిగమించారు. కరోనా అనంతర కాలపు పరిస్థితి గురించిన అంచనాలను యుఎన్‌డిపి చెప్పలేదు. కాని అంతకు ముందరి కాలానికి సంబంధించి యుఎన్‌డిపి చెప్పినది విపరీతంగా ప్రచారం అయ్యింది. గొప్పలు చెప్పుకోడానికి అది దారి తీసింది. కాని, ఇక్కడ గమనించని వాస్తవం ఏమంటే యుఎన్‌డిపి పేదరికానికి సంబంధించి అంచనాలు వేసే పద్ధతి, అది తీసుకున్న కొలబద్దలు వేరు, మన దేశంలో పేదరికాన్ని అధ్యయనం చేయడానికి తీసుకునే కొలబద్దలు వేరు. యుఎన్‌డిపి అంచనాలు సైద్ధాంతికంగా సమర్ధించుకోగలిగినవి కావు. ఆ అంచనాలకు రావడానికి అది ఉపయోగించిన గణాంకాలు కూడా సరైనవి కావు.

మన దేశంలో పేదరికాన్ని అంచనా వేయడానికి ఒక ప్రధానమైన కొలబద్ద పౌష్టికాహారం. అది అందనివారు పేదలుగా పరిగణింపబడతారు. అంతే కాదు. మన జాతీయ శాంపిల్ సర్వే చాలా పెద్దది. ఆ సర్వే చాలా పెద్ద సంఖ్యలో ప్రజలను కలిసి వివరాలు సేకరిస్తుంది. ఐతే మన ప్రభుత్వం దగ్గర ఏ గణాంక వివరాలూ లేవని ఎందుకు ప్రకటించారు? ఆ తర్వాత చేసిన సర్వేలో బైటపడ్డ చేదు వాస్తవాలను వెల్లడించే సాహసం కేంద్ర ప్రభుత్వానికి లేకుండాపోయింది. ఆ తర్వాత మోడీ ప్రభుత్వం ఎటువంటి సర్వేనూ చేపట్టనే లేదు. అందుచేత తమ వద్ద తర్వాత వివరాలు లేవంటూ బుకాయిస్తున్నారు.

ఇక యుఎన్‌డిపి సర్వే విధానం చూస్తే అది పూర్తిగా భిన్నమైనది. పేదరికపు అంచనాల కోసం అది తీసుకునే సూచికలు కొన్ని ఉన్నాయి. వాటన్నింటినీ బట్టి ఒక అంచనాకి వస్తారు. ఉదాహరణకి: ఒక వ్యక్తి ఎంత ఎత్తు ఉన్నాడు అన్నది కొలిచి దాని వర్గాన్ని లెక్కిస్తారు. అలా వచ్చిన అంకెను 18.5తో గుణిస్తారు. అప్పుడు వచ్చిన అంకె కన్నా ఆ వ్యక్తి తక్కువ కిలోల బరువు ఉంటే అతడుపేదవాడిగాలెక్క (ఉదా: ఎత్తు 1.5 మీటర్లు అయితే దాని వర్గం 2.25. దానిని 18.5తో గుణిస్తే 41.625 కిలోలు వస్తుంది. ఆ వ్యక్తి బరువు అంతకన్నా తక్కువ ఉంటేనే అతడిని పేదవాడుగా గుర్తిస్తారు). ఇంకొక కొలబద్ద: ఆ ఇంట్లో గత ఐదేళ్ళలో 18 సంవత్సరాల వయస్సు లోపు ఉన్నవారు ఎవరైనా మరణించారా? అన్నది. ఇంకొకటి: ఆ ఇంట్లో 12 ఏళ్ళ వయస్సుకు పైబడిన పిల్లలు ఉంటే వారు కనీసం 6 సంవత్సరాల స్కూలు చదువు పూర్తి చేశారా? లేదా? అన్నది. స్కూలుకు పోయే వయస్సు ఉన్న పిల్లల్లో 8వ తరగతి వరకూ చదవకుండా మధ్యలోనే ఆపివేశారా? అన్నది ఇంకొకటి. 'ఆధునిక' సమాజాలుగా పరివర్తన జరుగుతున్న ఏ సమాజంలోనైనా పైన తెలిపిన కొలబద్దల ప్రాతిపదికన చూస్తే అభివృద్ధి తప్పనిసరిగా జరుగుతున్నట్టే అనిపిస్తుంది. ఉదాహరణకి: 18 ఏళ్ళ లోపు వయస్సు ఉండే పిల్లల్లో మరణాల రేటు ఆ సమాజాల్లో తగ్గుతూనే వుంటుంది. అదేమాదిరిగా స్కూలుకి పోయే పిల్లల సంఖ్య పెరుగుతూనే వుంటుంది. ముఖ్యంగా మంచి చదువు ఉంటే మంచి భవిష్యత్తు ఉంటుంది అన్న భావన అప్పో, సప్పో చేసైనా పిల్లల్ని చదివించాలనే తాపత్రయం ఉండే తల్లిదండ్రులు పెరుగుతున్నకొద్దీ స్కూళ్ళకి పోయే పిల్లల సంఖ్య పెరుగుతుంది. మధ్యాహ్న భోజన పథకం వంటివి కూడా స్కూలు హాజరు రేటును మెరుగుపరుస్తాయి. ఐతే, ఆ కుటుంబపు ఆదాయం తగ్గిపోతున్నా, ఈ కొలబద్దలన్నీ అందుకోవచ్చు. ఆ కుటుంబం ఇతరత్రా వినియోగించే సరుకుల మొత్తం అంతకంతకూ తగ్గించుకుంటూ బిడ్డల్ని చదివించుకోవడం జరుగుతుంది. అంటే ఆ కుటుంబంలో ఒకవైపు పేదరికం పెరుగుతున్నా, యుఎన్‌డిపి కొలబద్దలను బట్టి చూస్తే, ఆ కుటుంబం పేదరికంలో లేనట్టే లెక్క. యుఎన్‌డిపి తన కొలబద్దలు పేదరికాన్ని బహుముఖంగా పరిశీలించడానికి తోడ్పడతాయని చెప్తుంది. ఈ బహుముఖపు పేదరికం అంటే ఏమిటి? ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ సమాజపు ఆధునీకరణ ఏ విధంగా జరగాలని కోరుకుంటుందో ఆ దిశకు అనుగుణంగా ఇది ఉంటుంది.మరి ఈ ఆధునీకరణ జరగడానికి మూల్యం ఎవరు చెల్లిస్తున్నారు? శ్రామిక ప్రజలా? లేక సంపన్నులా? యుఎన్‌డిపికి ఈ ప్రశ్న అసలు ఉదయించదు. ఆధునీకరణ జరిగిందా లేదా అన్నదే దానికి ముఖ్యం (వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరిగి కూలీలకు పనులు దక్కకుండా పోయినా అది అభివృద్ధికిందే లెక్క. రెగ్యులర్ కార్మికుల స్థానంలో కాంట్రాక్టు కార్మికులను పెట్టుకుని నడిపే పరిశ్రమలు పెరిగితే అదీ అభివృద్ధి కిందే లెక్క).

ఇప్పుడు ప్రభుత్వ ఆధ్వర్యంలో మన దేశంలో ఈ తరహా ఆధునీకరణ వేగంగా జరుగుతోంది. అందుకే యుఎన్‌డిపి లెక్కల్లో మన దేశంలో పేదరికం తగ్గినట్టు కనిపిస్తోంది. కాని ఈ ఆధునీకరణకు మూల్యం చెల్లిస్తున్నది శ్రామిక ప్రజలే. వారి వినిమయ శక్తి (లేదా కొనుగోలు శక్తి) పడిపోతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా కుటుంబం చేసే ఖర్చులలో ప్రాధాన్యతలు కూడా మారిపోతున్నాయి. ముఖ్యంగా ఆహారం కోసం చేసే ఖర్చు తగ్గుతోంది. అందువల్ల పేదరికాన్ని అంచనా వేయడానికి ఆ యా కుటుంబాల ఆహారపు పౌష్టిక విలువలను (ఎన్ని క్యాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకుంటున్నారు అన్నది) ప్రాతిపదికగా తీసుకోవడం అవసరం. పేదరికపు తీరు తెన్నులకు అద్దం పట్టే ప్రమాణం ఇదే. అంతే కాదు, కుటుంబపు వాస్తవ ఆదాయం పెరుగుతోందా లేక తగ్గుతోందా అన్నది కూడా ఈ ప్రమాణాన్ని బట్టి నిర్ధారించగలుగుతాం. రూపాయి లెక్కల్లో ఆదాయం పెరిగినట్టు కనిపించినా, ఆ రూపాయి విలువ నిగ్గు తేల్చేది ఒకానొక కుటుంబం పౌష్టికాహారాన్ని పొందగలుగుతోందా లేదా అన్న పరిశీలనే. ఇటువంటి ముఖ్యమైన కొలబద్ద–పౌష్టికాహారం పొందగలగడం–యుఎన్‌డిపి పెట్టుకున్న ప్రమాణాలలో ఆరో వంతు ప్రాధాన్యత మాత్రమే కలిగివుంది. పైగా పౌష్టికాహార లభ్యతకు వాళ్ళు ఇచ్చే నిర్వచనమే వేరుగా ఉంది. శరీరానికి తగ్గట్టు బరువు ఉందా లేదా అన్నది (బాడీ–మాస్ ఇండెక్స్), వారి ప్రమాణం. పౌష్టికాహారం పొందలేనప్పుడే బరువు తగ్గుతుంది. ఒక్కోసారి బరువులో తేడా కనిపించకపోవచ్చు కాని రోగాలబారిన పడే అవకాశాలు పెరుగుతాయి. అంటే శరీరపు బరువును బట్టి పేదరికాన్ని లెక్క వేయడం శాస్త్రీయం కాదు. నిజానికి పౌష్టికాహారం తీసుకోలేకపోతే ఆ వెంటనే శరీరపు బరువు తగ్గిపోదు. దానికి కొంత కాలం పడుతుంది. అందుచేత యుఎన్‌డిపి పెట్టుకున్న కొలబద్దలకు వాస్తవ పౌష్టికాహార సమస్య దొరకదు. పైగా దీనికి ఆరో వంతు ప్రాధాన్యత మాత్రమే ఇవ్వడం బట్టి యుఎన్‌డిపి దృక్కోణం ఏమిటో తెలుస్తూనే వుంది.

యుఎన్‌డిపి ప్రమాణాలకు, మన జాతీయ శాంపిల్ సర్వే ప్రమాణాలకు ఎంత తేడా ఉందో తెలియాలంటే ఈ ఉదాహరణ చూడాలి: నాటికి భారతదేశంలో 64 కోట్ల 50 లక్షల మంది పేదలు ఉన్నారని,ఈ సంఖ్య 37 కోట్లకు పడిపోయిందని యుఎన్‌డిపి లెక్కలు తెలుపుతున్నాయి. అంటే అప్పటికి 27 కోట్ల 50 లక్షల మంది పేదరికం నుండి బైటపడినట్లు ఔతుంది. అదే జాతీయ శాంపిల్ సర్వే 75వ రౌండ్ సర్వేలో గ్రామీణ ప్రాంతంలో ప్రజల వినియోగం (అన్ని సరుకుల, సేవలనూ కలుపుకుని) 9 శాతం పడిపోయిందని తేల్చింది.

(ఈ నిర్ధారణ మోడీ ప్రభుత్వాన్ని ఎంత వణికించిందంటే ఆ గణాంకాలను విడుదల చేసిన కొద్ది గంటలలోపే వాటిని తొలగించివేసి, ప్రజానీకానికి దొరక్కుండా దాచిపెట్టింది. ఆ కొద్ది గంటల వ్యవధి లోపలనే కొందరు వ్యక్తుల ఆ గణాంకాలను వీలైన మేరకు డౌన్‌లోడ్ చేసుకున్నారు. అప్పటి మీడియాలో కూడా ఆ గణాంకాల ఆధారంగా కొంత చర్చ జరిగింది.)

భారత ప్రణాళికా సంఘం మొదట్లో గ్రామీణ ప్రజలకు కనీసం 2200 క్యాలరీల శక్తి రోజుకు ఒక్కొక్కరికి అందాలన్నది ప్రమాణంగా నిర్ణయించింది. ఆ లెక్క చూస్తే కనీస పౌష్టికాహారం పొందలేని గ్రామీణులు 58 శాతం ఉన్నారు. వాళ్ళు 68 శాతానికి పెరిగారు.ికి వాళ్ళు అమాంతం 77 శాతానికి పెరిగారు! కాని యుఎన్‌డిపి లెక్కల్లో మన దేశంలో కోట్లాది మంది పేదరికం లోంచి బైటపడ్డారు!

మనం ఇంతవరకూ గ్రామీణ పేదరికం గురించి చర్చించాం. కరోనా మహమ్మారి విరుచుకు పడకముందు మన దేశంలో నిరుద్యోగం అప్పటికి 45 ఏళ్ళకు పూర్వం ఏనాడూ లేనంత ఎక్కువ స్థాయికి చేరుకుంది. దీనిని బట్టి మన దేశంలో పేదరికం తగ్గలేదని స్పష్టంగా చెప్పవచ్చు. వాస్తవానికి అది మరింత పెరిగింది. కాని యుఎన్‌డిపి లెక్కలు దానికి భిన్నంగా చెప్తున్నాయి. యుఎన్‌డిపి పెట్టుకున్న కొలబద్దలను ఇక్కడ మనం విమర్శించడం ప్రధానాంశం కాదు. ఆ కొలబద్దల ఆధారంగా పేదరికం పెరిగిందా లేక తగ్గిందా అన్న నిర్ధారణకు రావడాన్ని మనం విమర్శిస్తున్నాం. దేశంలో పేదరికంపై జరుగుతున్న చర్చ కాస్తా యుఎన్‌డిపి గణాంకాలతో పూర్తిగా దారి తప్పింది. మన దేశం పెట్టుకున్న కొలబద్దలకు, యుఎన్‌డిపి కొలబద్దలకు మధ్య తేడాను గమనించకపోతే చర్చను మళ్ళీ గాడిలో పెట్టడం సాధ్యం కాదు. మొత్తం 121 దేశాలకుగాను ప్రపంచ ఆకలి సూచికలో 107 వస్థానానికి దిగజారిన మన దేశంలో మరోవైపు కోట్లాదిమంది ప్రజలు పేదరిక స్థాయి నుండి బైట పడ్డారని చెప్పుకుంటే దానిని ఏ విధంగా ప్రజలు విశ్వసిస్తారు?

# భారతదేశమా.. మేలుకో!

'ఆరోగ్యకరమైన రాజకీయ వ్యవస్థ హింసను ప్రోత్సహించదు. అలాంటి సమాజం హింసను సహించదు. కానీ నేడు భారతీయ సమాజంలో హింసాత్మక అల్లర్లు సంస్థాగత వ్యవస్థగా రూపొందినయ్' అన్నారు రాజనీతి శాస్త్రవేత్త పాల్ ఆర్ బ్రాస్– ఆ మాటలు నిజమేనని బీజేపీ డబులింజన్ సర్కారు పాలనలో జరుగుతున్న సంఘటనలు నిరూపిస్తున్నాయి.

ఆరోగ్యకరమైన రాజకీయ వ్యవస్థ హింసను ప్రోత్సహించదు. అలాంటి సమాజం హింసను సహించదు. కానీ నేడు భారతీయ సమాజంలో హింసాత్మక అల్లర్లు సంస్థాగత వ్యవస్థగా రూపొందినయ్' అన్నారు రాజనీతి శాస్త్రవేత్త పాల్ ఆర్ బ్రాస్– ఆ మాటలు నిజమేనని బీజేపీ డబులింజన్ సర్కారు పాలనలో జరుగుతున్న సంఘటనలు నిరూపిస్తున్నాయి.

ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురుచూడకండి. లేవండి, చేయీ చేయీ కలిపి నడుద్దాం! కర్ణాటకలో కుల, మత, పార్టీలకతీతంగా, వివిధ ప్రజాసంఘాలు సామాజిక శ్రేయోభిలాషులంతా కలిసినడిచారు. మత విద్వేష రాజకీయాలను నిరసించండని ప్రబోధిస్తూ కర్ణాటకను కాపాడుకున్నారు! వారి మార్గాన ఆసేతు హిమాచల పర్యంతం, మతవిద్వేష రాజకీయాలను నిరసిస్తూ మన దేశాన్ని మనమే కాపాడుకుందాం.భారతీయ జనతా పార్టీ ఎన్నికలకు ముందు ఉద్దేశపూర్వకంగానే హింసాత్మక ఎత్తుగడలను చేపడుతున్నది. దేశభక్తి మేలి ముసుగులో, మత ఘర్షణలు సృష్టించి తద్వారా వచ్చే సానుభూతితో, మెజారిటీ మతస్థుల పోలరైజేషన్‌తో ఎన్నికల్లో లబ్ధి పొందటాన్ని ఆనవాయితీగా మార్చుకున్నది. ఇంటర్నెట్ నిలిపివేశాం గనుక తమ అల్లర్లను దేశం, ప్రపంచం చూడలేదనుకుంటున్నది మోదీ ప్రభుత్వం. 'అందరి అంతరంగాలను సర్వాంతర్యామి సదా చూస్తూనే ఉంటాడు' అన్న గీతా ప్రబోధాన్ని 'అంతరంగమందు అపరాధములు చేసి, మంచివాని వలెను మనుజుడుండ, ఇతరు లెరుగకున్న, ఈశ్వరుడెరుగడా?' అంటూ విశదీకరించాడు ప్రజాకవి వేమన.ఉదాహరణకు.. 1.ఇంటర్నెట్‌ను ఆపేయడంలో భారత నెం–1 స్థానంలో ఉన్నదన్న విమర్శను, జీ–20 సమావేశాల్లోనే ఎదుర్కొన్నారు మోదీ. 2. మోదీ ప్యారిస్‌లో అడుగుపెట్టబోయే ముందుగానే 'మణిపూర్ హింసాకాండ పట్ల ఆందోళన వెలిబుచ్చుతూ, అందుకు కారకులైన కొందరు బీజేపీ నేతల వ్యవహారాన్ని తీవ్రంగా తప్పుబడుతూ యురోపియన్ యూనియన్ (ఈయూ) తీర్మానం చేసింది. 3. అమెరికన్ సెనేటర్లు కొందరు, ఆ విషయంపై భారత ప్రధానిని నిలదీయాలని బైడెన్‌కు సంయుక్తంగా లేఖ రాశారు. 4.మణిపూర్ అత్యాచార సంఘటనలను 'వాషింగ్టన్ పోస్ట్ ' మొదలైన అమెరికా, బ్రిటన్ పత్రికలు పతాక శీర్షికన ప్రచురించాయి. 5. మణిపూర్ హింసాకాండ పూర్వాపరాలను పరిశీలించిన 'అశోక్ స్వైన్' అనే స్వీడన్ ప్రొఫెసర్ 'మణిపూర్ సీఎం బిరేన్‌సింగ్, 2002 నాటి మోదీ గుజరాత్ మాడల్‌ను అనుసరిస్తున్నాడు. అందులో భాగంగానే.. మణిపూర్ మైనారిటీ కుకీ ఆదివాసీ క్రైస్తవులపై మెజారిటీ మెయితీ మూక దాడులకు గేట్లు తెరిచాడు. తత్ఫలితంగా వేలాది గ్రామాలు, వందలాది చర్చీలు భస్మమయ్యాయి. 148 మంది చనిపోయారు, వేలాది మంది క్షతగాత్రులయ్యారు. నిరాశ్రయులైన 60 వేలమంది కొండ, కోనల్లో తలదాచుకుంటున్నారు. మైనారిటీలపై జుగుప్సాకరమైన సామూహిక అత్యాచారం మెజారిటేరియన్ల ఆయుధంగా రూపొందింది. బీజేపీ పాలనలో' అంటూ విశ్లేషించారు.ఈ హింసకు మూలమేమిటో తెలియని అమాయకులు నిరుపేద మెయితీ, కుకీ, నాగాలు స్త్రీ, బాల, వృద్ధులు. శరణార్థుల శిబిరాలలో ఆకలి తీర్చుకుంటున్నారేమో గాని, సానిటరీ, మందులు, పౌష్టికాహారలేమితో, అరకొర వసతులతో అల్లాడుతున్నారు. ఈనేపథ్యంలో జుగుప్సాకరమైన అశ్లీల వీడియో వైరలయ్యాక, ఆసేతుహిమాచల పర్యంతం భారతీయులు, ముఖ్యంగా భారతదేశ, హైందవ పరిరక్షకునిగా మోదీని ఆరాధిస్తున్నవారే సిగ్గుతో తలవంచుకొని ఇలా వాపోతున్నారు.శీరాముడు మాకు ఆదర్శమంటున్న బీజేపీ పాలనలో 'రామరాజ్యం' కాకున్నా ఫర్వాలేదు, కానీ రావణ, దుర్యోధన, దుశ్శాసన రాజ్యం కన్నా, అవమానకరంగా రూపొందింది భారత్! రావణుడు స్త్రీని అపహరించాడు కానీ తాకలేదు. దుర్యోధన, దుశ్శాసనులు స్త్రీని వివస్త్రను చేశారు కానీ, అత్యాచారం చేయలేదు. 'బేటీ బచావో! బేటీ పడావో' అంటూ గొప్పగా నినదించిన నరేంద్ర మోదీ, బీరేన్‌సింగ్ వగైరాల డబులింజన్ సర్కారు పాలనలో కఠువా, ఉన్నావ్, హత్రాస్, మణిపూర్‌లలో మృగాలు కూడా సిగ్గుపడేలా స్త్రీలపై సామూహిక అత్యాచారం చేసి హతమార్చారు. బిల్కిస్ బానో వంటి గర్భిణీ స్త్రీని కూడా పైశాచికంగా అత్యాచారం చేసి, ఆమె కూతురిని రాక్షసంగా హతమార్చారు! అట్టి నికృష్టులను, క్షమాభిక్ష పేరిట విడుదల చేసి, హారతులతో స్వాగతించి, దండలతో సన్మానిస్తుంటే చూస్తుండిపోయారు భారత ప్రధాని. 'ప్రజాస్వామ్య దేవాలయ'మని మోదీ చెప్తున్న పార్లమెంటు భవనం ముందుకొచ్చి 'మోదీజీ, మీ బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ మమ్మల్ని లైంగికంగా వేధిస్తున్నాడు. దయచేసి అతన్ని శిక్షించి, మమ్ము రక్షించ'మని వేడుకున్నారు దేశానికి అంతర్జాతీయ 'కీర్తి పతకాల'ను సాధించిన మహిళా రెజ్లర్లు. వారిని పోలీసులు ఈడ్చుకెళ్తుంటే, కనీసం ప్రపంచం కోసమైనా ఖండించలేదు మోదీ.ఇక మణిపూర్‌లో రక్షకభటుల ముందే మహిళలను నగ్నంగా ఊరేగించారు, అడ్డుకున్నవాళ్ల తండ్రిని, తమ్మున్ని హతమార్చారు. సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారు మెయితీలు. వాళ్ల క్రూరత్వానికి బలైన వారిలో, భారత మాజీ సైనికుని భార్య కూడా ఉన్నది. 'కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి శత్రుమూకల బారినుంచి నా దేశాన్ని కాపాడుకోగలిగాను, నేడు నా భార్యతో సహా మరో ఇద్దరు మహిళలను లాక్కెళ్తున్న మెయితీ హిందూ మూకల బారినుంచి కాపాడుకోలేకపోయా'నంటూ కన్నీళ్లు కార్చాడు ఆ సైనికుడు. మెయితీలు, కుకీలు, నాగాలు మేమంతా దేశం కోసం 'అసోం రెజిమెంట్‌లో' కలిసి పోరాడిన వీర సైనికులం. నేడు తగులబడుతున్న నా మణిపూర్‌లో నా ప్రజలంతా కాలిపోతున్నారు. అయినా సరే, నా రాష్ట్రంతో సహా నా దేశ రక్షకుడైన ప్రధాని నరేంద్ర మోదీ కనీసం నోరెత్తటం లేదంటూ' ధారాపాతంగా కన్నీరు కార్చాడు ఓ మాజీ కల్నల్.

# మిసిమి జడకు పసిమి తళుకు



మిసిమి జడకు పసిమి తళుకు ముచ్చటైన చీరకు చూడచక్కని వాలుజడ తోడైతే ఆ అందం గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే అవుతుంది. సిగ అల్లికల అలంకారం కోసం నాగరం నుంచి జడకుప్పెల దాకా ఎన్నెన్నో నగలు మేమంటే మేమని పోటీ పడుతుంటాయి. ముచ్చటైన చీరకు చూడచక్కని వాలుజడ తోడైతే ఆ అందం గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే అవుతుంది. సిగ అల్లికల అలంకారం కోసం నాగరం నుంచి జడకుప్పెల దాకా ఎన్నెన్నో నగలు మేమంటే మేమని పోటీ పడుతుంటాయి. ఇక్కడ కండ్లను కట్టిపడేసేలా కనిపిస్తున్నది కిషన్‌దాస్ జువెలరీ సంస్థ రూపొందించిన మేలిమి బంగారు జడ.

బర్మీస్ రూబీ, పోల్కీలను జతచేసిన ఈ జడకు చివర జడకుచ్చులు అందంగా వేలాడేలా రూపొందించారు. మీనం ఆకృతిలో వచ్చే డిజైన్ దీనికి ప్రత్యేక ఆకర్షణ. దానిపైన పచ్చలు, కెంపులు, పోల్కీలు పొదిగి చేసిన జడబిళ్లకు రెండు వైపులా ముత్యాలసరాలు ముగ్ధంగా అమరిపోయాయి. ఎంబ్రాయిడరీ చేసిన ఆఫ్‌వైట్ రంగు చీర రితికా మీర్‌చందానీ కలెక్షన్‌లోనిది.

# వేణుగానం జయప్రదం



వేణుగానం జయప్రదం రేపల్లెను మురిపించిన మురళి, గోపికలను బులిపించిన రవళి.. జయప్రదా రామమూర్తిని కూడా వేణుగాన విద్వాంసురాలిని చేసింది. తొలి మహిళా ఫ్లూటిస్ట్‌గా రికార్డులకు ఎక్కించింది. వేణువుతో జయప్రద స్నేహం ఓ రేణువులానే మొదలైంది.. రేపల్లెను మురిపించిన మురళి, గోపికలను బులిపించిన రవళి.. జయప్రదా రామమూర్తిని కూడా వేణుగాన విద్వాంసురాలిని చేసింది. తొలి మహిళా ఫ్లూటిస్ట్‌గా రికార్డులకు ఎక్కించింది. వేణువుతో జయప్రద స్నేహం ఓ రేణువులానే మొదలైంది..ఇంటి పనుల్లో తలమునకలైన ఆ గృహిణికి ఇంపైన వేణుగానం వినిపించింది. తను కూడా గాయని కావడంతో ఆ వాద్య సంగీతాన్ని మనసారా ఆస్వాదించింది. 'ఎవరిదో ఈ మురళీ గానం..' అనుకుంటూ తలతిప్పి చూసింది. తన కళ్లను తానే నమ్మలేకపోయింది. ఎదురుగా కూతురు.. జయప్రద. చేతిలో వేణువు. స్వరానికి తగ్గట్టు పిల్లనగ్రోవిని పలకరిస్తున్న ప్రాణవాయువు. అప్పటికి జయ వయసు పన్నెండు. జయప్రదా రామమూర్తి కుటుంబీకులు కర్ణాటకలోని బళ్లారి ప్రాంతానికి చెందినవారు. తాతల కాలంలోనే హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తండ్రి వెంకటరమణ రామమూర్తి భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో సైంటిస్ట్. తల్లి ప్రేమా రామమూర్తి సంగీత విద్వాంసురాలు. ఇంట్లో కర్ణాటక సంగీతం మారుమోగేది. తండ్రి శాస్త్రవేత్త కావడంతో అనేకానేక విషయాల మీద లోతైన చర్చలు జరిగేవి. కాబట్టే, 'ఫ్లూటిస్ట్ కాకపోయి ఉంటే కచ్చితంగా ఐఏఎస్ అధికారిని అయ్యేదాన్ని' అంటారు జయప్రద. వేణుగానం మీద మక్కువతో, పాకెట్ మనీలో నుంచి రూ.60 ఖర్చుపెట్టి ఫ్లూట్ కొనుక్కున్నారు జయప్రద. తొలిరోజుల్లో సొంతంగానే సాధన చేసినా.. ఆ తర్వాత నటేషన్ రమణి దగ్గర శిష్యరికం చేశారు. హరిప్రసాద్ చౌరాసియా సమక్షంలో కొంతకాలం సాధన చేశారు.

**సంగీతమా? చదువా?**

ప్రతి మనిషి జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయి. గడ్డుకాలం వచ్చి తీరుతుంది. జయప్రద కూడా అలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు. తండ్రి అకాల మరణం ఆ కుటుంబంలో ఓ పెద్ద కుదుపు. చదువు, వేణుగానం.. ఏదో ఒకటి ఎంచుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఐఏఎస్ ఆలోచనకు స్వస్తి పలికారు. సంగీతాన్ని కెరీర్‌గా ఎంచుకున్నారు. 'ఏదైనా సాధించాలనుకుంటే మనసులో గట్టిగా సంకల్పించుకుంటే సరిపోతుంది' అనే మాట జయప్రద విషయంలో నిజమైంది. గొప్ప ఫ్లూటిస్ట్‌గా పేరు తెచ్చుకోవాలనేది ఆమె లక్ష్యం. అందుకు అనుక్షణం శ్రమించారు. కఠోర సాధన చేశారు. వందలాది ప్రదర్శనలిచ్చారు. అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ ఓసారి టెలివిజన్‌లో జయప్రద వేణుగానాన్ని తిలకించారు, ఆలకించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ద్వారా జయప్రదను రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానించారు. కచేరీ పెట్టించారు. 'ఎప్పటికైనా నువ్వు గొప్ప వేణుగాన విద్వాంసురాలివి అవుతావు' అంటూ ప్రశంసించారు.

**సినిమాల్లోకి..** దర్శకేంద్రుడు కె.రాఘవేంద్ర రావు దర్శకత్వంలో వచ్చిన 'ఓం నమో వేంకటేశాయ' సినిమా ద్వారా జయప్రద వెండి తెర ఫ్లూటిస్ట్‌గా పరిచయం అయ్యారు. ఆ తర్వాత మరిన్ని అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. 'బాహుబలి-2', 'వకీల్‌సాబ్' వంటి పెద్ద సినిమాలకూ పనిచేశారు. త్వరలోనే, సంగీత దర్శకుడు కోటి నేతృత్వంలో ఓ ప్రాజెక్టు కోసం పని చేయనున్నారు. తన వేణుగాన ప్రస్థానంలో జయప్రద ఎన్నో రికార్డులు సాధించారు. ఆమె ఇరవై రకాల ఫ్లూట్స్ వాయించగలరు. స్వరాల నాణ్యత వేణువు పైనే ఆధార పడుతుంది. కాబట్టే అస్సాం, బొంబై, చెన్నై, బెంగళూరు నుంచి వేణువులు తెప్పించుకుంటారు. అన్నమయ్య లక్ష గళార్చన కార్యక్రమానికి గానూ.. ప్రపంచ రికార్డు నమోదు చేశారు. భారత సాంస్కృతి క శాఖ నుంచి నేషనల్ ఫెలోషిప్ కూడా అందుకున్నారు. కంచి పీఠం, శ్రీశైలం, గురువాయూర్, యాదాద్రి, వేములవాడ తదితర ఆధ్యాత్మిక క్షేత్రాలకు ఆస్థాన విద్వాంసురాలుగానూ ఉన్నారు జయప్రద.

**ప్రపంచ దేశాల్లో..** చదువుకునే రోజుల్లో ప్రపంచ పటంలో వివిధ దేశాల పేర్లు చూసి 'భూమి మీద ఇన్ని దేశాలున్నాయా? వీలైతే అన్నీ చుట్టేయాలి' అనుకునేవారు జయప్రద. ఆ కోరిక ఇప్పుడు నెరవేరింది. రష్యా, చైనా, అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ప్రదర్శనలిచ్చారు. వేల కచేరీలు చేసినా.. ప్రతి కచేరీని తొలి ప్రదర్శనగానే భావిస్తారు. అంతే శ్రద్ధగా శ్రోతల్ని అలరిస్తారు. కొన్నివేల కరతాళ ధ్వనులు ఆమె వేణుగాన ప్రతిభకు సాక్ష్యాలుగా నిలిచాయి. తన దగ్గరికి వచ్చేవారికి ఆమె చెప్పే మాట ఒకటే.. 'వేణుగానాన్ని నేర్చుకోవాలనుకుంటే, ముందుగా ఆ కళను ప్రేమించడం మొదలుపెట్టండి. ఉపాధిలా కాకుండా ఒక ఉద్యమంలా స్వీకరించండి. సాధన చేస్తూనే ఉండండి'.

# రాతి యుగం నగలు నయా ట్రెండ్



రాతి యుగం నగలు నయా ట్రెండ్ నగల్లో రాళ్లు పొదగడం తెలిసిందే. కానీ, ముందే ఓ పెద్దరాయి తీసుకుని.. దాని ఆధారంగా ఆభరణాన్ని డిజైన్ చేయడం నయా ట్రెండ్. ఇందులో పెండెంట్లు, ఉంగరాలు, దుద్దులు.. ఇలా నగలన్నీ పెద్ద పెద్ద రాళ్లచుట్టే తిరుగుతాయి. 'బిగ్‌స్టోన్ జువెలరీ' అమ్మాయిల మనసులో పెద్ద చోటే సంపాదిస్తున్నాయి

నగల్లో రాళ్లు పొదగడం తెలిసిందే. కానీ, ముందే ఓ పెద్దరాయి తీసుకుని.. దాని ఆధారంగా ఆభరణాన్ని డిజైన్ చేయడం నయా ట్రెండ్. ఇందులో పెండెంట్లు, ఉంగరాలు, దుద్దులు.. ఇలా నగలన్నీ పెద్ద పెద్ద రాళ్లచుట్టే తిరుగుతాయి. 'బిగ్‌స్టోన్ జువెలరీ' అమ్మాయిల మనసులో పెద్ద చోటే సంపాదిస్తున్నాయి. నయా ఫ్యాషన్ అన్న పదం నగలకు కుదిరినంతగా మరి దేనికీ సరిపోదేమో. ఖరీదైన బంగారు ఆభరణాలైనా, పాకెట్ ఫ్రెండ్లీ ఫ్యాన్సీ నగలైనా.. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూనే ఉంటాయి. కొత్తకొత్త డిజైన్లతో కొంగొత్త రూపాల్లో దర్శనమిస్తూనే ఉంటాయి. చూడగానే జిగేల్‌మనిపించే రాళ్ల నగలుకూడా ఇప్పుడు నయా లుక్‌లో కనిపిస్తున్నాయి. నగను డిజైన్ చేశాక రాళ్లు కూర్చడం కాదు, రాయిని ఎంచుకున్నాకే నగను డిజైన్ చేస్తారిక్కడ. బంగారం విషయమే తీసుకుంటే పచ్చ, కెంపు, ట్యాంజనైట్‌లాంటి విలువైన రాళ్లను ఉపయోగిస్తున్నారు. వాటి మీద స్వర్ణాన్ని అల్లికలా రూపొందించి, చిన్నచిన్న వజ్రాలు, అమెరికన్ డైమండ్లను పొదుగుతున్నారు. ఈ తరహా ఉంగరాలు రాణీవారి అంగులీకంలా చూడగానే ఆకట్టుకుంటాయి.

దాని మీద బంగారు తాపడంతో కళ్లను కట్టిపడేసేలా అలంకరించడం డిజైనర్ల పని. ఇదే తరహాలో కాలేజీ అమ్మాయిల కోసం ఏడీ స్టోన్, రైన్ స్టోన్, కలర్డ్ మార్బుల్, రెజిన్.. ఇలా రకరకాల రాళ్లతో ఫ్యాన్సీ నగలు రూపొందుతున్నాయి. ఈ మాడళ్లలో ఎక్కువగా సన్నటి గొలుసుకు తగిలించుకునేలా రంగురంగుల లాకెట్లు దొరుకుతున్నాయి. వాటికి తగ్గట్టు ఉంగరాలు, జుంకాలు కూడా వస్తున్నాయి.

# పచ్చదనం.. పరిరక్షకులు





పచ్చదనం.. పరిరక్షకులు అసలే అడవి. అక్కడక్కడా పులులు. హఠాత్తుగా స్మగ్లర్ల దాడులు. అడవిని కాపాడుతూ, వన్యమృగాలకు రక్షణనిస్తూ, స్మగ్లర్ల పాలిట సింహస్వప్నంగా నిలుస్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోపనిచేస్తున్న నూట నలభైమంది.. అటవీశాఖ మహిళా ఉద్యోగులు. ఒత్తిళ్లను ఎదుర్కొంటూ, సవాళ్లను అధిగమిస్తూ అడవిలో నిర్భయంగా విధులు నిర్వర్తిస్తున్న ఫారెస్టు అధికారులు, బీట్ సిబ్బందిపై ప్రత్యేక కథనం..

అసలే అడవి. అక్కడక్కడా పులులు. హఠాత్తుగా స్మగ్లర్ల దాడులు. అడవిని కాపాడుతూ, వన్యమృగాలకు రక్షణనిస్తూ, స్మగ్లర్ల పాలిట సింహస్వప్నంగా నిలుస్తున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోపనిచేస్తున్న నూట నలభైమంది.. అటవీశాఖ మహిళా ఉద్యోగులు. ఒత్తిళ్లను ఎదుర్కొంటూ, సవాళ్లను అధిగమిస్తూ అడవిలో నిర్భయంగా విధులు నిర్వర్తిస్తున్న ఫారెస్టు అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం అటవీ ప్రాంతం విస్తారమైంది. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండలం నుంచి వైరా నియోజకవర్గం వరకు 4,17,383 హెక్టార్లలో విస్తరించి ఉంది. పచ్చదనాల పట్టుచీర కట్టుకున్న ఆ అడవి తల్లిని అటవీశాఖ మహిళా ఉద్యోగులు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. వన సంపదను ఎత్తుకెళ్లడానికి గద్దల్లా ఎదురుచూసే స్మగ్లర్లకు సవాలు విసురుతున్నారు. వన్యప్రాణుల చర్మమాంసాలతో వ్యాపారం చేసుకునే రక్త బేహారులకూ ఇక్కడ కొదవ లేదు. ఆ పహరా బృందం అడుగుల చప్పుడు వినిపిస్తే చాలు.. స్మగ్లర్లకు వణుకే. విద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపే ఆ మహిళలు, మూగ జీవాలు కనిపిస్తే మాత్రం మాతృప్రేమ కురిపిస్తారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తారు. పచ్చగడ్డివేసి పొట్ట నింపుతారు. వేసవిలో అయితే.. మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ గార్డులు, సెక్షన్ అధికారులు, డీఆర్‌ఓలు, రేంజ్ అధికారులు.. హోదా ఏదైనా అదే నిబద్ధత. అంతే చిత్తశుద్ధి. ఉన్నతాధికారులు సైతం ఆ అంకిత భావాన్ని ప్రశంసించిన సందర్భాలు అనేకం.

**అనుక్షణం సవాళ్లే..**

ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో.. అటవీశాఖ మహిళా ఉద్యోగులు మగవాళ్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కిలోమీటర్ల దూరం కాలి నడకనే వెళు_న్నారు. ఎక్కడ ఏ క్రూర మృగాలు ఉంటాయో తెలియని పరిస్థితి. అయినా ధైర్యంగా అడుగు ముందుకేస్తారు. అక్రమ ఇసుక వ్యాపారుల ఆట కట్టిస్తూ..

ప్రకృతికి, పచ్చదనానికి అండగా నిలుస్తున్నారు. సీసీ కెమెరాల నిఘాతో చీమ చిటుక్కుమన్నా కనిపెట్టేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద మరింత అప్రమత్తంగా ఉంటున్నారు. 'అడవి, అడవిలోని ప్రాణులు-ఈ రెండూ మాకు రెండు కళు_' అంటారు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జి.శ్రీదేవి. 'అడవిలో పనిచేయడం సవాలే అయినా.. ఇష్టంగా చేస్తున్నాం. అధికారులు కూడా మద్దతుగా నిలుస్తున్నారు. ఇది మా అదృష్టం' అని వివరిస్తారు మరో బీట్ అధికారి శారద. 'మొక్కలు పెంచడం నా లక్ష్యం. అందుకే కోరికోరి ఈ ఉద్యోగంలో చేరాను. మనం ఎన్ని చెట్లు పెంచితే.. పకృతి మనకు అంత మంచి వాతావరణాన్ని ఇస్తుంది. పర్యావరణం బాగుండాలంటే.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. అడవిని కాపాడాలి. పకృతి ఒడిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా' అంటున్నప్పుడు బీట్ ఆఫీసర్ అనూష మాటల్లో పచ్చదనం పట్ల అవ్యాజమైన ప్రేమ. 'జీవవైవిధ్యమే ప్రకృతి సమతౌల్యానికి ప్రాణం. సృష్టిలోని ప్రతి జీవికీ బతికే హక్కు ఉంటుంది. అందుకే, మేం అడవిలో నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నాం. అడవి నిండా జంతువులు ఉంటే.. స్మగ్లర్లు అటువైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయరు' అని వివరిస్తారు దుర్గ.

స్త్రీని ప్రకృతితో పోలుస్తారు కవులు. ఆ ప్రకృతి సంరక్షణ బాధ్యత సాక్షాత్తు స్త్రీకే అప్పగిస్తే.. తనను తాను రక్షించుకున్నట్టు అడవిని కాపాడుకుంటుంది ఆమె. తన బిడ్డల్లానే వన్యమృగాలనూ పోషిస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్నది ఆ అద్భుతమే.

అటవీశాఖలో ఉద్యోగం అంటే రోజూ సవాళ్లే. ఓ సందర్భంలో ఊరు ఊరంతా ఎదురుతిరిగింది. దాడికి వచ్చింది. అయినా బీట్ ఆఫీసర్ అనూష.. వెనక్కి తగ్గలేదు. చాకచక్యంగా గుంపును చెదరగొట్టారు. తానూ సురక్షితంగా బయటపడ్డారు. కొన్నిసార్లు వేటగాళ్లు కంట్లో కారం చల్లే ప్రయత్నం చేస్తారు. స్మగ్లర్లు ప్రాణాలు తీస్తామని బెదిరిస్తారు. అవేవీ.. మహిళా సిబ్బంది ఆత్మస్థయిర్యాన్ని తగ్గించలేక పోయాయి. చేతిలో గన్ లేకపోతేనేం, ఒంటి మీద ఖాకీ యూనిఫామ్‌నే ఆయుధంగా భావిస్తారు.

# వినూత్న.. సృష్టికర్త!







నగలంటే ఏ లోహంతోనో చేసినవి అనుకుంటాం. కానీ పూలు, పండ్లు, గింజలతోనూ ఆభరణాలు రూపొందిస్తున్నారు 'బయో జువెలరీ' డిజైనర్ సృష్టి ఘనావత్. ఆమెది జైపూర్. నగలంటే ఏ లోహంతోనో చేసినవి అనుకుంటాం. కానీ పూలు, పండ్లు, గింజలతోనూ ఆభరణాలు రూపొందిస్తున్నారు 'బయో జువెలరీ' డిజైనర్ సృష్టి ఘనావత్. ఆమెది జైపూర్. చదువుకునే రోజుల్లోనే పర్యావరణానికి హాని కలిగించని నగలు తయారు చేయాలనే ఆలోచన వచ్చింది సృష్టి ఘనావత్‌కు. అలా, దేశంలోనే మొదటి బయోజువెలరీ బ్రాండ్ స్థాపకురాలైంది. '..అది కూడా సహజ సిద్ధంగా దొరికేవి, ఎంత సేకరించినా తరిగిపోని వాటితోనే నగలు తయారు చేయాలని సంకల్పించాను. అందుకే నా మనసు పూలు, పండ్లు, గింజలు, సుగంధ ద్రవ్యాల్లాంటి వాటి మీదికి పోయింది. వీటిని నగల్లో ఎలా ఇమడ్చాలనే కోణంలో చాలా కసరత్తు చేశాను. ఇది ఆరంచెల ప్రక్రియ. చివరి దశలో.. ఎక్కువకాలం మన్నేలా కోటింగ్ ఇస్తాం.

చివరగా ఇరవై నాలుగు క్యారెట్ల బంగారంతో పూత పూస్తాం. ఫినిషింగ్ తర్వాత అచ్చమైన బంగారు ఆభరణాల్లానే అనిపిస్తాయి. అన్నట్టు, ఇటీవల మేం తీసుకొచ్చిన స్పైస్ కలెక్షన్‌కు మంచి పేరొచ్చింది. ఇందులో లవంగాలు, దాల్చిన చెక్క, మొగ్గ, మిరియాలు, పువ్వు.. లాంటి మసాలా దినుసులతో చెవి దుద్దులు, బ్రేస్‌లెట్లు, గొలుసులు రూపొందించాం. ఇవి కాక ఖర్జూరాలు, శీకాకాయలాంటివీ మా ఆభరణాల్లో ఇమిడిపోయాయి. పర్యావరణాన్ని ప్రేమించే వారంతా ఈ నగల్ని ఇష్టపడుతారు' అంటారు సృష్టి. బయో జువెలరీ అంటే ప్రకృతికి మరింత అందాన్ని అద్దడమే!

# శ్రీసాయినాథుని మార్గనిర్దేశనం



సబ్‌కా మాలిక్ ఏక్.. అంటే అందరి ప్రభువు ఒక్కరే అని గొప్ప సిద్ధాంతం ప్రబోధించారు షిరిడీ సాయిబాబా. ఆయన్ని పూజించడానికి%ొా%ఎలాంటి నియమాలు అవసరంలేదు. నిర్మలమైన మనస్సుతో పూజించినవారిని కరుణిస్తానని ఆయనే స్వయంగా చెప్పారు. సాయిబాబాను గురువు, సాధువు, ఫకీరు అని ప్రియంగా పిలుచుకుంటారు భక్తులు. కుల, మతాలకతీతంగా అందరూ సమానులు అని ప్రబో ధించారు సాయినాథుడు. అందుకే ఆయన్ను ము స్లింలు, హిందువులు పూజిస్తారు. మసీదులో నివసించిన సాయినాథుడు గుడిలో సమాధి అవడమే అందుకు నిదర్శనం.సాయినాథుడు గోధుమలను విసిరి ఆ పిండిని ఊరి పొలిమేరల్లో జల్లించి ఊరి నుంచి కలరా వ్యాధి ని తరిమివేసారు. నీటితో దీపాలు వెలిగించారు. భక్తు ల పాపకర్మలను తానే స్వయంగా కడిగేసేవారు. తన ను ఆశ్రయించిన భక్తులను ఎల్లవేళలా కాపాడేవారు. కోర్కెలు తీర్చేవారు. తన చెంతకు వచ్చినవారికి వారి కి ఇష్టమైన దేవుడి రూపంలో కనిపించేవారు. ఇలా ఎన్నో%ొా% ఎన్నెన్నో మహిమలను చూపేవారు. అయి నా కూడా సద్గురు సాయి తాను దైవం అని ఎప్పుడూ ఎక్కడా చెప్పలేదు. తనను దైవంగా కొలిచే భక్తులతో ఆయన ఎప్పుడూ తాను దైవాన్ని కాదని, తనను కేవ లం గురువుగానే భావించాలని చెప్పేవారు. ఈ జగ త్తులో దైవానికి మించినది ఏదీ లేదని భక్తులకు బోధించేవారు సాయినాథులు. అయినా ఆయనతో కలిసి జీవించినవారు సాయిబాబా సాక్షాత్తు దైవ స్వరూపులని, ఆయన సద్గురువు మాత్రమేకాదని ఆయన లీలలు సాక్షాత్తు చూశామని విశ్వసించారు.అంతేకాదు భగవంతుడిని ఏవిధంగా ఆరాధిం చాలి. భగవంతుడి పట్ల వినయ విధేయులుగా ఎలా ఉండాలో తానే స్వయంగా ఆచరించి భక్తులకు మార్గ నిర్దేశం చేశారు సాయిబాబా. సాయిబాబా తన భక్తుల కు రెండు నియమాలు తప్పకుండా పాటించాలని ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. అవి శ్రద్ధ– సబూరి. ఈ రెండు లక్షణాలను ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని సూచించా రు. శ్రద్ధ అంటే విశ్వాసం, భక్తి, దీక్ష అని, సబూరి అంటే ఓర్పు, సాధన అని సందేశమి చ్చారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా శ్రద్ధ, సబూ రి వుంటే వాటిని పరిష్కరించుకోగలుగుతారని చెప్పే వారు. భగవంతుడు సృష్టించిన జీవరాశులన్నీ సమానమే అని చెప్పడానికి, ప్రతి దానిలో తాను ఉన్నానని చాటి చెప్పడానికి భక్తులకు ఎన్నో నిదర్శనా లు చూపించేవారు. ఏదో అవినాభావ సంబంధం ఉంటేనే ఒకర్ని ఒకరు కలుసుకుంటారు. ప్రత్యక్ష లే దా పరోక్ష సంబంధం లేకుంటే ఒకరి దగ్గరకు ఇంకొక రు రారు. కనుక అలా వచ్చిన వ్యక్తులు లేదా జంతువు లు కానీ మీ వద్దకు వస్తే నిర్దాక్షిణ్యంగా వాటిని తరిమి వేయకండి. మన వద్దకు వచ్చినవారిని ప్రేమతో ఆద రించాలి.

# నారద ముని సంతానం



ఆబాల గోపాలానికీ తెలిసిన మునిపుంగవుడు నారదుడు. ఎల్లవేళలా నారాయణ నారాయణ అనే మంత్రం జపిస్తూ లోకాలన్నీ తిరుగుతాడు. సనాతన ధర్మ సంప్రదాయంలో మనిషి. మనీషిగా, మహాత్ము డుగా ఉన్నతిని అందుకొని ముముక్షువుగా పరమప దంచేరి మహర్షిగా దైవత్వాన్ని పొందుతాడు. ఆజన్మ బ్రహ్మచారి అయిన నారదుడు బ్రహ్మదేవుని మానస పుత్రుడు. విష్ణు భక్తుడు. పరమశివుని ప్రియశిష్యుడు. పధ్నాలుగు లోకాలను ఇచ్ఛామాత్రంగా చుట్టిరాగల బ్రహ్మర్షి. ఆధ్యాత్మిక సాధనలో ఆయనకు ఆయనే సాటి. ఎలాంటి సంసార సంబంధమైన సమస్యలు లేకుండా ఎంతో హాయిగా తిరిగే ఆయనకు ఓ రోజు విచిత్రమైన కోరిక కలిగింది. భూలోకంలో భవసాగరా న్ని దర్శించాలన్న ఆసక్తి కలిగి విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళాడు. సంసారం మాయ అంటారు కదా! అదేంటో తెలుసుకోవాలని ఉందని తన కోరికను విష్ణుమూర్తికి తెలియజేస్తాడు. భూలోకంలో ఒక కొలను (కాకినాడ దగ్గర, సర్పవరం భావనారాయణ గుడి ఎదురుగా వున్న తటాకము) చూపించి అందులో స్నా నం చేసి రమ్మంటాడు మహావిష్ణు.

సరేనంటూ వెంటనే వెళ్ళి అందులో దిగి స్నానం చేసి వచ్చేసరికి, నారదుడు ఒక స్త్రీగా మారి, పూర్వజన్మ జ్ఞానాన్ని కోల్పోతాడు. అంతలో అటుగా వచ్చిన ఒక రాజు, స్త్రీ రూపంలో వున్న నారదుడిని చూసి మోహం చి ఆమెను వివాహము చేసుకుంటాడు. సంసార బం ధాల్లో చిక్కుకుంటాడు. వీరికి 60 మంది సంతానం కలుగుతా రు. కొన్నేళ్ళ తరువాత శత్రువులతో జరిగిన యుద్ధములో, రాజు తన 60 మంది పుత్రులతో సహా మరణిస్తారు. స్త్రీ రూపంలో వున్న నారదుడు అంతు లేని దు:ఖానికి గురవుతాడు. మరణించిన వారికి ఉత్తర క్రియలు జరిపించి తరువాత తాను పూర్వం స్నానం చేసిన కొలనులో స్నానం చేయడంతో, అతనికి స్త్రీ రూపం పోతుంది. అయినాపుత్రులు యుద్ధంలో మరణిం చిన దు:ఖము నుంచి తేరు కోలేకపోతాడు. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై, ఇదంతా తన మాయ వల్ల జరిగిందని చెపుతాడు. నారదుడి సంతానం పేరు శాశ్వ తంగా నిలిచి వుండేలా వారు పేర్లే కాలప్రమా ణాలుగా మారి, సంవత్సరం పేర్లుగా మారుతా యని వరమిచ్చాడు. అలా నారదుడి సంతానమైన ప్రభవ, విభవ, శుక్ల , ప్రమోద, ప్రజాపతి, అంగీరస, శ్రీముఖ, భావ, యువ, ధాత, ఈశ్వర%ొా% ఇలా 60మంది పుత్రుల 60 మంది పేర్లే ఇప్పుడు మనం వుపయోగిస్తున్న సంవ

# భక్తి అనేది ఓ మధురమైన భావన

**భగవంతుడి కోసం తన అనుకున్న సర్వస్వాన్నీ అర్పించటమే భక్తి.**
**నిజమైన భక్తి అనుభవైకవేద్యమైనదే తప్ప ఇదీ అని చెప్పగలిగేది కాదు.**
**అందుకే నిజమైన భక్తుడు నిరంతరం సాధన చేస్తూనే ఉంటాడు.**



భగవంతుడిని ప్రేమించడం భక్తికి తార్కాణం. ఆయన కోసం అశ్రులు చాచడం, ఆరాట పడటం, ఏడ్వటం, బాధ పడటం అన్నీ భక్తికి నిదర్శనాలే. భగవంతుడికి అన్నీ అర్పించడమే భక్తి. కలిమి లేముల్లో, సుఖదుఃఖాల్లో ఒకటేమిటి ప్రతిస్థితిలో, ప్రతి అవస్థలో, అన్ని వ్యవస్థల్లో, అంతటిలో భగవంతుడిని చూడగలగడమే భక్తి. అనుక్షణం అణువణువునా పరమాత్మను హృదయంలో దర్శించడం భక్తి అవుతుంది. భగవంతుడిని అనుభవించటం భక్తి. అనుభవంలోకి తెచ్చుకోవటం భక్తి.

తమ మనస్సుకు నచ్చిన ఇష్టదైవాన్ని ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు తమకు తోచిన రీతిలో ప్రార్థిస్తుంటారు. మంత్రాలు పఠిస్తారు. పూజలు, జపాలు చేస్తారు. ఇంకొంతమంది కోరికలు నెరవేరడానికి ఉపవాసాలు ఉంటుంటారు. వ్రతాలు చేస్తుంటారు. ఇవన్నీ భక్తి కలిగిన వారు చేసే వివిధ సాధనా మార్గాలు మాత్రమే. అంతేకానీ పరిపూర్ణ భక్తికి ప్రతీకలు మాత్రం కావు. భగవంతుడిని ఆరాధించే కొద్దిసేపైనా ఏ విధమైన ప్రతిఫలాపేక్ష లేకుండా మనసా వాచా కర్మణా భగవంతునిపైనే మనసును లగ్నం చేసి తనను తాను భగవంతుడికి అర్పణ చేసుకోవడమే అసలైన భక్తి అవుతుంది. ఇటువంటి భక్తి అత్యంత అమోఘమైంది. భగవంతుడికి భక్తులను దగ్గర చేసేది ఇటువంటి భక్తి మార్గం మాత్రమే.భగవంతుడిని మనసా స్మరిస్తూ, అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ అని మనల్ని మనం ఆయనకు అర్పించుకోవడమే భక్తి. ఏమీ ఆశించకుండా, కేవలం ఆ సర్వేశ్వరుడిని స్మరించడమే భక్తి. రాముడిపై హనుమంతుడికి ఉండేది భక్తి. శివుడిపై నందీశ్వరునికి ఉండేది భక్తి. గురువుపై శిష్యునికి ఉండేది భక్తి. భగవంతుడి తత్వం తెలుసుకున్న వారికి భక్తి గుండెలోతుల నుంచీ పొంగుకొస్తుంది. ఆయన మీద విశ్వాసం ఉన్న వారు చేసే ప్రతీ పనిలోనూ భక్తి అంతర్లీనంగా ఉంటుంది.భక్తి అంటే భగవంతుని వద్దకు వెళ్లి మన కోర్కెల చిట్టా చదవటం కాదు. ముడుపుల పేరుతో దేవుడితో లావాదేవీలు జరపడం అంతకన్నా కాదు. ఇవన్నీ కేవలం సాధనా మార్గాలు మాత్రమే. కోర్కెల గురించి మాత్రమే సర్వాంతర్యామిని ప్రార్థించాలనుకునేవారికి అసలు భక్తితత్వం బోధపడలేదని తెలుసుకోవాలి. పరమాత్మ సర్వాంతర్యామి. ఆయనకు తెలియనిది లేదు. అలాంటి సర్వవ్యాపకుడికి మన కోర్కెలు తెలిపి, 'ఇదీ నా ఫలానా అవసరం, దాన్ని తీర్చు' అని చెప్పుకోవడం హాస్యాస్పదమే కదా! మనతోపాటు, మన భూత భవిష్యత్ వర్తమాన కాలాల్ని సృష్టించిన ఆ దేవదేవుడికి, మనకు ఏం కావాలో ఏం అక్కర్లేదో తెలియదా..?

భగవంతుడిపై అచంచల విశ్వాసం, నమ్మకం ఉండాలి. మరి భగవంతుడి గురించి ఎలా తెలుసుకోవాలి? ఎవరు చెబుతారు? అనే ప్రశ్న ఉదయించినప్పుడే ఆలోచన, సాధన మొదలవుతాయి. అవే క్రమంగా పరిశోధనగా మారతాయి. నచికేతుడి తండ్రి వాజశ్రవుడు. అతడు విశ్వజిత్ అనే యాగం చేస్తూ అందులో భాగంగా అనేక దానాలు చేస్తుంటాడు. తండ్రి చేస్తున్న దానాల్ని గమనించిన నచికేతుడు 'నాన్నా! నన్ను ఎవరికి దానం చేస్తావు?' అని అడిగాడు. యాగ పనులతో తీరికలేకుండా ఉన్న వాజశ్రవుడు పిల్లవాడి మాటలకు విసుగెత్తి 'నిన్ను యముడికి దానం ఇచ్చాను' అన్నాడు. వెంటనే నచికేతుడు తనను తాను సమర్పించుకునేందుకు యముడి వద్దకు వెళ్లాడు.యముడు పిల్లాడిని చూసి ముచ్చటపడి మూడు వరాలు ఇస్తానంటాడు. అందులో ఒక వరంగా బ్రహ్మజ్ఞానం గురించి చెప్పమంటాడు నచికేతుడు. పసిబాలుడు ఊహించని వరం కోరేసరికి ఆశ్చర్యపోతాడు యముడు. అనేక ఆశలు చూపించి అతని దృష్టి మరల్చాలని చూస్తాడు. కానీ, నచికేతుడు దేనికీ లొంగడు. తన ప్రశ్నకు సమాధానం కావాలని పట్టుబడతాడు. బాలుడి పట్టుదలకు సంతోషించిన యముడు అతడికి బ్రహ్మజ్ఞానం బోధిస్తాడు. అదే కఠోపనిషత్తుగా అవతరించి అందరికీ ఆత్మజ్ఞానాన్ని అందిస్తున్నది. ఇలా తెలుసుకోవాలన్న తపన ప్రశ్నించిన భక్తుడితోపాటు మనందరినీ తరింపజేసింది. భగవంతుని పొందడానికి భాగవతంలో శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మని వేదనం ఇలా తొమ్మిది రకాల మార్గాలు సూచించారు. ఇవే నవవిధ భక్తిమార్గాలుగా ప్రసిద్ధి. ఏ మార్గాన్ని ఎంచుకున్నా అంతిమంగా భగవం తుడి అనుగ్రహం లభిస్తుంది. నిర్మలమైన భక్తికి భగవంతుడి అండదండలు ఉంటాయి. నిశ్చలమైన భక్తుడికి స్వామి కటాక్షం తప్పకుండా సిద్ధిస్తుంది.

**దేవుణ్ని ప్రశ్నిస్తే?**

భక్తి ఉన్నంత మాత్రాన ప్రశ్నించకూడదనేమీ లేదు. ప్రశ్నకు తగిన సమాధానం దొరికితే భక్తి మరింత పెరుగుతుంది. కార్యకారణ సంబంధాలను విశ్లేషించిన తరువాత ఏర్పడే భక్తిలో గాఢత ఎక్కువగా ఉంటుంది. కొడుకుకు ఏదైనా సందేహం వస్తే తండ్రిని ప్రశ్నిస్తాడు కదా! అనుమానం నివృత్తి చేసుకుంటాడు కదా! మరి జగత్తుకు తండ్రి అయిన దేవుడిని ప్రశ్నిస్తే మాత్రం తప్పేముంది. దేవుడు కూడా తనను నిలదీసే భక్తులను ఎక్కువ అనుగ్రహిస్తాడు. కత్తి పదునుతేలాలి అంటే సానబెట్టాలి. భక్తికీ అంతే! ఆటవికుడైన తిన్నడు పరమశివుడిని అంత తేలిగ్గా నమ్మలేదు. 'అసలు నువ్వెవరు?' అని ప్రశ్నించాడు. 'నీ జాడ ఎక్కడ?' అని నిలదీశాడు. భగవంతుడి జాడను తెలుసుకున్నాకే విశ్వసించాడు. పరమ భక్తుడిగా మారాడు. భాగవతం రాసిన పోతనామాత్యుడు పరమ భాగవతోత్తముడు. అయితేనేం

# హనుమంతుడి పుత్రుడు మకరధ్వజుడు!





వాయుదేవుడి వరంతో అంజనాదేవి, కేసరిలకు జన్మించిన ఆంజనేయస్వామి సాక్షాత్తు పరమశివుని అవతారుడు. ప్రధానంగా రామాయణంలో శ్రీరాముని భక్తుడిగా పేరుగాంచాడు. ఇతర కొన్ని పురాణాలు, ఉపనిషత్తుల ప్రకారం ఆంజనేయస్వామికి భార్య సువర్చలాదేవి వున్న ట్టే ఆయనకు ఒక కొడుకు ఉన్నాడు. కానీ ఈ విష యం చాలామందికి తెలియదు. ఆంజనేయస్వా మి కొడుకు ఎవరు? అతని జన్మ రహస్యం%ొా% ఆం జనేయస్వామి ఆయన కొడుకును గుర్తించిన విధానం అన్నీ అద్భుతంగా జరిగిన సంఘటనలే.

రామాయణ కథ ప్రకారం సీతాదేవిని వెతక డానికి ఆంజనేయస్వామి లంకకు వెళతాడు. సీతాదేవిని అప్పగించమని ఆంజనేయస్వామి చేసిన హితబోధ రావణాసురుడికి నచ్చదు. అత ను సైన్యాన్ని పిలిచి ఆంజనేయుడి తోకకు నిప్పం టించమంటాడు. ఆంజనేయస్వామి నిప్పంటిం చిన తోకతో లంకంతా అంటించాడు. చివరకు లంక నుంచి తిరిగి రాములవారి చెంతకు వెళు తూ సముద్రంలో మునిగి తోకకున్న మంటను ఆర్పుకుని సేదతీరాడు. ఆంజనేయస్వామి సము ద్రంలో మునిగినప్పుడు ఆయన శరీరం నుంచి వెలువడిన ఒక స్వేదబిందువు జలకన్య నోటిలోకి ప్రవేశించడంతో ఆమె గర్భం దాలుస్తుంది. ఈ విషయం గ్రహించిన హనుమంతుడు సముద్రం నుండి బయటకు వెళ్ళిపోతాడు.

కొన్నిరోజుల తరువాత పాతాళరాజు మైరా వణుడి భటుల వలలో ఆ జలకన్య చిక్కుతుంది. మైరావణుడికి ఆహారంగా ఆ జలకన్యను భటులు రాజుదగ్గరకు తీసుకువెళతారు. ఈ క్రమంలోనే జలకన్య పొట్టకోసినప్పుడు ఆమె గర్భంలో ఓ వింత శిశువు కనిపిస్తాడు. ఆ శిశువు శరీరం సగ భాగం కోతిని సగభాగం చేపను పోలి ఉంటుంది. ఈవిధంగా రెండు రూపాలు కలిగి ఉన్నటువం టి ఆ జీవికి మకరధ్వజుడు అని నామకరణం చేశారు. మైరావణుడు అతన్ని ద్వారపాలకుడిగా నియమించాడు. మకరధ్వజుడు సాహసోపేత మైన యుద్ధవీరుడు.

రావణాసురుడు రాముడితో యుద్ధంచేసే సమయంలో రామలక్ష్మణులను బంధించి మైరా వణుడి కోటలో బంధించాడు. ఈ విషయం తెలు సుకున్న ఆంజనేయుడు రామలక్ష్మణులను విడి పించడానికి మైరావణపురానికి వెళతాడు. అక్క డ మకరధ్వజునితో హనుమంతుడు తలపడాల్సి న పరిస్థితి తలెత్తుతుంది. ఈ క్రమంలోనే మకర ధ్వజుని బలపరాక్రమాలను చూసి ఆంజనేయ స్వామి విస్మయానికి లోనై నీవు ఎవరి పుత్రుడవు ? అని అడుగుతాడు. మకరధ్వజుడు తాను హను మంతుడు పుత్రుడినని చెప్పగా ఆశ్చర్యపోయిన ఆంజనేయస్వామి తాను బ్రహ్మచారని చెప్తాడు. జరిగిన సంఘటనలన్నిటినీ కళ్లు మూసుకుని తన మనోనేత్రంతో హనుమంతుడు గుర్తుచేసుకు న్నాడు. అప్పుడే అతడికి తన స్వేద బిందువు జల కన్య నోటిలోకి పోవడం ద్వారా మకరధ్వజుడు జన్మించాడని భావించి, అతనిని ఆలింగనం చేసు కొని పరవశించిపోతాడు. మైరావణుని సంహ రించి రామలక్ష్మణులను విడిపిస్తాడు. మకరధ్వ జుడుని పాతాళానికి అధిపతిని చేసి రామలక్ష్మణు లను తీసుకుని వెళ్ళిపోతా డు ఆంజనే యస్వామి.

# చెమట వాసనా?

చంకల్లో ఎక్కువగా చెమట పట్టడాన్ని హైపర్ హైడ్రోసిస్ అంటారు. ఇబ్బంది కలిగించే ఈ సమస్య అందరిలోనూ తలెత్తుతుంది. అతిగా చెమట పట్టడం వల్ల బట్టల మీద మరకలు, దుర్వాసన, తరచుగా బట్టలు మార్చుకోవడం మొదలైన ఇబ్బందులు తలెత్తుతాయి. అంతేకాదు ఈ సమస్య మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. హైపర్‌హైడ్రోసిస్‌కు కొన్ని చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులను సంప్రదించిన తర్వాతే తగిన చికిత్సను ఎంచుకోవాలి.

**ప్రిస్క్రిప్షన్ స్ట్రెంత్ యాంటీ పెర్స్‌పిరెంట్స్:** మామూలు డియోడరెంట్ల లాంటివి పనిచేయనప్పుడు డాక్టర్లను సంప్రదించాలి. వాళ్లు చంకల్లో అతి చెమటను నివారించే యాంటీ పెర్స్‌పిరెంట్స్ సిఫారసు చేస్తారు. వీటిలో అల్యూమినియం క్లోరైడ్ హెక్సాహైడ్రేట్ లాంటివి అత్యధిక గాఢతలో ఉంటాయి కాబట్టి, నిపుణుల సలహా మేరకే వాడాలి.

**టాపికల్ యాంటీపెర్స్‌పిరెంట్స్:** చంకల్లో అతి స్వేదం సమస్యకు టాపికల్ యాంటీపెర్స్‌పిరెంట్స్ తేలికగా అందు బాటులో ఉన్న చికిత్స సదుపాయాలు. వీటిలో ఉండే అల్యూమినియం క్లోరైడ్ స్వేద గ్రంథుల్ని మూసేస్తుంది. అలా ఎక్కువ చెమట వెలువడటాన్ని తగ్గిస్తుంది. టాపికల్ యాంటీపెర్స్‌పిరెంట్స్‌ను పడుకునే ముందు చంకల్లో పొడి చర్మం మీద పూతగా రాసుకుంటే ఫలితం కనిపిస్తుంది.



**బొటాక్స్ ఇంజెక్షన్స్:** చంకల్లో చెమటకు బొట్యులినమ్ టాక్సిన్ కలిగిన బొటాక్స్ ఇంజెక్షన్స్ సమర్థమైన చికిత్స అందిస్తాయి. బొట్యులినం టాక్సిన్ చంకల్లో చెమటను ప్రేరేపించే రసాయన సిగ్నల్స్‌ను అడ్డుకుంటాయి. కొన్ని నెలలపాటు ప్రభావం చూపే బొటాక్స్ ఇంజెక్షన్లను వైద్యుడి ద్వారానే తీసుకోవాలి. క్రమం తప్పకుండా ఇంజెక్షన్లు తీసుకుంటేనే అతి స్వేదం సమస్య నుంచి ఉపశమనం కొనసాగుతుంది.

**అయాన్‌టోఫోరసిస్:** ఇందులో భాగంగా నీళ్ల ద్వారాగానీ, లేదంటే తడి ప్యాడ్‌ను చంకల్లో ఉంచి ఓ మోస్తరు విద్యుత్తును చంకల్లోకి పంపిస్తారు. దీంతో స్వేద గ్రంథులు తాత్కాలికంగా పూడుకుపోతాయి. అలా అధికంగా చెమట పట్టడం నుంచి విముక్తి లభిస్తుంది. మంచి ఫలితాలు రావడానికి ఈ చికిత్సను కొన్ని వారాలకు ఒకసారి నిపుణుల పర్యవేక్షణలో చేయించుకోవాలి.

**లేజర్ చికిత్స:** లేజర్ అబ్లేషన్, లేజర్ లైపోలైసిస్ చంకల్లో చెమటకు మంచి చికిత్స. ఈ చికిత్సలో చంకల్లో స్వేద గ్రంథుల్ని లక్ష్యంగా చేసుకుని చికిత్స చేస్తారు. దాంతో చెమట వెలువడటం తగ్గిపోతుంది. లేజర్ థెరపీతో చర్మంపై కోత తక్కువగా ఉంటుంది (మినిమల్లీ ఇన్వేసివ్). అదే సమయంలో సమస్యకు పరిష్కారం తొందరగా దొరుకుతుంది. కానీ, లేజర్ చికిత్స మీ చర్మానికి తగిందో కాదో డాక్టర్‌ను సంప్రదించాకే నిర్ధారించుకోవాలి.

**సర్జరీ ద్వారా:** మామూలు చికిత్సల ద్వారా హైపర్‌హైడ్రోసిస్ సమస్య ఏమాత్రం తగ్గకపోతే వైద్యులు సర్జరీని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఇలాంటివా టిలో ఆగ్జిలరీ స్వెట్ గ్లాండ్ సక్షన్ క్యూరెటేజ్ ఒకటి. దీని ద్వారా చంకల్లో స్వేద గ్రంథుల్ని పూర్తిగా తొలగిస్తారు. మరో చికిత్స థొరాసిక్ సింపథెక్టమీ. ఇందులో చెమట ఉత్పత్తికి మూలమైన నరాలను కత్తిరించిడం లేదా ముడివేయడం చేస్తారు. అయితే సర్జరీని చివరి అస్త్రంగా మాత్రమే ఎంచుకోవాలి. అదీ నిపుణుడిని సంప్రదించిన తర్వాతే.

## వెజిటేరియన్లు అయిన పిల్లలకు ప్రొటీన్ ఎలా?

# ఎలాంటి ఆహారం పెట్టాలి?

పిల్లల ఎదుగుదలకు ప్రొటీన్ చాలా అవసరం. కానీ శాకాహారులకు సాధారణ ఆహారంలో అది సరిపడినంత దొరకడం కష్టం అంటారు కదా! మరి వెజిటేరియన్లు అయిన పిల్లలు చక్కగా ఎదగాలంటే ఎలాంటి ఆహారం పెట్టాలి. జీడిపప్పు, బాదం లాంటి ఖరీదైనవి కాకుండా మామూలు ఆహారం తినేవాళ్లకు కూడా సరిపోయేలా ఏమైనా పదార్థాలు ఉన్నాయా? తెలుపగలరు.



చ నిర్మాణంలోనూ, దాని పనితీరులోనూ ఇది కీలకపాత్ర పోషిస్తుంది. మన శరీరంలోని సగానికిపైగా ప్రొటీన్ కండరం రూపంలో మిగతాది ఎముక, మజ్జ, చర్మాల్లో ఉంటుంది. 20 దాకా అమైనో యాసిడ్ల సమ్మేళనంగా ఇది తయారైక్కని పౌష్టికాహారం పిల్లల ఎదుగుదలకు అత్యావశ్యకం. అందులోనూ శరీర నిర్మాణానికి ప్రొటీన్ చాలా అవసరం. ప్రతి కణంతే, అందులో 9 ముఖ్యమైన వాటిని మనం ఆహారం ద్వారా తీసుకోవలసిందే.

సాధారణంగా మాంసంలో దొరికే ప్రొటీన్‌లో ఇవన్నీ ఉంటాయి. శరీరం దాన్ని బాగా శోషించుకుంటుంది కూడా. కానీ శాకాహారం విషయంలో ఇలా ఉండదు. ఈ పదార్థాల్లో కొన్ని రకాల అమైనో యాసిడ్లు తక్కువగా దొరుకుతాయి. తృణధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పుల సమ్మేళనంగా మన ఆహారాన్ని మలచుకుంటే ఇవన్నీ దొరకడం కష్టమేం కాదు. ఇందుకోసం, 3:1 నిష్పత్తిలో ధాన్యాలు, పప్పులు కలిపి తీసుకోవాలి. రోజూ పావు లీటరు పాలు దీనికి జోడించాలి.

కందులు, పెసలు, ఉలవలు, మినుములు, బఠాణీలు, శనగలు, బొబ్బర్లు, బీన్స్‌లాంటి చిక్కుడు జాతి గింజల్లో ప్రొటీన్ పుష్కలంగా లభిస్తుంది. అలాగే బాదం, పిస్తా, జీడిపప్పు, వాల్‌నట్స్, నువ్వులు, గుమ్మడి, అవిసె గింజల్లో కూడా ఇది అధిక మోతాదులో దొరుకుతుంది. విభిన్న రకాల రుచికరమైన వంటల రూపంలో వీటిని ఆహారంలో భాగం చేయడం ద్వారా మనం పిల్లలకు కావలసిన ప్రొటీన్‌ని అందించగలుగుతాం.

ఉడికించిన శనగలు, అలసందలు, బొబ్బర్లతో గుగ్గిళ్లు చేసి పెట్టొచ్చు. పెసరట్టు పప్పుల చట్నీ, పెసలు కందులు వేసిన కిచిడీలు, బిసిబేళా బాత్, పచ్చి శనగపప్పు గోధుమపిండితో చేసే పోలెలు కూడా మంచివే.

పనీర్ పులావ్, సోయా పులావ్ లాంటివీ బాగుంటాయి. మొలకెత్తిన గింజలతో చేసే స్టీమ్డ్ టిక్కా, సున్నుండల్లాంటివి బలాన్నిస్తాయి. ఇడ్లీ, దోశల్లోనూ ప్రొటీన్ దొరుకుతుంది.

బతుకమ్మ పండుగకు చేసే రకరకాల సత్తుపొడులు, శనగపప్పు కలిపి చేసే సర్వపిండి కూడా ఈ కోవలోవే.

పండ్లలో గింజల్ని కలిపి ఇవ్వచ్చు. దానిమ్మ గింజల్లో గుమ్మడి, పుచ్చ లేదా సన్‌ఫ్లవర్ గింజల్లాంటివి కలిపి పెట్టొచ్చు.

గ్లాసెడు పాలల్లో డ్రైఫ్రూట్ పొడి కలిపి, లేదా చిరుధాన్యాలను మొలకెత్తించి బెల్లంతో కలిపిన పొడి కలిపి ఇవ్వచ్చు.

మజ్జిగ, పెరుగు, చల్లచారు కూడా ప్రొటీన్ అందించేవే.

## కుంకుమ పువ్వును ఇలా వాడితే..

# డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిన పనిలేదు..!

కుంకుమపువ్వు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యాల్లో ఒకటి. నిజానికి కుంకుమ పువ్వును క్రోకస్ సాటివస్ అనే మొక్క పువ్వు పుప్పొడి నుంచి సేకరిస్తారు. ఈ పుప్పొడి రేకులను ఎండబెట్టి కుంకుమ పువ్వుగా చేస్తారు. కుంకుమ పువ్వును ఆంగ్లంలో సాఫ్రాన్ అంటారు. కుంకుమపువ్వును రకరకాల స్వీట్లను తయారు చేయడం వాడుతారు. ఆయుర్వేదం పరంగా కూడా దీన్ని తీసుకోవడం ద్వారా శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవచ్చు. కుంకుమపువ్వులో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, థయామిన్, ఫోలేట్, విటమిన్ బి6, కాపర్ వంటి పోషకాలు లభిస్తాయి. కుంకుమ పువ్వు ఆయుర్వేదంలో ఒక అద్భుతమైన ఔషధ మూలిక. అనేక ఆరోగ్య సమస్యల నుండి బయటపడేందుకు కుంకుమపువ్వును తీసుకుంటారు. కుంకుమ పువ్వు వల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనాలు



**నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది:** కుంకుమపువ్వులో ఒత్తిడిని తగ్గించే చాలా శక్తివంతమైన పదార్థాలు ఉన్నాయి, ఇవి మీ మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. మీరు బాగా ఎక్కువసేపు నిద్రపోవడానికి సహాయపడతాయి. మీకు నిద్రలేమి వంటి సమస్యలు ఉంటే, మీరు ప్రతిరోజూ కుంకుమపువ్వును తీసుకోవాలి. ఇది మీ నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**జీర్ణ సంబంధిత సమస్యల నుండి ఉపశమనం:** ఔషధ గుణాలు కలిగిన కుంకుమపువ్వును తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు నయమవుతాయి. గ్యాస్, అజీర్ణం ఆమ్లత్వం మొదలైన వాటి నుండి ఉపశమనం వంటిది. కాబట్టి రోజూ పాలతో కుంకుమపువ్వును తినండి.

**కుంకుమపువ్వు కంటి చూపును మెరుగుపరుస్తుంది:** కుంకుమపువ్వు కళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయ పడతాయి. వయసు పెరిగే కొద్దీ దృష్టిలోపం ఉన్నవారు కుంకుమపువ్వు తీసుకోవడం వల్ల ప్రయోజనం పొందుతారు. ఇందులో క్రోసిన్ సఫ్రానల్ వంటి కెరోటినాయిడ్లు ఉన్నాయి, ఇవి కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడతాయి.

**జ్ఞాపకశక్తిని బలపరుస్తుంది:** ఆయుర్వేద వైద్య పద్ధతుల ప్రకారం, కుంకుమపువ్వు మానసిక శక్తిని పెంపొందిం చడంలో చాలా ప్రభావవంతమైనదిగా పరిగణించబడుతుంది. ఇందులో కుంకుమపువ్వులో ఉండే ప్రత్యేక యాంటీఆక్సిడెంట్లు అల్జీమర్స్ వ్యాధి లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి.

**బరువును తగ్గిస్తుంది:** ఒక చిటికెడు కుంకుమపువ్వు మీ ఆకలిని అరికట్టడంలో సహాయపడుతుంది, తద్వారా మీకు అతిగా తినే అలవాటు ఉంటే దానిని దూరం చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కుంకుమపువ్వు తీసుకోవడం మంచి ఆప్షన్ అని చెప్పవచ్చు. .

**చర్మ సౌందర్యం పెంచుతుంది:** కుంకుమపువ్వులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలు, బ్లాక్ హెడ్స్ మచ్చలు వంటి చర్మ సంబంధిత సమస్యలను నయం చేయడంలో సహాయపడతాయి.

**కుంకుమపువ్వు ఎలా తీసుకోవాలి?**

కుంకుమపువ్వును అనేక రకాలుగా ఉపయోగించవచ్చు. పాలలో కుంకుమపువ్వు కలిపి త్రాగడం ఒక మంచి పద్ధతి. కుంకుమపువ్వులో అనేక ఆరోగ్యాన్ని పెంపొందించే లక్షణాలు ఉన్నాయి, కాబట్టి దీనిని అనేక సాంప్రదాయ ఔషధాలలో కూడా ఉపయోగిస్తారు. అయితే కుంకుమ పువ్వు అతిగా వాడితే అజీర్తి చేసే అవకాశం ఉంటుంది. అందుకే మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి కుంకుమపువ్వు ఎంత మోతాదులో తీసుకోవాలో తెలుసుకోవడానికి వైద్యుడిని సంప్రదించండి.



# పోహా వహ్వా!

**పోహాను మనం అటుకులు అని పిలుస్తాం. ఇవంటే శ్రీకృష్ణ భగవానుడికి ఎంతో ఇష్టమని తెలిసిందే. అందుకే, కష్టాల్లో ఉన్న కుచేలుడు తన మిత్రుడికి గుప్పెడు అటుకులు తీసుకువెళ్తాడు. అపారమైన సంపదలు వరంగా పొందుతాడు. ఉదయం వేళ, సాయంత్రాల్లో ఉపాహారంగా పోహాను మించిన మంచి ఆహారం ఇంకోటి లేదంటే అతిశయోక్తి కాదు. భూమ్మీద మనిషి తొలి చిరుతిండ్లలో పోహా ఒకటి.**

**అరుగుదల తేలిక...**

పోహాను పిల్లలు మొదలుకొని పెద్దల వరకు ఎవ్వరైనా సరే నిరభ్యంతరంగా తినేయవచ్చు. తేలికగా అరిగిపోతాయి. అంతేకాదు వీటితో ఉపాహారం చేసుకోవడం క్షణాల్లో పని.

**శక్తిదాయిని...**

పోహా శరీరానికి శక్తిని ఇచ్చే ఆహారపదార్థం. దీంతో తిన్న వెంటనే కొంతసేపటి వరకు చురుగ్గా ఉంటాం. పిండిపదార్థాలు మాత్రమే ఉండే ఇతర పదార్థాలతో పోలిస్తే పోహా ఆరోగ్యకరమైనది. ఇందులో ఫైబర్ ఉంటుంది. రక్తంలోకి చక్కెరను నిదానంగా విడుదలయ్యేలా చేస్తుంది కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారికీ పోహా మంచి ఆహారమే. ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. పైగా ఇది గ్లూటెన్ ఫ్రీ కూడా. గ్లూటెన్ అలర్జీ ఉన్నవాళ్లూ ఎంచక్కా తినొచ్చు.

**పోషకాల పెన్నిధి...**

పోహాలో ఐరన్ కొద్దిమొత్తంలో ఉంటుంది. ముడిబియ్యంతో చేస్తారు కాబట్టి బి విటమిన్ కూడా ఉంటుంది. బ్రేక్‌ఫాస్ట్ కోసం పోహాలో పల్లీలు జోడిస్తాం. దీంతో ప్రొటీన్లు, యాంటీఆక్సిడెంట్లు కలిసి పోహాను మరింత ఆరోగ్యకరంగా మారుస్తాయి. నిమ్మరసం చిలకరించడంతో విటమిన్ సి తోడవుతుంది. ఇది అటుకులు, పల్లీల్లో ఉండే ఐరన్ శరీరానికి అందేలా దోహదపడుతుంది.

**మరింత ఆరోగ్యం కావాలా?**

అయితే రెడ్ రైస్‌తో తయారైన అటుకులు తీసుకోవాలి. వీటికి ఎర్ర రంగును ఇచ్చేది ఆంథోసైనిన్ అనే పిగ్మెంట్. పైగా ఇది యాంటీఆక్సిడెంట్ కూడా. ఇందులో ఫైబర్, విటమిన్ బి, కాల్షియం, జింక్, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం కూడా ఎక్కువగానే ఉంటాయి.

**రకరకాలుగా...**

అటుకులను తీసుకుని. ఆవాలు, కరివేపాకు, పల్లీలు, ఆలుగడ్డ ముక్కలు, బఠానీలతో పోపు వేసుకోవాలి. దీనిపై నిమ్మరసం చిలకరించుకోవాలి. అవసరం అనుకుంటే పుట్టగొడుగులు, మిరియాలు, చీజ్ కలుపుకోవచ్చు. పాలకూర కూడా వేసుకోవచ్చు. టోఫు, మొలకలు, సోయా ఉండలు జోడించి మరింత రుచికరంగా మార్చుకోవచ్చు.

**ఎలా తిన్నా మంచిదే...**

కొంతమంది అటుకులకు పెరుగు కలుపుకొనీ తింటారు. ఇలా చేయడం వల్ల శరీరానికి కాల్షియం అందుతుంది. అటుకులు, ఆవకాయ, పెరుగు మిశ్రమం రుచి తెలుగువారికి పాత అనుభూతే. కొంతమంది చక్కెర వేసిన పాలలో అటుకులు కలుపుకొని కూడా తింటారు. ఎలా తిన్నా అటుకులు మంచే చేస్తాయి.

# ఒత్తిడి తిండి.. ముప్పేనండి



ఉరుకులు పరుగుల జీవితం కొన్నిసార్లు ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన, తలనొప్పులు, గుండె, శ్వాస సమస్యలు తదితర మానసిక, శారీరక దుష్ప్రభావాలకు దారితీస్తున్నది. ముఖ్యంగా ఉద్యోగాలు చేస్తున్న వారిలో గడిచిన కొన్నేళ్లుగా ఒత్తిడి తిండిగా పిలిచే-స్ట్రెస్ ఈటింగ్ పెరిగిపోతున్నది. ఇది రాత్రిళ్లు ఉద్యోగాలు చేసేవారిలో మరీ అధికంగా ఉందంటున్నారు నిపుణులు. అయితే, చాలామందికి తమ జీవిత విధానం ఎలా ఉందో గమనించుకునే తీరిక లేకుండా పోయింది. ఈ సమస్యను వదిలించుకోవడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయి.

**కారణాలు**

- ప్రతికూల ఆలోచనలు ఉన్నవాళ్లు వాటిని నియంత్రించుకోవడం ఎలాగో తెలియకపోవడంతో ఏదో ఒకటి ఆబగా తినేస్తుంటారు.
- అధిక ఒత్తిడి శరీరంలో సెరటోనిన్ స్థాయుల మీద ప్రభావం చూపుతుంది. దీనివల్ల ఎక్కువ కొవ్వు, చక్కెర ఉన్న ఆహారం పట్ల నాలుక గుంజుతుంది.
- మితిమీరిన ఆందోళన కూడా తిండి ఎక్కువగా తినడానికికారణమవుతుంది.
- వ్యాయామం చేయకపోవడం వల్ల విసుగ్గా ఉంటుంది. దీంతో మనసు అనారోగ్యకరమైన జంక్‌ఫుడ్ వైపు మళ్లుతుంది.



**దుష్ప్రభావాలు**

- కావాల్సిన దానికంటే ఎక్కువగా తింటాం. తినే తిండి మీద నియంత్రణ ఉండదు.
- టీవీ చూస్తూ, స్మార్ట్‌ఫోన్లు వాడుతూ పరిమితికి మించి తింటూ ఉంటాం. ఇది ఊబకాయానికి దారితీస్తుంది.
- టైప్ 2 డయాబెటిస్, అధిక రక్తపోటు, దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు, గుండె కవాటాలకు సంబంధించిన సమస్యల బారినపడతాం.



**ఇవి తినొచ్చు**

- ఆపిల్, అరటి, ద్రాక్ష, నారింజ, జామ, బాదం, కాజు లాంటి ఆరోగ్యాన్నిచ్చే పండ్లు, గింజలు తీసుకోవాలి.
- విటమిన్లు, ఐరన్‌తో నిండిన తాజా పండ్లరసాలను తాగాలి.
- గుమ్మడి గింజలు, గ్రీన్ టీ, చేమంతి టీ (చమోమైల్ టీ), గుడ్లు లాంటి యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి.
- బటర్ లేకుండా స్వీట్‌కార్న్, పాప్‌కార్న్ తీసుకుంటే మంచిది.

**కొన్ని చిట్కాలు**

- తినే మోతాదు తగ్గించుకోవాలి.
- రోజూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తగిన మోతాదులోనే తీసుకోవాలి.
- శ్వాస వ్యాయామాలు, ధ్యానం, యోగా లాంటివి సాధనచేయాలి.
- బరువును గమనించుకుంటూ ఉండాలి.
- టీవీలు చూస్తున్నప్పుడు, పనులు చేస్తున్నప్పుడు తినడం మానుకోవాలి.
- కాఫీ, స్వీట్లను పక్కనపెట్టాలి. ఇవి ఆందోళనను పెంచుతాయి.
- అవసరమైతే ఆహార నిపుణులను, డాక్టరును సంప్రదించాలి.

# వేసవి దుక్కులతో ఎన్నో ప్రయోజనాలు

## చీడ పురుగులు, కలుపు నివారణ
## పంట వ్యర్థాలు సద్వినియోగం

వేసవిలో దుక్కి దున్నడాన్ని రైతులు వృథా ఖర్చుగా భావిస్తుంటారు. దీంతో యాసంగి పంటల కోతల తర్వాత మళ్లీ వర్షాకాలం వచ్చే వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తుంటారు. కానీ.. వేసవి దుక్కుల వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని, కర్బన శాతం, నీటిని నిలుపుకొనే శక్తి పెరుగుతుందని నేరేడుచర్ల ఇన్‌చార్జి ఏఓ ప్రీతంకుమార్ సూచిస్తున్నారు.

**వేసవి దుక్కులు చేయకుంటే..**

వేసవి దుక్కులు దున్నకుంటే కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూసారం తగ్గడానికి కారణమవుతాయి. భూమిలోని లోతైన పొరల నుంచి కూడా తేమను తీసుకుంటూ, ఆవిరి రూపంలో బయటకు పంపుతాయి.

దీని వల్ల ముడి పోషకాల కొరత ఏర్పడి తర్వాత వేసే పంటలకు అత్యధిక మోతాదులో రసాయన ఎరువులు వాడాల్సి వస్తుంది. పంట కోత తర్వాత దుక్కి దున్నకుండా వదిలివేయడంతో వర్షాకాలం వచ్చిన తర్వాత భూమిని సిద్ధం చేసేందుకు ఆలస్యమవుతుంది. దీంతో పంటను సరైన సమయంలో విత్తుకోలేరు.

**వేసవి దుక్కులతో లాభాలివి..**



చీడపీడల నివారణ : వేసవి కాలంలో చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమిలో ఆశ్రయం పొందుతాయి. వేరుశనగ, చెరుకు, పండ్ల చెట్లను ఆశించే వేరు పురుగులు.. అపరాలు, పత్తి, కంది మొదలైన పంటలను ఆశించే పచ్చపురుగు, లద్దెపురుగు, బొంతపురుగు, దాసరి పురుగులు కోశస్థ దశలో భూమిలోనే ఉంటాయి.

తొలకరి వర్షాలు కురిసినప్పుడు రెక్క పురుగులు ప్యూపాల నుంచి బయటకు వచ్చి పంటలను ఆశించి నష్టపరుస్తాయి. వేసవిలో లోతు దుక్కులు చేయడం వల్ల నేలలో ఉన్న చీడపురుగుల కోశస్థ దశలు, గుడ్లు బయటపడి ఎండ వేడికి చనిపోతాయి.

**కలుపు నివారణ :** కలుపు మొక్కలు పంటకు ప్రత్యక్షంగా నష్టం కలిగించడంతోపాటు పరోక్షంగా చీడపీడలకు ఆశ్రయం ఇచ్చి, పంట నష్టానికి కారణమవుతాయి. వేసవి దుక్కులతో బహువార్షిక కలుపు మొక్కలైన తుంగ, గరిక, రెల్లదర్బ వంటివి నాశనమవుతాయి.

**నేలలో నీటి నిల్వ పెంపు :** వేసవి దుక్కులను వాలుకు అడ్డంగా చేసుకోవాలి. వాలు వెంట దున్నితే నేల కోతకు గురై సారవంతమైన మట్టి కొట్టుకుపోతుంది. వేసవి దుక్కులు చేసే ముందు పశువుల ఎరువు గానీ, కంపోస్టు గానీ, చెరువు మట్టి గానీ వెదజల్లితే భూమికి తేమను నిలుపుకొనే శక్తి పెరుగుతుంది.

**నేల గుల్లబారుతుంది :** వేసవి చేసినప్పుడు, ఆ తర్వాత తొలకరి వర్షాలకు దున్నినప్పుడు నేల గుల్లబారుతుంది. దాంతో మొక్కల వేర్లు బాగా విస్తరిస్తాయి. చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందడంతోపాటు వానపాముల సంతతి గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

**పంట అవశేషాల సద్వినియోగం :** లోతు దుక్కి దున్నినప్పుడు పంట అవశేషాలు, కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు నేలలో కలిసి సేంద్రియ ఎరువుగా మారుతాయి. దీంతో నేలలో సేంద్రియ కర్బన శాతం, పోషక పదార్థాలు పెరిగే అవకాశం ఉంటుంది.

# ఆస్టర్ పూలకు మంచి డిమాండ్.!





బొకేలు, ఫంక్షన్లలో డెకరేషన్ కోసం ఉపయోగిస్తున్న సువాసనలు వెదజల్లే పూలకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. ఒకప్పుడు కేవలం లిల్లీ, గులాబీ పూలను మాత్రమే డెకరేషన్లో వాడేవారు. ప్రస్తుతం అందంతో పాటు సువాసనలు వెదజల్లుతూ అందరినీ ఆకట్టుకుంటున్న పూలు జాబితాలోకి ఆస్టర్ పూలు కూడా వచ్చి చేరాయి. మార్కెట్లో ప్రస్తుతం వీటికి మంచి డిమాండ్ ఉండటంతో రైతులు ఆరు బయట, పాలీ, గ్రీన్ హౌజ్ లు ఏర్పాటు చేసి సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. సాధారణంగా చల్లని వాతావరణంలో మాత్రమే పండే ఈ పంట తెలుగు రాష్ట్రాల్లో కూడా సాగు చేస్తూ లాభాలు అర్జిస్తున్న రైతులు ఎందరో ఉన్నారు. ఈ మొక్క వేర్లు కూడా నేలపైనే ఉంటాయి. కాబట్టి.. నీటి ఎద్దడిని, అధిక వర్షాలను తట్టుకోలేదు. అయినప్పటికీ కొంతవరకు ఉష్ణోగ్రతను తట్టుకొని దిగుబడినిస్తుంది. ఈ పంట సాగు చేస్తున్న నేల ఎప్పటికీ తేమగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి. ఈ మొక్క రకం ఆధారంగా నాటిన 70-80 రోజులకే దిగుబడి మొదలవుతుంది. అధిక ఉష్ణోగ్రతను కొంత వరకు తట్టుకుంటుంది. నీటి సౌకర్యం ఉంటే వేసవిలో కూడా సాగు చేయవచ్చు. ఆస్టర్లో పింక్, ఊదా, తెలుపు రంగు రకాల్లో పూలు ఉన్నాయి. అధిక దిగుబడితో పాటు ఆకర్షణీయంగా కనిపించే ముద్ద, పలుచని రకాల పూలకు మంచి డిమాండ్ ఉంది. కాబట్టి మార్కెటింగ్ ఇబ్బంది లేకుండా.. రైతు లాభాలు పొందవచ్చు. సారవంతమైన అన్ని రకాల నేలల్లో ఈ సాగు చేపట్టవచ్చు. ప్రధానంగా నీరు ఇంకే ఎర్ర గరప నేలలు సాగుకు అనువుగా ఉంటాయి. ఈ సాగు చేపట్టాలనుకుంటే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నారు పోసుకోవాలి. జనవరి నుంచి ఫిబ్రవరి వరకు దిగుబడి వస్తుంది. మొక్క నాణ్యతతో ఉండాలంటే నారు దశలోనే జాగ్రత్తలు వహించాలి. ఎకరా చేనులో సాగు చేయాలంటే దాదాపు 1-1.5 కిలోల విత్తనం సరిపోతుంది. మొక్కలు-వరుసల మధ్య 30 సెంటీమీటర్ల దూరం పాటించి విత్తుకోవాలి. ఈ సాగులో చీడల సమస్య కూడా పెద్దగా ఉండదు. ఈ పంట కాలం 4 నెలలు. దిగుబడి వస్తున్న కొద్దీ కోతలు చేపడుతుంటారు. ఒక పంటలో దాదాపు 10-15 కోతలు చేపట్టే అవకాశం ఉంటుంది. మేలైన సస్యరక్షణ చర్యలు చేపడితే దాదాపు ఎకరాకు 4-5 టన్నుల దిగుబడి సాధించవచ్చు.

# కాసుల పంట డ్రాగన్ ఫ్రూట్
## సాగు వివరాలు - ప్రభుత్వ ప్రోత్సాహం

కొత్త పంటలు సాగు చేస్తూ అధిక దిగుడులు సాధించడం కోసం తెలుగు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపిస్తున్నారు. ఇందులో ప్రధానంగా డ్రాగన్ ఫ్రూట్ ఒకటి. మొదట్లో అధిక పెట్టుబడి అవుతున్నప్పటికీ రైతులకు అధిక లాభాలు తెచ్చిపెడుతోన్న పంట ఇది. ఒక్కసారి నాటితే దాదాపు 15-20 ఏళ్లపాటు దిగుబడినివ్వడం, ఆశించిన దానికంటే ఎక్కువే ఆదాయం వస్తుండటంతో రైతులు సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇందులో ఉన్న పెద్ద సమస్యల్లా.. అధిక పెట్టుబడి. మొక్కలు, ఎరువులు, పోల్స్, ప్రధాన పొలం తయారీ, ట్రాన్స్పోర్ట్ ఛార్జీలు, డ్రిప్, కూలీ ఖర్చులన్నీ కలిపి ఎకరాకు దాదాపు రూ.6 లక్షలకు పైనే ఖర్చవుతుంది. ఈ ఫ్రూట్లో అధిక రోగనిరోధక శక్తి ఉండటం, ఔషధాల తయారీలో ఉపయోగించడంతో ప్రస్తుతం మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడింది. విదేశాల్లో పండించే ఈ పంటకు అనుకూలమైన నేలలు మన దేశంలో ఉండటం విశేషం. దీంతో పాటు విత్తిన ఏడాది లోపే దిగుబడి మొదలై ఎక్కువ రోజులు రైతు లాభపడవచ్చు. 20-30 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, నేల %జూ౧% 5.5 నుంచి 7 వరకు ఉన్న నేలల్లో ఈ మొక్క బాగా పెరుగుతుంది.

**ఎకరాకు 4 టన్నుల దిగుబడి:**

రసాయన ఎరువులతో సేద్యం చేయడం కంటే, సేంద్రియ విధానంలో సాగు చేస్తే అధిక లాభాలు, నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని అనుభవమున్న రైతులు అంటున్నారు. కేవలం మొదటి ఏడాది పెట్టుబడి పెడితే మళ్లీ మీకు పెద్దగా ఖర్చేమీ ఉండదు. ఈ మొక్కలు, పండ్లను జంతువులు తినవు. చీడపీడల బెడద తక్కువే. మార్కెట్లో ప్రస్తుతం కిలోకు ధర రూ.150-200 వరకు పలుకుతోంది. మేలైన సేద్యం చేపడితే ఒక్కసారి పంట కోసినప్పుడు ఎకరాకు 2-4- టన్నులకు పైనే దిగుబడి వస్తుంది. టన్నుకు దాదాపు రూ.1.5లక్షల పైనే ఆదాయం ఉంటుంది. నాటుకున్న రెండో సంవత్సరం నుంచి రూ.9 లక్షల నికర దిగుబడి తీసుకోవచ్చు.

**సాగు వివరాలు:**

ఇది తీగ మాదిరిగా పాకుతూ పెరుగుతుంది. కాబట్టి కొమ్మలు వాలిపోకుండా ఎకరాకు దాదాపు 500 సిమెంట్ పోల్సు 10ఐ7 ఫీట్ల దూరంతో నాటుకోవాలి. పోల్ పై ఓ రౌండ్ సిమెంట్ బిళ్లను అమర్చాలి. కొందరు రైతులు టైర్లను అమరుస్తున్నారు. దీని ద్వారా మొక్కకు వేడి ఎక్కువ తాకి, కాయ, కాండం కుళ్లే అవకాశాలు ఉన్నాయి. ఒక్కో పోల్కు 4 మొక్కలు నాటుకోవాలి. అవి కిందికి వాలిపోకుండా.. తీగలు, ట్యూబ్లో గట్టిగా కట్టాలి.



**ప్రభుత్వ ప్రోత్సాహం:**

నీరు నిలువని సారవంతమైన అన్ని రకాల నేలలు, ప్రధానంగా ఇసుక నేలలు అనుకూలంగా ఉంటాయి. ఎంచుకున్న మొక్క రకాన్ని బట్టి ప్రతీ 15 రోజులకు ఒకసారి నీటిని అందించాలి. డ్రిప్ విధానం ద్వారా నీటిని అందిస్తే మొక్కలకు సమృద్ధిగా నీరు అంది, ఏకరీతిన పెరుగుతాయి. ఎకరం భూమిలో దాదాపు 1,800-2వేల వరకు మొక్కలు నాటుకోవాలి. ఒక చెట్టు దాదాపు 40-50 పండ్లనిస్తుంది. ఒక్కో పండు 400-500 గ్రాములు ఉంటుంది. సాధారణంగా రకాన్ని బట్టి, జూన్ నుండి డిసెంబర్ వరకు నెలకు ఒక పంట చొప్పున వస్తుంది. ఇందులో తెలుపు, ఎరుపు రకాలుంటాయి.

చాలా వరకు కొనుగోలుదారులు ఎరుపు రకాన్ని ఇష్టపడుతుంటారు. రుచికి తియ్యగా, అధిక ఔషధ గుణాలుండటంతో కొనుగోళ్లు ఎక్కువ జరుగుతున్నాయి.

కాబట్టి మీ నేల స్వభావం, మార్కెటింగ్ చూసుకున్న తర్వాతే సాగు మొదలుపెట్టండి. ప్రస్తుతం దీని సాగుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో రైతుకు కొంత వరకు ఆసరా అవుతోంది. నర్సరీల నుంచి మొక్కలు తెప్పించడం, గుంతలు తీయించడం, డ్రిప్ సౌకర్యం కల్పించడం వంటివి ప్రభుత్వమే చేస్తుంది. సాగుకు అధిక ఖర్చులు ఉండటంతో అర ఎకరానికి మాత్రమే రాయితీ ఇస్తుంది.

# పెటునియా పూల సాగు.!





పెటునియా ఎండాకాలంలో మాత్రమే పూసే వార్షిక మొక్క. కొన్ని రకాల పెటునియాలు బహు వార్షిక మొక్కలు. ఇది సొలనేసియా కుటుంబంలో చెందిన మొక్క. పెటునియా పూలు గరాటు ఆకారంలో ఉంటాయి. సంకరణ పద్ధతి ద్వారా వివిధ రకాల పూలు తయారు చేస్తారు. పెటునియా మొక్కలు బోర్డర్ మొక్కగా, కుండీలలో పెంచటానికి, వేలాడే పూల కుండీలలో వివిధ రకాలుగా పెంచవచ్చును. ట్రంపెట్ ఆకారంలో ఉన్న పెటునియా పూలు ఎండాకాలంలో ఫ్లవర్ బెడ్‌లలో, కిటికీలలో అలంకరణకు పెట్టి కుండీలలో పెంచుకోవచ్చు.

**రకాలు :** ల్కైమ్ ల్కైట్, రోజ్ స్టార్, షుగర్ డాడీ, కార్పెట్ సిరీస్, వేవ్ బ్లూ, ఫాంటసీ, మొదలగు రకాలు వివిధ రంగులలో, ఆకృతులలో పూలు వస్తాయి.

**వాతావరణం :** పెటూనియా మొక్కలు సూర్యకాంతి చానా అవసరం, సుమారుగా 5-6 గంటలు సూర్యకాంతి పడితే ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. నీడ ప్రాంతంలో పెంచితే తక్కువుగా పూలు వస్తాయి.

**నేలలు :** మంచి సారవంతమైన ఎర్ర నేలలు, ఇసుక నేలలు సాగుకు అనుకూలం, నేల ఉదజని సూచిక 6-7 ఉంటే మొక్క బాగా పెరుగుతుంది. ఉదజని సూచిక 7 కన్నా తక్కువుగా ఉంటే మొక్కలో ఇనుము లోపం తలెత్తుతుంది.

**ప్రవర్ధనము :** విత్తనం ద్వారా ప్రవర్ధనము : గ్రాండిఫ్లోర్ రకానికి చెందిన పెటూనియా మొక్కలను విత్తనం ద్వారా సాగుచేయవచ్చు. విత్తనం నాటడానికి ముందు నేలను బాగా దున్ను కోవాలి. దానికి కుళ్ళిన పశువుల ఎరువును కలుపుకొని నాటడానికి ఒక రోజు ముందు బాగా నీరు పెట్టాలి. 20-22% ఉష్ణోగ్రత వద్ద విత్తనం బాగా మొలకెత్తుతుంది. మొక్క వారం రోజుల వయసులో వేరు కుళు ్ళ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

లేత కాండం మొక్కల ద్వారా ప్రవర్ధనము : సుమారు 3 ఇంచెస్ పొడవుగల లేత కాండం మొక్కలు కాండం చివర కొన నుండి తీసుకోవాలి. సగం పొడవున వరకు ఆకులను తీసివేయాలి. ముందుగా సిద్ధం చేసి పెట్టుకున్న మట్టి మిశ్రమంలో నాటుకోవాలి.

**నాటడం :** ఎప్పుడు అయితే కొమ్మకు 3 - 4 వరుసల ఆకులు వస్తాయో అప్పుడు వాటిని తీసి కుండీలలో నాటుకోవాలి. నాటడానికి ముందు కుండీలోని మట్టి మిశ్రమాన్ని పూర్తిగా తడిచేయాలి లేదా వివిధ ప్రదేశాలలో అలంకారం కోసం బెడ్డింగ్స్‌గా, బోర్డర్స్‌గా, గుంపులుగా ఈ మొక్కలను నాటుకోవచ్చు. ఎరువులు నాటడానికి ముందు నేలలో కుళ్ళిన పశువుల ఎరువును వేసుకోవాలి. నాటిన తరువాత 450 గ్రా. 10-10-10 ఎరువును చదరపు మీటరు వైశాల్యంలో ఉన్న నేలకి వేయాలి.

**నీటియాజమాన్యం :** పెటునియా మొక్క కొంత వరకు ఎండను తట్టుకుంటుంది. కానీ నేల రకాన్ని బట్టి, నేలలోని తేమ శాతాన్ని బట్టి వారానికి ఒక్క సారి కానీ, రెండు సార్లు కానీ నీటిని ఇవ్వాలి.

**తలలు తుంచడం :** మొక్క 15 సెంటీ మీటరు పొడవు పెరిగిన తరువాత తలలు తుంచడం చేయాలి. పెటునియాలలో తలలు తీయడం వల్ల శాఖీదు పెరుగుదల తగ్గి, పక్క కొమ్మలు ఎక్కువుగా వచ్చి పూలు ఎక్కువుగా వస్తాయి. ఎండిపోయిన పూలను తుంచివేయడం వలన కూడా కొత్త పూలు ఎక్కువుగా వచ్చే అవకాశం ఉంది.

**ప్రూనింగ్ :** ఎండాకాలం బాగా ముదిరిన తరువాత పెటునియా మొక్క కాండం బాగా పెరిగి వాటి చివరన పూలు వస్తాయి. ఇలాంటి సందర్భం లో కాండను ప్రూనింగ్ చేయడం ద్వారా ఎ క్కువుగా పక్క కొమ్మలు వచ్చి ఎక్కువ పూలు పూస్తాయి.

# విశుద్ధ భక్తులుగా మార్చే భక్తిమంత్రం దామోదర దివ్య లీల!





పరమ పవిత్రమైన కార్తీకమాసానికే 'దామోదర మాసమని' కూడా పేరు. వైష్ణవ సంప్రదాయాన్ని పాటించేవారిలో కొందరు ఈ ప్రత్యేక మాసాన్ని పౌర్ణమినుండి పౌర్ణమివరకు, మరికొందరు అమావాస్యనుండి అమావాస్య వరకు జరుపుకుంటారు. ఈ మాసం పొడుగునా భక్తులు శ్రీకృష్ణుడిని దామోదరుడిగా కొలవడం విశేషం. తల్లి యశోద చేతిలో బద్ధుడై తాడుతో రోకలికి కట్టేయించుకున్న చిన్ని కృష్ణుని లీలనే 'దామోదర లీల'గా ప్రసిద్ధి చెందింది. ఆ విశేషాలే ఈవారం ఇక్కడ.

**గోష్టే దామోదర ఇతి గోపీభిః పరిగీయత....**

శ్రీకృష్ణునికిగల ఈ దామోదర నామం గొప్పతనాన్ని ఈ శ్లోకం చక్కగా వివరించింది. శ్రీకృష్ణుడు ఏ విధంగా భక్త పరాధీనుడో 'దామోదర లీల' చాటుతుంది. శ్రీకృష్ణుడు దేవాదిదేవుడైనా, దేవతామూర్తులు అందరూ వారి ఆధీనంలోనే వున్నా తన విశుద్ధభక్తురాలైన యశోదమ్మకు మాత్రం తానే బద్ధుడయ్యాడు. అదెలా అన్నదే ఇక్కడ అత్యంత ఆసక్తికరం. యశోదా కృష్ణుల మధ్యగల ఈ వాత్సల్యరసాన్ని శ్రీల ప్రభుపాదులవారు గొప్పగా వ్యాఖ్యానించారు. 'దేవదేవుడైన శ్రీకృష్ణుని లీలలతో కలిగే సంభ్రమాశ్చర్యాలకు ఇదొక ఉదాహరణ. సకల సర్వావస్థలలోనూ భగవంతుడు భగవంతుడే. తాను దేవాదిదేవుడైనా సరే, తన శుద్ధభక్తుని ముందు మాత్రం ఒక ఆటవస్తువుగా మారతాడు. విశుద్ధభక్తులైనవారు కేవలం అంతటి నిర్మలమైన ప్రేమభావనతోనే శ్రీకృష్ణునికి భక్తిపూర్వక సేవలు చేస్తారు. ఆ సమయంలో ఆ శుద్ధభక్తులు ఒక్కోసారి భగవంతుని నిజస్థితినీ మరచిపోతుంటారు. సహజ అనురాగంతో, అప్రయత్న పూర్వకంగా, ఐశ్వర్యభావ రహితంగా వారు చేసే ఆరాధనలను భగవంతుడు మరింత ప్రియంగా స్వీకరిస్తాడు.

**భగవంతుడు ఎప్పుడు అతిప్రసన్నుడవుతాడు?**

సాధారణంగా, ఎక్కువ మంది భక్తులు భగవంతుణ్ణి ఐశ్వర్యభావంతోనే సేవిస్తుంటారు. కానీ, భక్తుడు తన విశుద్ధమైన ప్రేమానురాగాల కారణంతో 'భగవంతుడు తనకన్నా అంత ముఖ్యుడు కాదని' తలుస్తుంటాడు. అప్పుడే ఆ దేవదేవుడు అతిప్రసన్నుడవుతుంటాడు. ఆదిధామమైన గోలోక బృందావనంలో ఇలాంటి భావనలోనే దామోదర లీలలు సాగాయి. కృష్ణుని స్నేహితులు అతనిని తమలో ఒకనిగానే భావించారు. మర్యాదపూర్వకమైన ప్రత్యేకతలు చూపాలని అనుకోలేదు. అదే విధంగా, విశుద్ధభక్తులైన శ్రీకృష్ణుని తల్లిదండ్రులుకూడా అతనిని తమ పిల్లాడిలానే భావించారు. తల్లిదండ్రుల చివాట్లనూ 'వేదమంత్రాల ప్రార్థనలకన్నా ప్రియంగా' విన్నాడు. జనసామాన్యాన్ని ఆకర్షించే నిమిత్తం దివ్యధామమైన గోలోక బృందావనంలోని తన నిత్యలీలలను ప్రదర్శించేందుకు ఆ దేవదేవుడైన శ్రీకృష్ణుడు ఈ భౌతిక జగత్తులో అవతరించినపుడు తన తల్లి యశోదకు సంపూర్ణ ఆధీనతనే ప్రదర్శించాడు. వెన్నకుండలను పగులగొట్టి అందులోని వెన్నను మిత్రులకు, తోటి ఆటగాళ్లకు, బృందావనంలోని భాగ్యవంతమైన కోతులకు పంచి పెట్టి, యశోదమ్మ కూడబెట్టిన వెన్నను పాడు చేసేవాడు.

**కన్నీటి పర్యంతమైన కృష్ణుడు....**

యశోదమ్మ అది చూసి, ప్రేమతో తన పుత్రునిపట్ల ఒక బూటకపు శిక్షను ప్రదర్శించాలని అనుకుంది. సాధారణంగా, ఇండ్లలో జరిగే విధంగా 'ఒక తాడు తెచ్చి బంధిస్తున్నానని' కృష్ణుడిని భయపెట్టింది. యశోదమ్మ చేతిలోని తాడును చూసి భగవంతుడు భయంతో తల దించుకొని, సామాన్య బాలుని వలె ఏడవటం ప్రారంభించాడు. ఆ కన్నీటితో కంటి కాటుక చెదరిపోయింది. కన్నీరు చిన్నిబుగ్గలపై ఏకధాటిగా కారసాగింది. శ్రీకృష్ణుని దివ్యస్థితిని గురించి తెలిసిన కుంతీదేవికి ఈ సన్నివేశం అత్యంత ప్రియంగా తోచింది. వాస్తవానికి, శ్రీకృష్ణుడు భయానికే భయం కలిగించేవాడైనా తనను శిక్షించాలనుకున్న తల్లిని చూసి భయపడ్డాడు.

కుంతీదేవికి ఆ దేవదేవుని దివ్యత్వం తెలుసు. యశోదమ్మ ఇవేవీ పట్టించుకోలేదు. ఆమె స్థితి కుంతీదేవికన్నా ఉన్నతమైంది. యశోదమ్మ భగవంతుడినే తన పుత్రునిగా పొంద గలిగింది. అయితే, తన పుత్రుడు భగవంతుడనే విషయాన్ని యశోదమ్మ మరచిపోయేలా చేసింది ఆ దేవదేవుడే. ఒకవేళ ఆమెకు శ్రీకృష్ణుని దివ్యత్వమే తెలిసి వుంటే అతనిని శిక్షించడానికి సంకోచించేది. కానీ, తాను తన ప్రియమైన తల్లిముందు బాల్యచేష్టలను ప్రదర్శించాలని శ్రీకృష్ణుడు తలచడం వల్ల ఆ విషయాన్ని యశోదమ్మ మరచిపోయేలా చేశాడు.

**ఎంతటి అదృష్టవంతురాలో....**

ఆ తల్లి తనయుల నడుమ వాత్సల్య భావన అక్షరాలకు అందనిది. అత్యంత సహజాతి సహజంగా అది వెల్లడైంది. ఈ సంఘటనను తలచుకున్న కుంతీదేవి మోహపరవశురాలైంది. ఆ తల్లీ తనయుల ప్రేమను కీర్తించడం కన్నా మరొకటి చేయలేకపోయింది.

సర్వశక్తి సంపన్నుడైన శ్రీకృష్ణుడినే ప్రియపుత్రునిగా అదుపులో వుంచగలిగిన యశోదమ్మ ప్రేమస్థితి అద్వితీయం, అనిర్వచనీయం. చరాచర జగత్తులోని సమస్త ప్రాణులకూ ముక్తిని ప్రసాదించేవాడైన ఆ దేవదేవునితో బ్రహ్మదేవుడు గాని, పరమశివుడు గాని, చివరకు అర్థాంగి సాక్షాత్తు లక్ష్మీదేవి గాని పొందని దుర్లభమైన కృప తల్లి యశోద పొందింది (శ్రీమద్భాగవతం: 10.9.20). శ్రీల ప్రభుపాదవంటి గొప్ప విశుద్ధభక్తుని మార్గనిర్దేశకత్వంలో 'మనమూ శ్రీకృష్ణునిపై అంతటి గొప్పభక్తిని కలిగివుందాం'. అంతటి నిర్మల భక్తుడు మాత్రమే కృష్ణభక్తిని జాతి, కుల, మత బేధాలకు అతీతంగా సమస్త మానవాళికీ ప్రసాదించగలడు.

**భగవంతుడు ఒక్కడే....!**

ఎంతోమంది తాము భగవంతుడవ్వాలనే కోరికతో ఆధ్యాత్మికంగా అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటి వారికి చివరకు మిగిలేది వట్టి ప్రయాస మాత్రమే. ఎందుకంటే, జీవాత్మ ఎన్నటికీ భగవంతుడు కాలేడు గనుక. భగవంతుడనేవాడు ఎన్నటికీ ఒక్కడే. జీవాత్మలమైన మనమంతా భగవంతుని అంశా స్వరూపులం. పరమాత్మ ముందు జీవాత్మ అత్యంత అల్పం. కేవలం మనలోని అహంకారమే మనం పరమాత్మతో సమానమనే భావనను కలిగిస్తుంటుంది. ఇది మానవుని అతిపెద్ద భ్రమ. కానీ, భక్తులు మాత్రం తమకుగల విశుద్ధమైన ప్రేమతో యశోదమ్మలా భగవంతుణ్ణే జయిస్తుంటారు. ఇది శ్రీకృష్ణుడు తన భక్తులపై చూపే కారుణ్యవర్షం. యశోదమ్మ పొందిన ఈ మహద్భాగ్యాన్ని శుకముని కొనియాడిన తీరు అపురూపం.

# అభ్యాస నిష్ఠతోనే ఆధ్యాత్మిక పరిమళం!

అభ్యాసమంటే ఉద్దేశపూర్వకంగా, నియమబద్ధంగా పదేపదే చేసే ప్రయత్నం. మనిషి జీవితం సంస్కృతి, నాగరికతలతో నిర్మితమయ్యేది కాబట్టి, మారే వ్యావహారిక విలువలను, సాంకేతిక నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అలవరచుకొని సమర్థ జీవనం గడపవలసి ఉంటుంది. కాలం గడిచేకొద్దీ ఈ మార్పుల వేగం పెరుగుతుండటం వల్ల వాటికి అనుగుణంగా మనిషి తన అభ్యాస నేర్పునూ పెంచుకోవలసి వుంటుంది. ప్రాతఃకాలంలో చేసే అభ్యాసం అనతికాలంలో సత్ఫలితాన్నిస్తుందన్నది అనుభవజ్ఞుల మాట. ఇతర జీవులలో సహజాతాల పాత్ర ఎక్కువకానీ, మనిషి జీవనంలో అభ్యాసానిదే ప్రధానపాత్ర. అది ఐహిక విషయమైనా, ఆముష్మిక విషయమైనా. సాధారణంగా ఐహిక విషయాలలో ఒకటి నేర్చుకొనడానికి చేసే చక్రీయకృషిని 'అభ్యాసం' అంటాం. ఆముష్మికాంశాలలో ఒక దిశలో స్వభావగతంగా ఎదగడానికి చక్రీయంగాగానీ, నిరంతరంగాగానీ చేసే కృషిని 'సాధన' అంటాం. ఏదేని విషయాన్ని నేర్చుకొనడంలో, నేర్చుకొన్నది దోషాలు తొలగి బలపడటంలో, బలపడింది అవగాహనలో వికసించడంలో, అట్లా వికసించింది మన స్వభావంగా మారడంలో 'అభ్యాసమే' కీలక ఊతమై నిలుస్తుంది. అప్పుడు మనం నేర్చుకొన్నది సందర్భోచితంగా, సహజంగా, సమర్థంగా, అప్రయత్న ప్రవర్తనగా ప్రకటితమవుతుంది. 'అభ్యాసం కూసు విద్య' అన్న నానుడికి అసలు అర్థం ఇదే. ఇంగ్లిషులో దీన్నే 'సెకండ నేచర్' అంటారు. అభ్యాసానికి ముందు నిర్ధారిత విషయ పరిజ్ఞానం, ప్రయోగ మార్గదర్శనం అనుభవజ్ఞులైన గురువుల నుండి తప్పనిసరిగా పొందవలసిందే. లేకుంటే కృషి సరైన దిశలో సాగక సత్ఫలితాలకు బదులు దుష్ఫలితాలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే అంటారు మనవాళ్ళు, 'గురువు లేని విద్య గుడ్డివిద్య' అని. సాధారణంగా అభ్యాస స్థాయి వ్యక్తి వయసు, మానసిక పరిణతి, పట్టుదలపైన ఆధారపడి ఉంటుంది. మనకు అందే, మనం పొందే ప్రేరణాబలం వాటి



పరిమితులను కొంతవరకు చెరుపగలుగుతుంది. అభ్యాసం కుంటుబడకుండా సవ్యంగా, సబలంగా సాగడానికి తదనుకూలమైన ఆహార అలవాట్లు, పరిసరాలు, సాంగత్యం వంటివీ అత్యవసరం. ఈ విషయంలో జాగ్రత్తపడకుంటే తగు స్థాయి ఫలితాలు సంప్రాప్తించకపోగా, వైఫల్యమూ ఎదురవవచ్చు. అభ్యాస నాణ్యతను, ఉన్నతిని నిర్ణయించే ఇంకొక అతి ముఖ్యమైన విషయం 'అభ్యాసకుడి వైఖరి' (ఆటిట్యూడ్). ఇది స్వార్థపూరితమైతే అభ్యాసం తీవ్ర ఏకాగ్రతతో సాగినా, ఆశించిన ఫలం సంపూర్ణంగా లభించినా, ఆ ఫల వినియోగం పరహితాన్ని మరచి అహంకారంతో, అత్యాశతో, భయక్రోధాదులతో సాగి పాపాన్ని మూటకడుతుంది. పర్యవసానంగా అది సాధకుని వినాశనానికే దారితీస్తుంది. ఒకవేళ ఈ వైఖరి పరహితార్థమైందైతే ఆ ఫల వినియోగం సకల సజ్జన సుఖాపేక్షతో, ప్రేమ, సంతోషం, తృప్తి వంటివాటితో సాగి పుణ్యాన్ని మోసుకొస్తుంది. ఈ నిస్వార్థ వైఖరే నిరంతరం అంతఃప్రేరణగా ప్రజ్వలిస్తూ అభ్యాసాన్ని పవిత్రనిష్ఠగా, నిరవధికంగా కొనసాగింపజేస్తుంది. అలాంటి అభ్యాసమే జీవన కౌశలాలను పదునుపరచి, మూల్యాలను మెరుగుపరచి, సమర్థతతో సమాజంలో ఆదర్శప్రాయునిగా నిలిపి, అనుభూతిలో సంతృప్తిని నింపి, సంస్కారాలకు పుణ్యబలాన్నిచ్చి జన్మను సార్థకం చేస్తుంది. మన జీవన విధానంలోకానీ, పలు రకాల అభ్యాసాలలోకానీ ఆధ్యాత్మిక ప్రభను అంటే ప్రకృతిపట్ల, సమాజం పట్ల, వాటి శాసనసూత్రమైన ఈశ్వర శక్తిపట్ల ఆర్ద్ర, అభేద, ఆత్మీయ, అనన్య భావనను ప్రతిష్ఠింపజేయాలి. దీంతో దక్కే ఏ ఫలాన్నైనా 'ఈశ్వర ప్రసాదం'గా స్వీకరించినప్పుడు జీవితమే కర్మయోగమవుతుంది. ఏ కర్మాసక్తులూ కట్లు బిగించవు. అప్పుడు జీవితం 'మోక్ష పథగామి'గానూ సాగుతుంది. అభ్యాస జీవనాన్ని ఇలా ఆధ్యాత్మిక పరిమళంతో నింపుకోవడం ద్వారా భౌతిక జీవనాన్ని ధర్మబద్ధంగా సంపన్నమయం చేసుకోగలం. ఫలితంగా పుణ్యగంధాల ఆత్మానందంతో మానవజన్మ ధన్యమవుతుంది.



# సకల ఐశ్వర్య ప్రదాయకం ఓం శ్రీం శ్రియై నమః

సువర్ణవృద్ధిం కురు మే గృహే శ్రీః
సుధాన్యవృద్ధిం కురు మే గృహే శ్రీః
కళ్యాణవృద్ధిం కురు మే గృహే శ్రీః
విభూతి వృద్ధిం కురు మే గృహే శ్రీః

ధనం, ధాన్యం, పుత్రులు, మిత్రులు, బంధువులు, వాహనాలు, భృత్యులు, దాసీజనం మొదలైన వానిని 'అష్ట ఐశ్వర్యాలు' అని పూర్వకాలంలో అనేవారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యం, సంతోషం, సంతృప్తి, ప్రశాంతత, ధైర్యం, జ్ఞానం, విద్య, శక్తి మొదలైన వానిని 'అష్ట ఐశ్వర్యాలు'గా గుర్తించాల్సి ఉంది. మొదటివి కనిపించే ఐశ్వర్యాలు కాగా, తర్వాతివి కనిపించకుండా మనలోనే ఉండి మనలను ప్రేరేపించి, మన స్థాయిని పెంచే ఐశ్వర్యాలు. ఇవన్నీ మనలో, మనతోనే ఉండాలంటే మనం వాటికి మూలమైన పాంచభౌతిక శక్తితో కలిసి ఉండాలి. కనిపించే సంపదలన్నీ అనుభవిస్తుంటే అయిపోతుంటాయి. కనిపించని సంపదలు ఎంత అనుభవించినా తరగకుండా ఉంటాయి. సంతోషం, ధైర్యం, ఆరోగ్యం, జ్ఞానం మొదలైన వాటన్నిటికీ లెక్కలు కట్టడం అసాధ్యం. ఇవి తరగని సంపదలు. ఇంకా పెరుగుతూనే ఉంటాయి. వాటిని ఇంకా పెంచుకుంటూ పోవాలి. అవి పెరుగుతుంటేవ్యక్తిలో శక్తి పెరిగి, నందాత్ముడవుతుంటాడు. మనలోని, మన చుట్టూ వున్న పాంచభౌతిక శక్తికే 'శ్రీం' అని పేరు. ఆ శక్తితో మనం ఎంత ఎక్కువసేపు గడిపితే అంతగా మనలోకి ప్రసరించి, మన మానసిక, భౌతిక శరీరాలను సమన్వయం చేస్తుంది.

# రాశిఫలాలు



**మేషం :** ఇతరులతో గౌరవించబడే ప్రయత్నంలో సఫలమవుతారు. కుటుంబపరిస్థితులు సంతృప్తికరంగా లేకపోవడంతో మానసిక ఆందోళన చెందుతారు. ప్రతిపని ఆలస్యంగా పూర్తిచేస్తారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా ఉండటం మంచిది. విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

**వృషభం :** విందులు, వినోదాలకు దూరంగా ఉండట మంచిది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంది. మానసిక ఆందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలు ఎదురవుతాయి. ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ అవసరం.

**మిథునం :** తోటివారితో విరోధం ఏర్పడకుండా జాగ్రత్త వహించడం మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలు ఉన్నాయి. వృధా ప్రయాణాలు ఎక్కువ చేస్తారు. కుటుంబ విషయాల్లో అనాసక్తితో ఉంటారు. స్త్రీలు విశ్రాంతి తీసుకోవడం అవసరం.

**కర్కాటకం :** ప్రయాణాలు ఎక్కువగా చేయాల్సి వస్తుంది. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. అనవసరంగా డబ్బు ఖర్చవడంతో ఆందోళన చెందుతారు. విదేశయాన ప్రయత్నాలకు మార్గం సుగమమవుతుంది. ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించక తప్పదు.

**సింహం :** నూతన గృహకార్యాలపై శ్రద్ధవహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలు అధికమవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడతాయి.

**కన్య :** ఆకస్మిక ధనలాభంతో రుణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచిపేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకోవడానికి కృషిచేస్తారు. స్త్రీలు, బంధు, మిత్రులను కలుస్తారు. కుటుంబపరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి.

**తుల :** ఆకస్మిక ధనలాభం ఉంటుంది. కుటుంబం అంతా సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ప్రయత్నకార్యాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ఒక ముఖ్యమైన పని పూర్తికావడంతో మిక్కిలి ఆనందిస్తారు. కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. శాశ్వత పనులకు శ్రీకారం చుడతారు.

**వృశ్చికం :** మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శతృబాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగి ఉంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక లాభాలు ఉంటాయి.

**ధనుస్సు :** ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా ఉండటం మంచిది. అనారోగ్య బాధలను అధిగమించడానికి ఔషధసేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు. రుణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. సోదర వైరం కలిగే అవకాశం ఉంటుంది.

**మకరం :** కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఎదురవుతాయి. వృథా ప్రయాణాల వల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా ఉండటం మంచిది. అందరితో స్నేహంగా ఉండటానికి ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా ఉంటాయి.

**కుంభం :** కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా ఉన్నాయి. వేళప్రకారం భుజించడానికి ప్రాధాన్యమిస్తారు. చంచలం వల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏమాత్రం అశ్రద్ధ పనికిరాదు.

**మీనం :** కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనంవహించడం అన్నివిధాలా మేలు. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. బంధు, మిత్రులతో విరోధం ఏర్పడకుండా జాగ్రత్తపడటం మంచిది. అనవసర ధనవ్యయంతో రుణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది.

## సమస్యా నీదే.. పరిష్కారమూ నీదే!

**- గీతా వాక్యం - న కాంక్షే విజయం కృష్ణ! న చ రాజ్యం సుఖానిచ!**

**- కింనో రాజ్యేన గోవింద! కిం భోగైర్జీవితేన వా? (భగవద్గీత - 1- 32)**

'కృష్ణా! నాకు విజయంపై కోరికలేదు. ఓ! గోవిందా.. నాకు ఈ రాజ్యంతో గానీ, భోగాలతో గానీ, జీవితంతో గానీ ఏ విధమైన ప్రయోజనం లేదు!' అంటూ కురుక్షేత్రంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు. అది కురుక్షేత్రం. అంటేనే కార్యక్షేత్రం. అక్కడ కర్తవ్యాన్ని నిర్వహించాలే కానీ, సొంత భావనలకు అవకాశం ఉండదు. క్షత్రియుడిగా అర్జునుడి కర్తవ్యం ధర్మహాని జరుగుతున్న సమయంలో, అధర్మాన్ని నిగ్రహించి ధర్మాన్ని సంస్థాపించడం. నిర్దేశిత ధర్మాచరణకు సిద్ధమై కురుక్షేత్రానికి వచ్చిన అర్జునుడు.. ఇరుసైన్యాలలో తనవారిని చూసి, విమోహియై అస్త్రసన్యాసం చేస్తున్నాడు. కార్యాచరణవేళ సమర్థుడైన వ్యక్తి అస్త్రసన్యాసం చేయడం అవాంఛనీయం. లక్ష్యం నిర్దేశితమైంది. వనరులు సమకూర్చుకున్నారు. యోజనా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎవరి బాధ్యతలు వారికి అప్పగించడం జరిగింది. అర్జునుడి కార్య నిర్వహణా దక్షత, ధైర్య సాహసాలు, ప్రజ్ఞాపాటవాలు, గతంలో తాను సాధించిన విజయాలు ప్రాతిపదికగా.. అతణ్ని పూర్తిగా నమ్మి ఏడు అక్షౌహిణులతో పదకొండు అక్షౌహిణుల సైన్యాన్ని ఎదిరించడానికి రంగం సిద్ధమైంది. ఆ సమయంలో అర్జునుడు అస్త్రసన్యాసం చేశాడు. ఇక్కడ కృష్ణా, గోవిందా అనే రెండు సంబోధనలు ముఖ్యమైనవి. 'కృష్.' అనేది భూవాచకం. భూమి ఫలితాన్నిస్తుంది. భూమి కృషికి, కర్తవ్యపాలనకు సంకేతం. 'ణ' కారం నివృత్తి మార్గం. ఫలితాపేక్షతో చేసే కృషి వల్ల మోక్షం రాదు. ఫలితాపేక్షలేకుండా ఎవరైతే కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహిస్తారో వారికి మోక్షం వస్తుంది. 'నేను చంపుతున్నాను' అనే కర్తృత్వ భావన అర్జునుడిలో ఉంది. గోవిందా అనడంలో 'గో' శబ్దం ఇంద్రియాలకు ప్రతీక. ఇంద్రియాలను జయించిన వారికి శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చేవాడు గోవిందుడు. ఇంద్రియాలను జయించడం అంటే ఇంద్రియాల పని విధానాన్ని అవగాహన చేసుకొని, వాటిని ప్రభావవంతంగా ఉపయోగించుకోవడం మాత్రమే. జీవితమనే మరొక పదం ఉన్నది ఇందులో. బతకడం వేరు, జీవించడం వేరు. జీవించడంలో ప్రయోజనం ఉంది. అర్థవంతమైన, ప్రయోజనకరమైన, ఆనందకరమైన, అభ్యుదయకారకమైనది జీవితం. సుఖభోగాలు రెండూ భౌతిక జీవితానికి సంబంధించినవే. ప్రలోభానికి గురిచేసేవే. రాజ్యమూ శాశ్వతం కాదు. 'అశాశ్వత రాజ్యభోగాల కోసం, అయినవారిని అంతమొందించడం యుక్తమా?' అని సంశయిస్తున్నాడు

Printed, Published and Owned by J BHASKER, and Printed at Sunday Printing Press, H.No.361, Bhagyalaxmi Colony, Quthbullapur, MEDCHAL MALKAJGIRI, Telangana- 500054. and Published from H.No.3-87, Gangaram, Marepalli, Kondapur, SANGAREDDY, TELANGANA - 502306.. Editor: J BHASKER. PRGI NO : TGTEL/25/A3369 Email: samastaprakshalanam@gmail.com. Phone No: 9959479375, 9398191920.